

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 3-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 298 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి మ.3:33 తదుపరి పాడ్యమి, నక్షత్రం: ఆర్ద్ర సా.5:28 తదుపరి పునర్వసు, వర్జ్యం: తె.4:19-5:46, దుర్ముహూర్తం: ఉ.6:49-8:17, అమృతఘడియలు: ఉ.8:33-9:58, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం:6:49, సూర్యాస్తమయం: 5:49 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,36,200	1,24,850	2,60,000
విజయవాడ	1,39,500	1,29,500	2,43,000
విశాఖపట్నం	1,38,700	1,24,850	2,60,000
రాజమండ్రి	1,36,200	1,24,850	2,30,000
ప్రొద్దుటూరు	1,38,400	1,27,330	2,42,500
ముంబై	1,34,780	1,23,460	2,34,550

రూ.500 నోట్లు రద్దుకావు..



న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి నుంచి రూ.500 నోట్లను రిజర్వ్ బ్యాంక్ రద్దు చేయనుందని, అవి ఏటి ఎంల నుంచి కూడా ఉపసం హరిస్తారంటూ పలు వదంతులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్నాయని, వాటిని నమ్మవద్దని ప్రభుత్వం ప్రజలకు సూచించింది. అది 'అసత్య ప్రచారం' అని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ నుంచి అలాంటి ప్రకటన ఏదీ వెలువడలేదని కూడా ప్రభుత్వం ఆ ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ ప్రచార మాధ్యమం పత్రికా సమాచార కార్యాలయం "ఎక్స్" ఖాతాలో ఈ మేరకు ఒక పోస్ట్ ప్రచురించింది. రూ.500 నోట్లు యథాప్రకారం చట్టబద్ధమైన కరెన్సీగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. రూ.500 నోట్లపై ఇలాంటి వదంతులు ప్రచారం చేయడం ఇది మొదటి సారి కాదని, గతంలో కూడా ఇలాంటి వదంతులు రావడం, వాటికి ప్రభుత్వం వివరణలు ఇవ్వడం జరిగిందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	640
వరంగల్	632	గోదావరి	625
చిత్తూరు	693	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	విజయవాడ	147
వరంగల్	150	గుంటూరు	152
కరీంనగర్	150	ఒంగోలు	152
మహబూబ్‌నగర్	150	చిత్తూరు	148
కర్నూలు	150	నెల్లూరు	153
విశాఖపట్నం	133	అనంతపురం	153
గోదావరి	147		

ఎంఎస్ఎంఈ ఎగుమతులకు చేయూత



రూ.7,295 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ

- వడ్డీ సబ్సిడీ కోసం రూ.5,181 కోట్లు
- రుణాల హామీ కోసం రూ.2,114 కోట్లు

న్యూఢిల్లీ: ట్రంప్ టారిఫ్‌ల యుద్ధంతో అల్లాడుతున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీలకు (ఎంఎస్ఎంఈ) కేంద్ర ప్రభుత్వం మరో శుభ వార్త చెప్పింది. ఈ కంపెనీలను ఆదుకునేందుకు రూ.7,295 కోట్లతో ప్రత్యేక ప్యాకేజి ప్రకటించింది. ఇందులో రూ.5,181 కోట్లు ఈ కంపెనీలు తీసుకునే రుణాలపై వడ్డీ సబ్సిడీ కింద అందజేస్తారు. మరో రూ.2,114 కోట్లు ఈ కంపెనీలు తీసుకునే రుణాలకు హామీగా ఇస్తారు. వచ్చే ఆరేళ్లలో (2025-31) ఈ ప్యాకేజి అమలు చేస్తామని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అజయ్ భాదూ చెప్పారు. ప్రస్తుత ప్రతికూల అంతర్జాతీయ పరిస్థితుల్లో మన ఎంఎస్ఎంఈల ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక ప్యాకేజి దోహదం చేస్తుందని తెలిపారు.

రెండో దశలో..

ఎంఎస్ఎంఈల ఎగుమతుల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నవంబరులోనే రూ.25,060 కోట్లతో ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం) పేరుతో ప్రత్యేక పథకం ప్రకటించింది. ఈ పథకం రెండో దశలో భాగంగా ప్రభుత్వం తాజాగా ఈ ప్రత్యేక ప్యాకేజి అమలు చేయనుంది. ఈపీఎం పథకం తొలి దశలో ఎంఎస్ఎంఈల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం గత ఏడాది డిసెంబరు 31న రూ.4,531 కోట్లు విడుదల చేసింది. ఎగుమతుల రంగంలో ఉన్న ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను అధిగమించేందుకు ఈ ప్యాకేజిని ఉద్దేశించినట్టు అజయ్ తెలిపారు.

ముఖ్యాంశాలు ..

- అర్హత ఉన్న ఎంఎస్ఎంఈల ఎగుమతులకు మాత్రమే రుణ, వడ్డీ సబ్సిడీ.
- ఎగుమతి రుణాలపై 2.75 శాతం వడ్డీ సబ్సిడీ.
- ఒక్కో ఎంఎస్ఎంఈకి ఏటా రూ.50 లక్షలకు మించకుండా వడ్డీ సబ్సిడీ.
- ఎగుమతి రంగంలోని ఒక్కో ఎంఎస్ఎంఈ తీసుకునే వర్కింగ్ క్యాపిటల్ రుణాలకు కోసం రూ.10 కోట్లకు మించకుండా హామీ.
- సూక్ష్మ, చిన్న కంపెనీల వర్కింగ్ క్యాపిటల్ రుణ చెల్లింపుల్లో 85 శాతం వరకు, మధ్య తరహా కంపెనీల వర్కింగ్ క్యాపిటల్ రుణాల్లో 65 శాతం వరకు చెల్లింపులకు హామీ.
- జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి ఏటా మార్చి, సెప్టెంబరు నెలల్లో వడ్డీ రాయితీపై సమీక్ష.
- ఆర్‌బీఐ, డీజీఎఫ్‌టీ సంయుక్తంగా ఈ ప్యాకేజిని అమలు చేస్తాయి.
- ఎంపిక చేసిన ఉత్పత్తుల రంగంలో ఉన్న ఎంఎస్ఎంఈలకు మాత్రమే వడ్డీ సబ్సిడీ, రుణ చెల్లింపుల హామీ.
- నియంత్రిత వస్తువులు, వేస్ట్, స్క్రాప్, పీఎల్ఐ పథకంలోని ఎంఎస్ఎంఈలకు ఈ రాయితీలు వర్తించవు.

ఎలక్ట్రానిక్స్ తయారీలో రూ.41,863 కోట్ల పెట్టుబడులు

22 కంపెనీలకు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రానిక్ విడి భాగాల తయారీ పథకానికి (ఈసీఎంఎస్) కంపెనీల నుంచి మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ఈ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మూడో దశ కింద మరో 22 కంపెనీల నుంచి వచ్చిన రూ.41,863 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ కంపెనీలు ఆంధ్రప్రదేశ్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో తమ యూనిట్లు ఏర్పాటు చేస్తాయి.ఈ కంపెనీలు ఉత్పత్తి ప్రారంభిస్తే రూ.2,58,152 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు ఉత్పత్తి అవుతాయని, మరో 33,791 మందికి ప్రత్యక్ష ఉపాధి సాధ్యమవుతుందని కేంద్ర ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈసీఎంఎస్ కింద తాజాగా ఆమోదం పొందిన కంపెనీల్లో డిక్సన్, సామ్‌సంగ్ డిస్‌ప్లే నోయిడా ప్రైవేట్ లిమిటెడ్, ఫాక్స్‌కాన్, హిండాల్కో ఇండస్ట్రీస్, టాటా ఎలక్ట్రానిక్స్, అమర రాజా-ఏటీఎల్ వంటి కంపెనీలున్నాయి.

మార్చి 2 వరకు పాలసీల పునరుద్ధరణ:ఎల్ఐసీ

న్యూఢిల్లీ: లాప్స్ అయిన పాలసీల పునరుద్ధరణకు ఎల్ఐసీ ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఈ నెల 1వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు ఇందుకు వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏదైనా పాలసీపై ప్రీమియం చెల్లించడం ఆపేసిన ఐదేళ్లలోపు లోపు బాకీ ఉన్న ప్రీమియం చెల్లించి ఆ పాలసీలను పునరుద్ధరించుకోవచ్చు. బాకీ ప్రీమియం చెల్లింపులపై రూ.3,000 నుంచి రూ.5,000 మించకుండా 30% రాయితీ కూడా లభిస్తుందని ఎల్ఐసీ తెలిపింది.

కియా సరికొత్త సెల్టోస్ ధర రూ.10.99 లక్షలు

న్యూఢిల్లీ: కియా ఇండియా ఇటీవల ఆవిష్కరించిన సరికొత్త సెల్టోస్ ధరను శుక్రవారం ప్రకటించింది. ఆరు వెర్షన్లలో, ఎనిమిది వేరియెంట్లలో అందుబాటులో ఉండే ఈ కారు ఎక్స్ షోరూమ్ ప్రారంభ ధర రూ.10.99 లక్షలు కాగా టాప్ వేరియెంట్ ధర రూ.19.99 లక్షలుగా ఆ ప్రకటనలో తెలిపింది.

జనవరిలోనూ టెకీలకు నిరాశే

24 శాతం తగ్గనున్న నియామకాలు: ఎక్స్‌ఫెనో

న్యూఢిల్లీ: కొత్త ఏడాది కూడా టెకీలకు కలిసొచ్చే సూచనలు కనిపించడం లేదు. ఈ నెల వీరి నియామకాలు 1.03 లక్షలు మించకపోవచ్చని కంపెనీలకు ప్రత్యేక నిపుణుల నియామక సేవలందించే ఎక్స్‌ఫెనో ఒక నివేదికలో తెలిపింది. గత ఏడాది జనవరితో పోలిస్తే ఇది 24% తక్కువ. 2021 జనవరి తర్వాత టెకీల నియామాలు ఈ స్థాయిలో పడిపోవడం ఇదే మొదటిసారి. గత నెలతో పోల్చినా, ఈ నెలలో వీరి నియామకాలు ఒక శాతం తక్కువగానే ఉంటాయని ఎక్స్‌ఫెనో తెలిపింది. 2022 జనవరి నెలలో వీరి నియామకాలు రికార్డు స్థాయిలో 2.6 లక్షలకు చేరాయి. అప్పటితో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో ఈ నియామకాలు దాదాపు 60% పడిపోనున్నాయి. టెక్ రంగంలో ప్రస్తుతం చోటు చేసుకుంటున్న మార్పులతో టెకీల నియామకాలు మళ్లీ గతంలోలా పుంజుకునేందుకు అవకాశాలు ఏ మాత్రం కనిపించడం లేదని ఎక్స్‌ఫెనో సహ వ్యవస్థాపకుడు కమల్ కారంత్ చెప్పారు.

సిల్వర్ హైజంప్



విలువైన లోహాల ధరలు మళ్లీ ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.1,100 పెరిగి రూ.1,39,440కి చేరింది. కిలో వెండి ఏకంగా రూ.4,000 ఎగబాకి రూ.2,41,400 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా పెరగడంతోపాటు రూపీ క్షీణత ఇందుకు కారణం. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ మళ్లీ 4,400 డాలర్లకు చేరగా.. సిల్వర్ 74 డాలర్ల ఎగువన ట్రేడైంది.

నిఫ్టీ సరికొత్త రికార్డు

- ఇంట్రాడేలో 26,340 వద్దకు చేరిక
- రూ.4.32 లక్షల కోట్ల సంపద వృద్ధి



ముంబై: స్టాక్ మార్కెట్ మదుపరులు శుక్రవారం జోరుగా కొనుగోళ్లు జరిపారు. దాంతో నిఫ్టీ ఒకదశలో 193.45 పాయింట్లు ఎగబాకి 26,340 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 182 పాయింట్ల లాభంతో 26,328.55 వద్ద స్థిరపడింది. సూచీ లాభపడటం వరుసగా ఇది మూడో రోజు. సెన్సెక్స్ 573.41 పాయింట్ల వృద్ధితో 85,762.01 వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.4.32 లక్షల కోట్లు పెరిగి రూ.481.24 లక్షల కోట్లకు చేరుకుంది. పవర్, బ్యాంకింగ్, మెటల్, వాహన రంగాల షేర్లలో కొనుగోళ్లు ఊపందుకోవడంతోపాటు దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు, ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలు ఇందుకు దోహదపడ్డాయి. డిసెంబరు త్రైమాసికానికి కంపెనీల ఆదాయ వృద్ధి మరింత మెరుగుపడవచ్చన్న అంచనాలు సైతం కొనుగోళ్లను ప్రేరేపించాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

మరింత తగ్గిన పొగాకు షేర్లు: ఐటీసీ మరో 4% డౌన్

కేంద్ర ప్రభుత్వం తాజాగా విధించిన పన్ను కారణంగా సిగరెట్లు సహా పొగాకు కంపెనీల షేర్లు వరుసగా రెండో రోజూ భారీగా నష్టపోయాయి. ఐటీసీ షేరు బీఎస్ఈలో శుక్రవారం ఒకదశలో 5.11% క్షీణించి మూడేళ్ల కనిష్ఠ స్థాయి రూ.345.35కి పతనమైంది. చివరికి 3.79% నష్టంతో రూ.350.15 వద్ద ముగిసింది. దాంతో సెన్సెక్స్, నిఫ్టీల్లో టాప్ లూజర్‌గా మిగిలింది. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ స్టాక్ కూడా ఇంట్రాడేలో 4.58% వరకు క్షీణించినప్పటికీ, చివరికి 1.7% నష్టంతో రూ.2,250.65 వద్ద ముగిసింది. వీఎస్‌టీ ఇండస్ట్రీస్ షేరు 1.49% తగ్గి రూ.251.35 వద్ద క్లోజైంది.

ఎల్ఐసీకి రూ.11,500 కోట్లు నష్టం

గత రెండు సెషన్లలో ఐటీసీ షేరు సుమారు 14% నష్టపోవడంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.72,000 కోట్ల మేర తరిగిపోయి రూ.4.38 లక్షల కోట్లకు పడిపోయింది. అంతేకాదు, ఐటీసీలో 15.86% వాటా ఉన్న ఎల్ఐసీ పెట్టుబడుల విలువ కూడా రూ.11,500 కోట్ల మేర కరిగిపోయింది.

మళ్లీ రూ.90 దాటిన డాలర్: గడిచిన కొన్ని రోజుల్లో కాస్త తగ్గుతూ వచ్చిన అమెరికన్ డాలర్ విలువ మళ్లీ రూ.90 స్థాయిని దాటేసింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు శుక్రవారం 22 పైసల నష్టంతో రూ.90.20 వద్ద ముగిసింది.

స్పోర్ట్స్

ఐదేళ్ల తర్వాత బరిలో..



ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వీనస్‌కు వైల్డ్‌కార్డ్

మెల్‌బోర్న్: ఏడు సింగిల్స్ గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ వీనస్ విలియమ్స్ ఐదేళ్ల తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తలపడుతోంది. ఈమేరకు నిర్వాహకులు ఆమెకు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇచ్చారు. 45 ఏళ్ల వీనస్ 2021లో చివరిసారి మెల్‌బోర్న్ పార్క్ బరిలో దిగింది. ఆ ఏడాది ఆమె రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ అయిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఈ నెల 12 నుంచి వచ్చే నెల ఒకటి వరకు జరగనుంది.

సాయి సుదర్శన్‌కు గాయం

8 వారాలు ఆటకు దూరం



న్యూఢిల్లీ: భారత యువ బ్యాటర్ సాయి సుదర్శన్ గాయపడ్డాడు. విజయ్ హజారే ట్రోఫీలో తమిళనాడుకు ఆడుతున్న సాయి మధ్యప్రదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా పరుగు చేసే క్రమంలో కిందపడ్డాడు. దాంతో అతడి కుడి పక్కటెముకకు గాయమైంది. ఈ గాయం మానేందుకు ఎనిమిది వారాలు పడుతుందని బీసీసీఐ తెలిపింది. ఈమేరకు 24 ఏళ్ల సుదర్శన్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో చేరాడు.

ఆర్‌టీపీలో నీరజ్, సచిన్



న్యూఢిల్లీ: వరల్డ్ అథ్లెటిక్స్ డోపింగ్ నిరోధక ఏజెన్సీకి చెందిన రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్ (ఆర్‌టీపీ)లో భారత్ నుంచి జావెలిన్ త్రోయర్లు నీరజ్ చోప్రా, సచిన్ యాదవ్‌లకు మాత్రమే చోటు దక్కింది. అయితే ఈ జాబితాలో నీరజ్ రెగ్యులర్‌గా ఉంటున్నప్పటికీ సచిన్‌కు మాత్రం ఇదే తొలిసారి. గతేడాది అంతర్జాతీయ ఈవెంట్స్‌లో సచిన్ మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆర్‌టీపీ అనేది ఎలీట్ అథ్లెట్లతో కూడిన అథ్లెట్ల సమూహం. ఇందులోని వారికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే డోపింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే అథ్లెట్లు కూడా తమ ఇంటి అడ్రస్, ఏ సమయానికి ఎక్కడ ఉంటున్నామనే విషయంతో పాటు డోప్ టెస్టు కోసం రోజులో ఓ గంట పాటు సమయం కేటాయించాల్సి ఉంటుంది.

మరీనె మళ్లీ..

భారత మహిళల హాకీ జట్టు కోచ్‌గా నియామకం




న్యూఢిల్లీ: మహిళల హాకీ జట్టు కోచ్‌గా హాలెండ్‌కు చెందిన షూర్డ్ మరీనె తిరిగి నియమితుడయ్యాడు. ఈమేరకు అతడి ఎంపికను హాకీ ఇండియా శుక్రవారం ప్రకటించింది. ఐదు సంవత్సరాల తర్వాత షూర్డ్ మళ్లీ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. 2017 నుంచి 2021 వరకు మరీనె మహిళల జట్టు కోచ్‌గా వ్యవహరించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో అతడి ఆధ్వర్యంలోనే మహిళల జట్టు నాలుగో స్థానంతో చరిత్ర సృష్టించిన విషయం విదితమే. ఇప్పుడు మళ్లీ హరేంద్ర సింగ్ స్థానంలో షూర్డ్ నియడితుడయ్యాడు. హరేంద్ర గత ఏడాది డిసెంబరులో కోచ్ పదవికి రాజీనామా చేశాడు.

ఆధిపత్యం కొనసాగేనా?

మహిళల ప్రీమియర్ లీగ్ 6 రోజుల్లో

ముంబై ఇండియన్స్



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఐపీఎల్‌లో మాదిరే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లోనూ ముంబై ఇండియన్స్ జట్టు తమ సత్తాను చాటుకుంటూనే ఉంది. డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటి వరకు జరిగిన మూడు సీజన్లలో ఆరంభ టైటిల్‌తో పాటు ప్రస్తుతం ఈ జట్టు డిఫెండింగ్ చాంపియన్‌గానే బరిలోకి దిగబోతోంది. మధ్యలో ఒక్కసారి మాత్రమే తుది పోరుకు అర్హత సాధించలేకపోయింది. అలాగే రెండు టైటిళ్లను ఖాతాలో వేసుకున్న హర్మన్‌ప్రీత్ సేనకు ఒత్తిడిని ఎలా అధిగమించడంపై తగిన అనుభవం ఉంది. అందుకే ఇన్నాళ్లుగా తమ జట్టును విజయపథంలో నడిపిస్తున్న కీలక ఆటగాళ్లను అట్టిపెట్టుకుని ప్రత్యర్థులకు సవాల్ విసరబోతోంది.

ఆల్‌రౌండర్ల హవా

నాట్ సివర్ బ్రంట్, అమెలియా కెర్, హేలీ మాథ్యూస్.. మహిళల క్రికెట్‌లో అగ్రశ్రేణి ఆల్‌రౌండర్లయిన ఈ త్రయం ముంబై ఇండియన్స్‌కు బలం. తమ అసాధారణ బ్యాటింగ్‌తో పాటు ప్రతీ మ్యాచ్‌లోనూ సంయుక్తంగా 12 ఓవర్లు వేయగల నైపుణ్యం వీరి సొంతం. ఇక కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టుకు మరో ప్రధాన ఆయుధం. భారత జట్టుకు వన్డే వరల్డ్‌కప్ అందించడంతో పాటు ఇటీవలే లంకపై టీ20 సిరీస్ విజయాలతో సారథిగా తన ప్రతిభను నిరూపించుకుంది. దేశవాళీ ప్లేయర్లలో కమలిని, సజన, సంస్కృతి గుప్తా, అమన్‌జోత్ కౌర్ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నారు.

పేస్‌లో బలహీనత

పలు అంశాల్లో ముంబై జట్టు పటిష్టంగానే కనిపిస్తున్నా పేస్ విభాగంలో మాత్రం బలహీనంగానే ఉంది. షబ్నిం ఇస్మాయిల్ రూపంలో ఒక్కరే ప్రధాన పేసర్‌గా ఉండడం గమనార్హం. పూజా వస్త్రాకర్ వేలంలో మరో జట్టుకు వెళ్లాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో షబ్నిం ఫామ్‌లో లేకపోయినా.. గాయపడినా ముంబైకి కష్టాలు తప్పవు. ప్రస్తుత జట్టులో ప్రభావం చూపగల షబ్నిం స్థాయి పేసర్ మరొకరు కనిపించడం లేదు. ముంబైని ఆందోళనపరిచే మరో అంశమేమిటంటే.. బౌలర్లకు మద్దతుగా ఉండేందుకు ఎక్కువగా ఆల్‌రౌండర్లపైనే ఆధారపడడం. ఈ వ్యూహం గతంలో జట్టుకు ఫలితమిచ్చినా.. సుదీర్ఘ సీజన్‌లో ఎవరైనా గాయపడితే ముంబై మరింత ఇబ్బందుల్లో పడడం ఖాయం.

షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	వేదిక
జనవరి 9	బెంగళూరు	నవీ ముంబై
జనవరి 10	ఢిల్లీ	నవీ ముంబై
జనవరి 13	గుజరాత్	నవీ ముంబై
జనవరి 15	యూపీ	నవీ ముంబై
జనవరి 17	యూపీ	నవీ ముంబై
జనవరి 20	ఢిల్లీ	వడోదర
జనవరి 26	బెంగళూరు	వడోదర
జనవరి 30	గుజరాత్	వడోదర

జట్టు

స్వదేశీ: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), అమన్‌జోత్, కమలిని, నల్లా క్రాంతి రెడ్డి, పూనమ్ ఖెమ్నర్, రహీలా ఫిర్దౌస్, సైకా ఇషాక్, సజన, సంస్కృతి గుప్తా, త్రివేణి వశిష్ఠ.

విదేశీ: అమెలియా కెర్, నాట్ సివర్ బ్రంట్, హేలీ మాథ్యూస్, షబ్నిం ఇస్మాయిల్, ఇల్లింగ్‌వర్త్, నికోలా కేరీ.

ఖవాజా వీడ్కోలు

- ఇంగ్లండ్‌తో ఐదో టెస్టే ఆఖరిది
- కెరీర్‌లో ఎన్నో చేదు ఘటనలు
- ఉస్మాన్ వెల్లడి



సిడ్నీ: ఆస్ట్రేలియా వెటరన్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నట్టు వెల్లడించాడు. ఇంగ్లండ్‌తో ఆదివారం ఇక్కడ ప్రారంభమయ్యే యాషెస్ ఐదో టెస్ట్ తన కెరీర్‌లో చివరిదని శుక్రవారం ప్రకటించాడు. పాకిస్థాన్‌లో జన్మించిన ఖవాజా ఆస్ట్రేలియా తరపున ఆడిన తొలి ముస్లిమ్ క్రికెటర్. తను ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు శ్రీకారం చుట్టిన సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లోనే 39 ఏళ్ల ఉస్మాన్ చివరి మ్యాచ్ ఆడుతుండడం గమనార్హం. 2018లో ఇదే మైదానంలో యాషెస్‌లో అతడు మొదటి శతకం సాధించాడు. అంతేకాదు.. ఇదే గ్రౌండ్‌లో 35వ ఏట కెరీర్‌ను పునర్‌నిర్మించుకున్న ఖవాజా ఇంగ్లండ్‌పై రెండు సెంచరీలు చేయడం విశేషం. అనంతరం మరో రెండేళ్లకు ఇంకో ఏడు శతకాలు బాది లేటు వయస్సులో పునరాగమనం చేసి అద్భుతంగా ఆడిన క్రికెటర్‌గా పేరు తెచ్చుకొన్నాడు. ఇక..వెన్ను నొప్పి కారణంగా ఈ యాషెస్ సిరీస్‌లోని తొలి రెండు టెస్టులకు దూరమయ్యాడు. స్టీవెన్ స్మిత్ హఠాత్తుగా అనారోగ్యం పాలవడంతో మూడో టెస్టులో ఉస్మాన్‌కు చోటు లభించింది. ఆ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 82, రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులు చేశాడు. ఆ తర్వాత నాలుగో టెస్టులో (29,0) విఫలమయ్యాడు. కాగా ఆఖరిదైన ఐదో టెస్టులోనూ ఆడనున్నాడు.

ఆస్ట్రేలియాలో మితిమీరిన జాత్యహంకారం

ఆస్ట్రేలియా క్రికెట్‌లో జాత్యహంకారం దారుణంగా ఉందని ఖవాజా కుండబద్దలు కొట్టాడు. ఆటతీరుపై కాకుండా తన మతం నేపథ్యంగా మీడియా, మాజీ క్రికెటర్లు తనపై విమర్శలు గుప్పించడాన్ని గర్హించాడు. యాషెస్ సిరీస్ పెర్త్ టెస్ట్‌లో తన వైఫల్యాన్ని ఆ కోణంలోనే చూశారని మండిపడ్డాడు. 'ఆ టెస్ట్‌కు సన్నద్ధం కాకుండా నేను గోల్ఫ్ ఆటకే ప్రాధాన్యమిచ్చానని నిందించారు. గోల్ఫ్ ఆడి గాయపడ్డాడని విమర్శించారు' అని ఖవాజా వాపోయాడు. 2017లో సిడ్నీ టెస్ట్ సందర్భంగా తనకు ఎదురైన మరో చేదు అనుభవాన్ని కూడా ఉస్మాన్ గుర్తు చేసుకున్నాడు. మైదానం వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డు తనకు పాకిస్థాన్ డ్రెస్సింగ్ రూమ్ చూపించాడని వెల్లడించాడు. ఇలాంటి ఘటనలు ఎన్నింటినో తన కెరీర్‌లో ఎదుర్కొన్నానని ఖవాజా తెలిపాడు.

క్రీమర్‌కు చోటు

టీ20 వరల్డ్ కప్ జింబాబ్వే జట్టు ప్రకటన

బులవాయో: టీ20 ప్రపంచ కప్‌లో తలపడే 15 మంది సభ్యుల జింబాబ్వే జట్టును శుక్రవారం ప్రకటించారు. 39 ఏళ్ల మాజీ కెప్టెన్ గ్రేమ్ క్రీమర్‌కు చోటు కల్పించారు. ఏడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత గత అక్టోబరులో పాకిస్థాన్‌లో పర్యటన సందర్భంగా అంతర్జాతీయ క్రికెట్‌లోకి క్రీమర్ పునరాగమనం చేశాడు.

జట్టు: సికిందర్ రజా (కెప్టెన్), బెన్నెట్, ర్యాన్ బర్ల్, గ్రేమ్ క్రీమర్, ఇవాన్స్, క్లైవ్ మదందే, మపోసా, మరుమణి, మసకద్జ, ముజారబానీ, ముసేకివా, మున్యోంగా, డియాన్ మైర్స్, ఎన్‌గవారా, బ్రెండన్ టేలర్.

తిరుపతిని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దుతాం



- రూ. 5 కోట్లతో అకాడమీ నిర్మాణం
- శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి క్రీడలు (ఆంధ్రజ్యోతి): తిరుపతిని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని శాప్ ఛైర్మన్ ఎ. రవినాయుడు తెలిపారు. ఇక్కడ క్రీడాభివృద్ధిలో భాగంగా శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో రూ. 5 కోట్లతో క్రీడా అకాడమీని నిర్మిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. శుక్రవారం జరిగిన ఈ అకాడమీ శంకుస్థాపన కార్యక్రమంలో రవినాయుడు పాల్గొన్నారు. అకాడమీతో పాటు అత్యాధునిక వెయిట్ లిఫ్టింగ్ హాల్, 200 మంది క్రీడాకారుల కోసం వసతి గృహం నిర్మాణానికి కూడా ఆయన భూమి పూజ చేశారు. ఈ అకాడమీలో వెయిట్ లిఫ్టింగ్‌తో పాటు జూడో, టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్‌క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, డీఎస్‌డీవో శశిధర్, శాప్ కోచ్‌లు, క్రీడాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 3-1-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

సామాన్య భక్తులకు దక్కిన అభిషేక దర్శనం

15 ఏళ్ల తర్వాత తొలిసారి అమలు

తిరుమలలో సర్వదర్శన భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం

కిటకిటలాడుతున్న తిరుమల.. 12

ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పర్యవేక్షణలో సాఫీగా క్యూలైన్లు



ఆక్టోపస్ సర్కిల్ నుంచి కృష్ణతేజ సర్కిల్ వరకు వేచి ఉన్న భక్తులు

ఎట్టకేలకు కదలిక!

భూ సమస్యలకు పరిష్కారంపై కీలక నిర్ణయాలు

రెవెన్యూ యంత్రాంగానికి స్పష్టమైన విధి విధానాలు

అత్యధిక సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

జేసీ నుంచి తహశీల్దార్‌కు పది కీలక అధికారాల బదిలీ

మరికొన్ని ఆర్డీవోకు... కొన్ని మాత్రమే జేసీ పరిధిలో

ఎడాపెడా రికార్డులు మార్చేయడం కుదరదు

సంబంధిత పట్టాదారుకు, వ్యక్తులకు నోటీసు ఇవ్వాల్సిందే

లేదంటే చర్యలు.. తప్పు జరిగితే వీఆర్వోదే బాధ్యత

ఐదు రకాల భూములకు మూడు నెలల్లో మోక్షం

22(ఏ) జాబితా నుంచి తొలగించేందుకు తుది గడువు

మార్గదర్శకాలు జారీ చేసిన స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్

'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలపై రెవెన్యూ శాఖ స్పందన

"రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేయాలనుకుంటే సంబంధిత పట్టాదారులు, వ్యక్తులకు నేరుగా నోటీసులు ఇచ్చి తీరాలి. గ్రామ సచివాలయంలో నోటీసు ప్రదర్శించామంటే కుదరదు. ఈ విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగినా, ఫిర్యాదులు వచ్చినా వీఆర్‌ఓ, సంబంధిత అధికారిని బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటారు. రికార్డుల్లో జరిగే ఏ మార్పులకైనా వీఆర్‌ఓనే బాధ్యత వహించాల్సి ఉంటుంది."



బాపట్ల జిల్లా దోనేపూడిలో రీ సర్వే చేసిన భూములకు కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏళ్లకు ఏళ్లుగా రైతులు, భూ యజమానులను వేధిస్తున్న సమస్యల పరిష్కారం దిశగా రెవెన్యూ శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆయా సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' అనేక సందర్భాల్లో ప్రచురించిన కథనాలతో కదలిక వచ్చింది. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం నివారణ, ఎడాపెడా భూ రికార్డుల్లో మార్పులకు అడ్డుకట్ట, సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యానికి 'చెక్' చెప్పేలా... పౌర సేవలు సులువు చేసేలా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం సవివరమైన ఉత్తర్వులు జారీ చేశారు.



సాయిప్రసాద్

వీటిని నిక్కచ్చిగా పాటించి తీరాల్సిందేనని రెవెన్యూ యంత్రాంగానికి స్పష్టం చేశారు. అన్నింటికంటే ముఖ్యంగా... భూసమస్యలను పరిష్కరించే అధికారాలను వికేంద్రీకరించారు. ప్రతి దానికీ జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా... జేసీ అధికారాలను తహశీల్దార్, ఆర్డీవోలకు

మిగతా 11వ పేజీలో...

రాజముద్రతో పాస్ పుస్తకాలు

రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ ప్రారంభం

ఇక భూ సమస్యలు ఉండవు: అనగాని

'పాస్'కాని పుస్తకాలు!

గత ప్రభుత్వంలోని రీ సర్వే తప్పులు సరిదిద్దకుండా ఆ డేటాతోనే ముద్రణ

అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్

కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి 'రద్దు' అధికారాలు

ప్రభుత్వ, దేవదాయ, అసైన్డ్, నకిలీ, డబుల్ రిజిస్ట్రేషన్లన్నీ కమిటీ పరిధిలోకే

తప్పు చేసే సబ్ రిజిస్ట్రార్‌లకు మూడేళ్లదాకా జైలు



పెట్టుబడుల్లో ఏపీ టాప్!

దేశంలోకి వచ్చిన పెట్టుబడుల్లో నాలుగో వంతు ఆంధ్ర రాష్ట్రానికే

బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక

ఫోర్బ్స్ ఇండియాలో కథనం

పెట్టుబడి అనుకూల విధానాల ఫలితం

అనుమతులూ శరవేగంగా ఇస్తున్నాం

రంగాలవారీగా సుస్థిర విధానాలు

మౌలిక వసతులకు అత్యధిక ప్రాధాన్యం

అందుకే అగ్రస్థానంలో: ప్రభుత్వం

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు దేశవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఆ రాష్ట్రానికే వెళ్లాయని.. ఇతర రాష్ట్రాలన్నిటికంటే గరిష్ఠ వాటాను సొంతం చేసుకుందని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికను ఉటంకిస్తూ ఫోర్బ్స్ ఇండియా తాజాగా కథనం ప్రచురించింది. ఒడిశా 13.1 శాతం, మహారాష్ట్ర 12.8 శాతంతో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయని తెలిపింది. జాతీయస్థాయిలో మొత్తం ప్రతిపాదిత పెట్టుబడుల్లో ఈ మూడు రాష్ట్రాలే 51.2 శాతం దక్కించుకున్నాయని పేర్కొంది. తెలంగాణ

మిగతా 9వ పేజీలో...

జల వివాదాలపై కమిటీ

13 మందితో ఏర్పాటు చేసిన కేంద్ర జలశక్తి శాఖ

మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని గడువు

కేంద్ర జలసంఘం చైర్మన్ నాయకత్వం

2 రాష్ట్రాల నుంచి నలుగురేసి అధికారులు

కృష్ణా, గోదావరి బోర్డుల చైర్మన్లు కూడా

కమిటీ ఏర్పాటుకు గత జూలైలోనే నిర్ణయం

ఢిల్లీలో ఇద్దరు ముఖ్యమంత్రుల అంగీకారం



న్యూఢిల్లీ/అమరావతి/హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇరు రాష్ట్రాల మధ్య జలాలను న్యాయంగా, సమర్థంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచుకోవడానికి అవసరమైన ఆచరణీయ పరిష్కారాలను సూచించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. శుక్రవారం కేంద్ర జలశక్తి శాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ సంజయ్ కుమార్ సింగ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు, నిర్వహణలో ఉన్న సమస్యలను సమగ్రంగా, సాంకేతిక కోణంలో

మిగతా 9వ పేజీలో...

వెనుక కూర్చున్న వారూ హెల్మెట్ పెట్టాల్సిందే



విశాఖలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలని చెబుతున్న ట్రాఫిక్ పోలీసులు

విశాఖలో మొదలైన నిబంధన అమలు

హెల్మెట్ లేకపోతే రూ.1,035 జరిమానా

వేలాది మందికి ఈ-చలాన్‌లు జారీ 12

గగ్గోలు పెడుతున్న ద్విచక్ర వాహనదారులు



అతుల్ సింగ్

"ప్రభుత్వ శాఖల్లో అవినీతి కట్టడి చేసేందుకు ఏసీబీ చేస్తున్న ప్రయత్నాలు సరిపోవడంలేదు. ప్రజలూ సహకరిస్తేనే అవినీతి రాకాసిని అణచి వేయగలం. అవినీతికి సంబంధించి పూర్తి ఆధారాలతో ఏసీబీకి ఫిర్యాదు చేయండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. వ్యక్తిగత కక్షతోనో మరో కారణంతోనో కాకుండా ప్రజా ప్రయోజనాల కోణంలోనే ఫిర్యాదు ఉండాలి!" - అతుల్ సింగ్, ఏసీబీ డీజీ

నిఘా వేశాం..

పట్టుకుంటాం!

అవినీతి తిమింగలాల ఆట కట్టిస్తాం

బినామీల ఆస్తుల వివరాలు సేకరిస్తున్నాం.. ఏఐ వినియోగంతో సమాచార సేకరణ

ఏసీబీ కేసుల్లో 'రెవెన్యూ' టాప్.. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో సోదాల్లో కీలక విషయాలు

ఈ ఏడాది మరో 4 శాఖలపై దృష్టి.. నిందితులకు మూడేళ్లలో శిక్ష పడేలా చర్యలు

1064కు కాల్ చేసి సమాచారం ఇవ్వండి.. ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ పిలుపు

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో కరుడుగట్టిన అవినీతిపరులపై నిఘా పెట్టాం. వారి బినామీల డేటాను ఏఐ ద్వారా సేకరిస్తున్నాం. ఈ ఏడాది అవినీతి తిమింగలాల పని పడతాం. అవినీతికి పాల్పడినవారిని మూడేళ్లలోనే జైలుకు పంపాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం' అని అవినీతి నిరోధక శాఖ డీజీ అతుల్‌సింగ్ ప్రకటించారు. గత ఏడాదిలో ఏసీబీ పనితీరును శుక్రవారం విజయవాడలోని ఎన్టీఆర్ పరిపాలన భవనంలో మీడియాకు వివరించారు. "అక్రమాస్తుల కేసులపై ఇప్పటికే దృష్టి పెట్టాం. పెద్ద చేపలు బినామీల పేరుతో ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించాం. వాటిపై నిఘా పెట్టాం. ఐజీఆర్‌ఎస్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్లతో పాటు బ్యాంకుల లావాదేవీలు కూడా ఏఐ ద్వారా సేకరిస్తున్నాం. అవినీతిపరుల అక్రమాస్తుల సమాచారాన్ని ఒకేచోట క్రోడీకరించేందుకు వీలుగా ఏఐని ఉపయోగిస్తాం" అని ఏసీబీ డీజీ తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ శాఖలో ఎక్కువ అవినీతి జరుగుతోందని, రిజిస్ట్రేషన్స్ కార్యాలయాలపై దాడులు చేసినప్పుడు చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ఈ ఏడాది మరో 4 కీలక శాఖలపై దృష్టి పెట్టామన్నారు. 2025లో 115 కేసులు నమోదు చేసి అవినీతికి పాల్పడ్డవారిని జైలుకు పంపామని, అయినా

మిగతా 9వ పేజీలో...



ఉమర్ ఖలీద్‌కు మమ్దానీ సంఘీభావం

మేమంతా నీ గురించే ఆలోచిస్తున్నామని సందేశం 2

ఉమర్‌కు మద్దతుగా అమెరికా చట్టసభ సభ్యుల లేఖ

ఇది భారత్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే: బీజేపీ

'గ్రోక్' అసభ్య కంటెంట్‌పై కేంద్రం సీరియస్

మహిళల చిత్రాలను అశ్లీలంగా మార్చేందుకు వీలు కల్పిస్తున్న గ్రోక్

72 గంటల్లో ఆ పోస్టులన్నీ తొలగించాలంటూ 'ఎక్స్'కు కేంద్ర సమాచార శాఖ నోటీసులు 2

తిరుమల లడ్డూ వివాదంలో.. వైవీ సుబ్బారెడ్డికి చుక్కెదురు

వ్యతిరేక కథనాలు, పోస్టులపై స్టే ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరణ 10

ప్రతివాదుల వాదనలు వినకుండా ఏకపక్ష ఉత్తర్వులివ్వలేమని స్పష్టీకరణ



దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్

మారిటైమ్ బోర్డుకు సమ్మతి తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

దగదర్తి ఎయిర్‌పోర్టుకు 418.14 ఎకరాల భూసేకరణ

ఎయిర్‌పోర్టు అథారిటీకి ఆమోదం 10



ఓంకార్



బాలుడ్ని చిదిమేసిన బస్సు ఇదే. ఘటనా స్థలిలో తల్లి కన్నీరు మున్నీరు

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

బాపట్ల జిల్లా ఇంకొల్లులో విషాదం.. అతి వేగమే ప్రాణం తీసింది!

తల్లడిల్లిపోయిన తల్లిదండ్రులు 12



పుస్తక మహోత్సవ ప్రారంభానంతరం స్టాల్స్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ, ఎమెస్కో విజయ్‌కుమార్

పుస్తక పండగ ఆరంభం

స్టాళ్లలో పరుచుకున్న లక్షల అక్షర సుమాలు

బెజవాడలో 10 రోజులు సాగనున్న సంరంభం

పుస్తకాలు ప్రాణం పోసుకున్న జీవులు

మనతో పాటు అవీ ప్రయాణిస్తాయి

తీర్పు ఇచ్చేటప్పుడు రాజ్యాంగం తిరగేస్తే అందులోని అక్షరాలు హాయిని కలిగిస్తాయి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ 9

వచ్చే ఏడాది అమరావతిలోనే ప్రదర్శన

సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చిస్తా

డిప్యూటీ స్పీకర్ రఘురామ హామీ

ఫిబ్రవరిలో మరో డీఎస్సీ

2,500 టీచర్ పోస్టుల భర్తీకి రెడీ

ఈసారి పరీక్షలో ఆంగ్ల ప్రావీణ్యం, కంప్యూటర్ అవగాహనపై పేపర్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ కొలువుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సమాయత్తమవుతోంది. ఈ క్రమంలో డీఎస్సీ నిర్వహణకు సంబంధించిన ప్రక్రియపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. సుమారు 2,500 పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేయాలని పాఠశాల విద్యా శాఖ భావిస్తోంది. ఈ సంవత్సరం ఎక్కువ మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయనున్నారు. అదేవిధంగా స్వల్ప సంఖ్యలో ఖాళీలు కూడా ఉన్నాయి. దీంతో ఆయా పోస్టులను పాఠశాల విద్యాశాఖ భర్తీ చేయనుంది. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరంలో జీవో 117ను రద్దుచేసి కొత్తగా తొమ్మిది రకాల విధానాలు తీసుకువచ్చారు. 9,200 ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చి తరగతికి ఒక టీచర్‌ను

మిగతా 10వ పేజీలో...

గ్రూప్-1 తర్వాతే గ్రూప్-2 ఫలితాలు

నెలాఖరు నాటికి విడుదలయ్యే చాన్స్! 10



జనవరిలోనూ చలి పంజా!

ఉత్తర కోస్తాలో సాధారణం కంటే ఎక్కువగా నమోదు

దక్షిణ కోస్తా, సీమల్లో సాధారణం.. లేదా కాస్త తక్కువ

సంక్రాంతి తరువాత స్వల్పంగా పెరగనున్న ఎండలు

భారత వాతావరణ విభాగం వెల్లడి

విశాఖపట్నం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత జనవరిలోనూ కొనసాగనుంది. ఉత్తర, మధ్య, తూర్పు, పశ్చిమ భారతాల్లోని అనేక ప్రాంతాల్లో ఎక్కువ రోజులు చలి వాతావరణం నెలకొంటుంది. అతి శీతల గాలులు వీచే అవకాశం ఉండటంతో చలి ప్రభావం ఉండే రోజుల సంఖ్య సాధారణం కంటే

మిగతా 2వ పేజీలో...

ఈహెచ్‌ఎస్‌ను ప్రత్యేకంగానే అమలు చేస్తాం

» యూనివర్సల్ స్కీమ్‌లో కలపట్లేదు: ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)ను యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌లో కలపడం లేదని, ఈహెచ్‌ఎస్‌ను ప్రత్యేకంగా అమలు చేస్తామని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో కె.దినేష్‌కుమార్ తెలిపారు. ఈహెచ్‌ఎస్‌పై ఉద్యోగ సంఘాల నేతలతో శుక్రవారం ఆయన భేటీ అయ్యారు. యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌లో ఈహెచ్‌ఎస్‌ను కలపకుండా, ప్రత్యేకంగా అమలు చేయలని వారు కోరగా.. సీఈవో సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకుందని, ఈహెచ్‌ఎస్‌ను ప్రత్యేకంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. 2025 ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న అన్ని మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లైమ్‌లను క్లియర్ చేశామని, మిగిలిన వాటిని కూడా వీలైనంత త్వరగా చేస్తామని చెప్పారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల వివరాలను ఉద్యోగులకు వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తున్నామన్నారు. అన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. దీనిపైనా సీఈవో సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే క్యాష్‌లెస్ చికిత్స అందిస్తున్నామని, దీనిని మరింత బలంగా అమలు చేస్తామన్నారు. భేటీలో ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పలిశెట్టి దామోదరావు, ఇతర సంఘాల నేతలు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో అమలుకాని 1వ తరగతి అడ్మిషన్‌కు 'ఆరేళ్ల' రూల్!

న్యూఢిల్లీ, జనవరి 2: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020 నిబంధనల ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశానికి పిల్లలకు కనీసంగా ఆరేళ్లు నిండి ఉండాలన్న ప్రమాణాన్ని దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఇంకా అమలు చేయలేదు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, ఛత్తీసగఢ్‌లు ఉన్నాయి. ఎన్ఈపీ-2020, ఆర్టీఈ-2009 చట్టంలోని నిబంధనల ప్రకారం.. ఇంతకుముందు అనుసరిస్తున్న '5 ప్లస్' ఏళ్ల విధానానికి బదులుగా ఆరేళ్ల వయసు నిండిన తర్వాతనే పిల్లలను 1వ తరగతిలో చేర్చుకోవాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 2023లో రాష్ట్రాలు, యూటీలకు ఆదేశాలు జారీచేసింది. కొన్ని రాష్ట్రాలు ఇంకా 1వ తరగతి ప్రవేశాల కోసం విభిన్న వయో ప్రమాణాలను అనుసరిస్తున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

90 రోజులు పనిచేస్తే గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత

న్యూఢిల్లీ, జనవరి 2: ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయాలని అనుకుంటున్న నాలుగు లేబర్ కోడ్‌లకు సంబంధించి కేంద్ర కార్మిక శాఖ ముసాయిదా నిబంధనలను ప్రచురించింది. ఈ ముసాయిదా నిబంధనల్లో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పనకు సంబంధించి కేంద్రం కీలకమైన అర్హత రూల్స్‌ను ప్రతిపాదించింది. సామాజిక భద్రత లబ్ధికి అర్హత పొందాలంటే గిగ్ వర్కర్లు ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక అగ్రిగేటర్ వద్ద అయితే కనీసంగా 90 రోజులు, ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద అయితే కనీసంగా 120 రోజులు పనిచేయాల్సి ఉంటుందని కేంద్రం నోటిఫికేషన్‌లో పేర్కొంది.

19 రాష్ట్రాల్లో భూరికార్డుల డిజిలైజేషన్ పూర్తి

న్యూఢిల్లీ, జనవరి 2: దేశవ్యాప్తంగా భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియలో కీలక అంశాలను భూవనరుల శాఖ దాదాపుగా పూర్తి చేసింది. 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు... అండమాన్-నికోబార్, బిహార్, చండీగఢ్, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, ఉత్తరప్రదేశ్‌లలో ఈ ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసింది. ఈ రాష్ట్రాల్లోని ప్రజలు తమ భూమి రికార్డులను తమ ఇంటి నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మరోవైపు పట్టణ భూ ఆస్తుల డిజిటలైజేషన్ పైలెట్ ప్రాజెక్టు 'నక్ష 157 పట్టణ స్థానిక సంస్థల్లో చురుకుగా సాగుతోంది. ఇప్పటివరకు 29 రాష్ట్రాల్లోని 36 కోట్ల భూ కమతాలకు జియో కో ఆర్డినేట్స్ ఆధారంగా 14 అక్షర సంఖ్యలతో ఏర్పాటు చేసిన 'యునిక్ ల్యాండ్ పార్శిల్ ఐడెంటిఫికేషన్ నంబర్(యూఎల్‌పీఐఎన్)'... 'భూ ఆధార్' కేటాయించారు.

ఉమర్‌కు మమ్దానీ సంఘీభావం

మేమంతా నీ గురించే ఆలోచిస్తున్నామని సందేశం


» ఉమర్‌కు మద్దతుగా అమెరికా చట్ట సభ్యుల లేఖ

» భారత్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే: బీజేపీ



న్యూయార్క్, జనవరి 2: న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ ఐదేళ్లుగా ఢిల్లీ జైల్లో ఉన్న జేఎన్‌యూ ఉద్యమకారుడు ఉమర్ ఖలీద్‌కు సంఘీభావం తెలుపుతూ సందేశం పంపించారు. ఉమర్ ఖలీద్ సహచరి బానోజ్యోత్స్న లాహిరి ఆ సందేశంతో కూడిన లేఖను ట్విటర్‌లో పోస్ట్ చేశారు. "మనం అనుభవించిన కష్టం మన వ్యక్తిత్వాన్ని మార్చేయకూదని నువ్వు చెప్పే మాటలు నేనెప్పుడూ గుర్తుకు తెచ్చుకుంటా. మీ అమ్మానాన్నలను కలవడం ఎంతో సంతోషంగా ఉంది. మేమంతా నీ గురించే ఆలోచిస్తున్నాం" అన్నారు. మమ్దానీ సందేశాన్ని ట్విటర్‌లో పోస్ట్ చేస్తూ లాహిరి, "జైలు నిన్ను సమాజానికి దూరం చేయాలని చూసినా పదాలు ప్రయాణిస్తున్నాయి. ఉమర్‌కు మమ్దానీ రాసిన లేఖ" అని క్యాప్షన్ ఇచ్చారు. ఖాలిద్, మరికొందరు 2020 ఫిబ్రవరిలో జరిగిన ఢిల్లీ అల్లర్లకు సూత్రధారులంటూ కేంద్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) కింద జైల్లో పెట్టింది. ఇంతవరకు వారెవరికీ బెయిలు రాలేదు. మరోపక్క అమెరికా చట్టసభ సభ్యులు ఎనిమిది మంది ఉమర్ ఖలీద్‌కు బెయిలు ఇవ్వాలంటూ భారత ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ మేరకు అమెరికాలో ఉన్న భారత రాయబారి వినయ్ ఖ్వాత్రాకు లేఖ పంపించారు. అంతర్జాతీయ న్యాయానికి అనుగుణంగా ఆయనపై త్వరగా విచారణ జరపాలని కోరారు. లేఖ రాసిన వారిలో జిమ్ మెక్‌గ్రోవన్, జామీ రస్కిన్ ఉన్నారు. భారత్, అమెరికాలు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని, చట్టబద్ధ పాలన కలిగిన, మానవ హక్కులను గౌరవించే దేశాలని వారు లేఖలో ప్రస్తావించారు. విషయం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉందని తమకు తెలుసని, ఉమర్ ఖలీద్ చెల్లెలి వివాహానికి హాజరయ్యేందుకు తాత్కాలిక బెయిలు లభించిన విషయం కూడా తెలుసని లేఖలో పేర్కొన్నారు. అమెరికా చట్టసభ సభ్యుల లేఖ వెనుక రాహుల్‌గాంధీ ఉన్నారని బీజేపీ ఆరోపించింది. లేఖ రాసిన 8మందిలో ఇద్దర్ని రాహుల్ అమెరికా పర్యటన సందర్భంగా 2024లో కలిశారని తెలిపింది. అప్పటి ఫోటోను విడుదల చేసింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మీడియాతో మాట్లాడుతూ, మమ్దానీ భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇండియాను ముక్కలు చేయాలని మాట్లాడి జైలు పాలయిన నేరస్థుడికి మద్దతు పలకడం ఖురాన్‌ను అవమానించడమేనని మమ్దానీని ఉద్దేశించి వీహెచ్‌పీ వ్యాఖ్యానించింది.

ఆందోళనకారులను చంపుతుంటే.. చూస్తూ ఊరుకోబోం!



» ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు

టెహ్రాన్, వాషింగ్టన్, జనవరి 2: దేశ ఆర్థిక పరిస్థితి దిగజారడం, పెరిగిన ధరలతో ఇరాన్‌లో మొదలైన ఆందోళనలు 50నగరాలకు విస్తరించాయి. మరోవైపు ఆ ఆందోళనలను కఠినంగా అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భద్రతా బలగాలు నిరసనకారులపై బాష్పవాయు గోళాలు, లాఠీచార్జిలతో విరుచుకుపడుతున్నాయి. ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో భారీ సంఖ్యలో ఆందోళనకారులకు గాయాలయ్యాయి. శుక్రవారం నాటికల్లా ఏడుగురు మరణించారు కూడా. ఈ క్రమంలో ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నవారిపై ఇరాన్ హింసకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆందోళనకారులను అమెరికా రక్షిస్తుందని.. ఇందుకోసం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్‌లో ఆందోళనల వెనుక ఇజ్రాయెల్, అమెరికా ఉన్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, అమెరికా నుంచి ఆర్థిక, సైనికపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న వెనెజువెలా ప్రభుత్వం.. తమ దేశంలో ఉన్న ఐదుగురు అమెరికన్లను అరెస్టు చేసింది.

నా ఆరోగ్యం భేషుగ్గా ఉంది

"ట్రంప్ వినికిడి లోపంతో బాధపడుతున్నారు. శ్వేతసౌధంలో జరిగే కార్యక్రమాల్లో నిద్రపోతున్నారు" అని వస్తున్న వార్తలపై ట్రంప్ స్పందించారు.ప్రస్తుతం తన ఆరోగ్యం భేషుగ్గా ఉందన్నారు. కాకపోతే వైద్యులు సూచించిన దాని కంటే ఎక్కువ మోతాదులో ఆస్ప్రిన్ తీసుకుంటున్నట్లు తెలిపారు. వాల్ స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. తన చెవులకు ఎలాంటి సమస్యా లేదన్నారు.

తగ్గిపోతున్న చక్కెర వాడకం

» షుగర్ వ్యాధి, ఆరోగ్యంపై శ్రద్ధ ప్రధాన కారణాలు

న్యూఢిల్లీ, జనవరి 2: కమ్మనైన జిలేబీల వైపు కన్నెత్తి చూడటం లేదు.. రసగుల్లాలు అంటే అమ్మో అంటున్నారు.. ఇష్టమైన స్వీట్లను చూసినా ముఖం తిప్పేస్తున్నారు.. ఇదంతా ఎందుకు అంటే భయపెడుతున్న షుగర్ వ్యాధి వల్ల. దేశంలో పెరుగుతున్న ఆ వ్యాధి కారణంగా ప్రజలు పంచదార వాడకం భారీగా తగ్గించేశారు. దీంతో దేశీయ మార్కెట్‌లో చక్కెరకు ఏటేటా డిమాండ్ తగ్గిపోతోంది. కొవిడ్ ముందు వార్షికంగా 4 శాతంపైగా ఉన్న డిమాండ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.42 శాతానికి పడిపోయింది. పెరుగుతున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు, ప్రజలకు ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పు, ముఖ్యంగా యువతరంలో స్వీట్స్ పట్ల విముఖత చక్కెర డిమాండ్ తగ్గిపోవడానికి కారణమని మింట్ నివేదిక వెల్లడించింది. అధికంగా చక్కెర తినడం వల్ల టైప్-2 డయాబెటిస్, ఊబకాయం, గుండెజబ్బులకు దారి తీసే ముప్పు ఉండటంతో.. మధుమేహ వ్యాధిగ్రస్తులున్న దేశాల్లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్‌లో ప్రజలు చక్కెర వినియోగాన్ని తగ్గించేస్తున్నారు.

అనుమతి ఉంటేనే సౌదీకి మందులు తీసుకెళ్లొచ్చు

న్యూఢిల్లీ, జనవరి 2: సౌదీ అరేబియా వెళ్లే భారతీయులు తమ వెంట కొన్ని రకాల మందులు తీసుకొని వెళ్లాలంటే ముందుగా ఆ దేశం అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో (ఎన్‌సీబీ) శుక్రవారం తెలిపింది. భారత దేశంలో కొన్ని రకాల మందులు కొనుగోలు చేయడం చట్టబద్ధమే అయినప్పటికీ ఆ దేశంలో మాత్రం వాటిపై ఆంక్షలు ఉంటాయని పేర్కొంది. అందువల్ల ఆ వివరాలను తెలుసుకొని తీసుకెళ్లాల్సి ఉంటుందని పేర్కొంది. మందులను కూడా నిర్ణీత మొత్తంలోనే తీసుకెళ్లాల్సి ఉంటుందని, అంతకుమించితే చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. మందులకు అనుమతి ఇచ్చే విషయమై ప్రత్యేకంగా పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, దాంట్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపింది.

లోకం తీరు



ఖర్చుల లెక్కలడగడం భార్యను వేధించినట్టు కాదు

» సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 2: ఇచ్చిన సొమ్మును ఏవిధంగా ఖర్చు చేశావని భార్యను భర్త అడగడం క్రూరత్వం కిందికి రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీని ఆధారంగా కేసు పెట్టలేమని తెలిపింది. ఇలాంటి లెక్కలు అడుగుతున్న భర్తపై కేసు పెట్టాలంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తెలంగాణకు చెందిన ఓ జంట కుటుంబ వివాదాల కారణంగా వేరువేరుగా ఉంటోంది. పోషణ నిమిత్తం ఆయన ఆమెకు డబ్బులు పంపిస్తున్నాడు. వీటి లెక్కలు చూపించాలని అతడు కోరగా, అలా అడిగి డామినేట్ చేయడం క్రూరత్వం కిందికి వస్తుందంటూ ఆమె తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో భర్తపై కేసు పెట్టాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై భర్త సుప్రీంకోర్టుకు వెళ్లాడు.

ఇండోర్‌లో నీళ్లు కాదు.. విషాన్ని పంచారు: రాహుల్

న్యూఢిల్లీ, ఇండోర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత నీటి మరణాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్రం, ప్రధాని మోదీపై విమర్శలతో విరుచుకుపడ్డారు. ఇండోర్ ప్రజలకు పంపిణీ చేసింది నీళ్లు కాదని, అది ముమ్మాటికీ 'విషమే' అని ఆయన ఆరోపించారు. ఇండోర్‌లో అతిసారం(డయేరియా) వ్యాపించి 5నెలల పసికందు సహా పది మంది ప్రాణాలు కోల్పోవడంపై రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. "తాగునీటి పైపులైన్లలోకి మురుగునీరు ఎలా చేరింది? సమయానికి నీటి సరఫరాను ఎందుకు నిలిపివేయలేదు? ఈ మరణాలకు బాధ్యులైన వారిపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?" అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు.

'గ్రోక్' అసభ్య కంటెంట్‌పై కేంద్రం సీరియస్


» మహిళల చిత్రాలను అశ్లీలంగా మారుస్తున్న 'ఎక్స్' చాట్‌బాట్ గ్రోక్

» 72 గంటల్లోగా ఆ పోస్టులను తొలగించాలని కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ, జనవరి 2: 'ఎక్స్' సంస్థకు చెందిన కృత్రిమ మేధ టూల్ 'గ్రోక్ సృష్టిస్తున్న అసభ్య, అశ్లీల కంటెంట్‌పై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. 72 గంటల్లోగా ఆ కంటెంట్ ఉన్న పోస్టులను తొలగించాలని 'ఎక్స్'ను ఆదేశించింది. ఆ కంటెంట్ పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు, పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా, డిజిటల్ భద్రతను ఉల్లంఘించేలా ఉందని పేర్కొంది. మహిళలు, చిన్నారుల చిత్రాలను అసభ్యంగా, అశ్లీలంగా మార్చేందుకు వీలు కల్పిస్తుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి కంటెంట్‌ను సృష్టించేందుకు తావిస్తున్న ఈ సాంకేతికతలో వెంటనే తగిన మార్పులు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార, ప్రసార శాఖ శుక్రవారం నోటీసులు జారీ చేసింది. తమ ఆదేశాలపై తీసుకున్న చర్యలేమిటనే వివరాలతో 72 గంటల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. 'ఎక్స్' పాటిస్తున్న ప్రమాణాల్లో లోపాలు ఉన్నట్టు గుర్తించామని పేర్కొంది. తమ ఆదేశాలను పాటించకపోతే.. కేంద్ర ఐటీ చట్టం, సైబర్, క్రిమినల్, చిన్నారుల భద్రత చట్టాల కింద చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని 'ఎక్స్'ను హెచ్చరించింది. 'గ్రోక్ టూల్ ఆధారంగా 'ఎక్స్'లో మహిళల చిత్రాలను అశ్లీలంగా, అసభ్యంగా మార్చి పోస్టు చేయడం ట్రెండింగ్‌గా మారడంపై శివసేన(ఉద్ధవ్ వర్గం) రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. నకిలీ, తప్పుడు ఖాతాల నుంచి మహిళల చిత్రాలను 'ఎక్స్'లో అప్‌లోడ్ చేసి.. 'గ్రోక్'కు ప్రాంప్ట్ (సూచనలు) ఇవ్వడం ద్వారా వారు బికినీల్లో, అతి చిన్న వస్త్రాల్లో ఉన్నట్టుగా మార్చుతున్నారన్నారు. ఈ లేఖ నేపథ్యంలోనే 'ఎక్స్'కు కేంద్రం నోటీసులు జారీ చేసింది.

నాట్స్ బోర్డు చైర్మన్‌గా కంచర్ల కిషోర్

(డాలస్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



అమెరికాలో ప్రముఖ తెలుగు సంస్థగా గుర్తింపు పొందిన ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ(నాట్స్) బోర్డు నూతన చైర్మన్‌గా కంచర్ల కిషోర్ నియమితులయ్యారు. ప్రస్తుత చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్ నుండి ఆయన బాధ్యతలు చేపట్టారు. 2027 డిసెంబరు వరకు కిషోర్ ఈ పదవిలో కొనసాగుతారు. కృష్ణా జిల్లా పామర్రు మండలం రిమ్మనపూడి గ్రామానికి చెందిన కిషోర్ డాలస్‌లో ఉంటున్నారు. అమెరికాలో ప్రముఖ హోటళ్ల నిర్వాహకుడిగా, రియల్ ఎస్టేట్, ఐటీ రంగ వ్యాపారవేత్త, సామాజికవేత్తగా ఆయనకు గుర్తింపు ఉంది. కిషోర్ నియామకం పట్ల ప్రవాసాంధ్రులు హర్షం వ్యక్తం చేశారు. నాట్స్ బలోపేతానికి, సంస్థ ద్వారా తెలుగువారి సంక్షేమానికి, తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణకు కృషి చేస్తానని కిషోర్ తెలిపారు.

ఉద్యమ ఉప్పెన నుంచి నెత్తుటి నిశ్శబ్దానికి!


దేవ్‌జీ


గణపతి

అంతిమ ఘడియల్లో మావోయిస్టు పార్టీ?.. ఉధృతంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్

» కేంద్రం పెట్టుకున్న గడువుకు ఇంకా మిగిలి ఉన్నది మరో 90రోజులే!

చర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సుమారు 16 రాష్ట్రాల్లో సమాంతర ప్రభుత్వం నడిపిన మావోయిస్టు పార్టీకి అంతిమ ఘడియలు సమీపించినట్టేనా? ఉద్యమంతో ఉప్పెనలా నింగికి ఎగిసిన మావోయిస్టు పార్టీ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో నెత్తుటి నిశ్శబ్దానికి చేరినట్టేనా? దశాబ్దాలుగా మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న దండకారణ్యంలో ఇక ఉద్యమ నినాదాలు ఆగిపోయినట్టేనా?.. ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలన్నీ ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను అంతం చేయడం లక్ష్యంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ దాదాపుగా చివరి దశకు చేరింది. మావోయిస్టు అగ్రనేతల్లో చాలా మంది మరణించడమో, లొంగిపోవడమో జరిగింది. దిగువస్థాయి కేడర్‌లోనూ లొంగుబాట్లు పెరిగాయి. ప్రస్తుతం పార్టీ చీఫ్ దేవ్‌జీతో పాటు గణపతి, మిషిర్ బెస్రా కేంద్ర కమిటీ సభ్యులుగా మావోయిస్టు పార్టీని నడిపిస్తున్నారు. వారికి తోడుగా తెలంగాణ కార్యదర్శి దామోదర్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు ఉన్నారు. ఈ ఐదుగురు లొంగిపోయినా, అరెస్టయినా, ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినా మావోయిస్టు పార్టీ కథ ముగిసినట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రం ఆపరేషన్ కగార్ ముగింపునకు పెట్టుకున్న లక్ష్యం మరో 90 రోజులే ఉన్న నేపథ్యంలో గత రెండేళ్లలో జరిగిన పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

దశాబ్దాల పట్టును దెబ్బతీసే ప్రణాళికతో..

దేశంలో సుమారు 16 రాష్ట్రాల్లో దశాబ్దాల పాటు మావోయిస్టుల ప్రభావం కొనసాగింది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో మావోయిస్టులు పట్టుకొనసాగించారు. అడవుల్లోకి వెళ్లాలంటే వణికి పోయే పరిస్థితి ఉండేది. మావోయిస్టులకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు కలిసి ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఆపరేషన్ ప్రహార్ వంటివి చేపట్టినా పెద్దగా ప్రభావం కనిపించలేదు. 2021లో తెర్రం అడవుల్లో హిడ్మా ఆధ్వర్యంలో మావోయిస్టులు చేసిన దాడిలో 21 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చనిపోయారు. మరొకరిని కిడ్నాప్ చేసిన మావోయిస్టులు ప్రజలు, విలేకరుల సమక్షంలో విడిచిపెట్టారు. ఆ ఘటనతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. సుమారు రెండేళ్లపాటు పక్కాగా ప్రణాళిక రూపొందించి 'ఆపరేషన్ కగార్ ప్రారంభించింది.

రెండేళ్లలో జరిగిందిదీ..

- ఎన్‌కౌంటర్లు: 222
- మృతి చెందిన మావోయిస్టులు: 473
- లొంగిపోయినవారు: 2,354
- అరెస్టు అయినవారు: 1,813
- స్వాధీనం చేసుకున్న ఆయుధాల సంఖ్య: 931
- లభించిన బాంబులు/పేలుడ పదార్థాలు: 1,183
- దాడులు, ఎన్‌కౌంటర్‌లో మరణించిన జవాన్లు: 41
- మావోయిస్టుల చేతిలో హతమైన పౌరులు: 117

బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో ప్రతి 5 నుంచి 10 కిలోమీటర్లకు ఒక సీఆర్‌పీఎఫ్ క్యాంపును ఏర్పాటు చేశారు. అనధికారిక లెక్కల ప్రకారం 500కుపైగానే క్యాంపులు పెట్టి.. కమాండోలనూ మోహరించింది.

ఆ రెండు వంతెనలే కీలకం..

ఆపరేషన్ కగార్‌లో రెండు భారీ వంతెనల నిర్మాణం కీలకంగా నిలిచింది. నేషనల్ పార్కులో కట్టిన వంతెన ఒకటి, పామేడు అడవుల్లో చింతవాగుపై వంతెన రెండోది. వీటి ద్వారా భద్రతా బలగాల రాకపోకలు, క్యాంపుల ఏర్పాటు సులువు అయ్యాయి. మరోవైపు బస్తర్‌లోని ఏడు జిల్లాల్లో మావోయిస్టుల నుంచి ఆదివాసీలను దూరం చేసేందుకు అభివృద్ధి మంత్రాన్ని జపించింది. రోడ్లు, విద్య, వైద్యం, రేషన్, మొబైల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మెల్లగా గ్రామాల వారికి దగ్గరై.. మావోయిస్టులతో సంబంధాలున్న వారిని, ఇన్ఫార్మర్లను గుర్తించి అరెస్టు చేసింది. విస్తృతంగా కూంబింగ్‌లు చేపడుతూ మావోయిస్టులను వెంటాడింది.

ముఖ్య నాయకత్వమంతా అంతం!

ఆపరేషన్ కగార్, ఇతర కారణాలతో మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వం చాలా వరకు తుడిచిపెట్టుకుపోయింది. పార్టీ జనరల్ సెక్రెటరీ బసవరాజు, కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, వివేక్, గౌతమ్, గాజర్ల రవి, భాస్కర్, ప్రయాంగ్, కట్టా రామచంద్రారెడ్డి, కదిరి సత్యనారాయణరెడ్డి, హిడ్మా, ఉయికా గణేశ్ మృతిచెందారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు సుధాకర్, జగదీశ్, రేణుక, మధు, భాస్కర్‌రావు, రణధీర్, నిర్మల, రూపేశ్, జోగన్న, దస్రు కూడా మరణించారు.

మిగిలిన అగ్రనేతలు వీరే..

మావోయిస్టు పార్టీ ఏర్పడినప్పుడు 41 మంది కేంద్ర కమిటీ సభ్యులున్నారు. ఆపరేషన్ కగార్‌లో 11 మంది మృతి చెందారు. మరికొందరు లొంగిపోయారు. ప్రస్తుతం ముగ్గురే మిగిలారు. తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి ఇద్దరూ తెలంగాణ వారే. మరొకరు జార్ఖండ్‌కు చెందిన మిషిర్ బెస్రా అలియాస్ భాస్కర్. ఇక మావోయిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు.

మావోయిస్టులకు చివరి ఊపిరి: బస్తర్ ఐజీ

మార్చి 31నాటికి బస్తర్ అడవులు మావోయిస్టు రహితంగా మారుతాయని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. అడవుల్లో 2025లో 52కు పైగా క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. మావోయిస్టు పార్టీ చివరి ఊపిరి తీసుకుంటోందన్నారు. లొంగిపోయినవారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు.

మావోల హిట్‌లిస్ట్‌లో కాంగ్రెస్ నేత!

» హిడ్మా మృతికి కారకులైన వారిని వదిలిపెట్టబోమని మావోయిస్టుల లేఖ

చర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ అగ్రనేత మాధ్వి హిడ్మా మృతికి కారణమైన కుట్రదారులెవరో తమకు తెలిసిపోయిందని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అల్లూరి సీతారామ రాజు డివిజన్ కమిటీ 'విప్లవ' పేరుతో శుక్రవారం లేఖ విడుదల చేసింది. హిడ్మా, రాజీతో పాటు మరికొంత మంది సభ్యులను వైద్యం చేయిస్తానని నమ్మించి సదరు కాంట్రాక్టర్ తమను ఎలా మోసం చేశాడో చెప్పడానికి అవసరమైన వాయిస్ రికార్డులు, ఇతర ఆధారాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేసింది. కొండవాయి మార్గంలో కారు ఉంచి మావోయిస్టులను తరలించడంలో భద్రాద్రి జిల్లా చర్లకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకుడు ఒకరు కీలకపాత్ర పోషించినట్లు గుర్తించామని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. గతంలో ఇదే నాయకుడికి క్షమాభిక్ష పెట్టామన్నారు. వైద్యం పేరుతో ఆంధ్రా తీసుకెళ్లి శత్రువులకు చిక్కేలా చేసిన వారిని వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఇటీవలే పార్టీని మోసం చేసిన ఓ కాంట్రాక్టర్‌ను అంతమొందించామని గుర్తు చేశారు. తమ నిఘాలో మరికొంత మంది కాంట్రాక్టర్లు ఉన్నారన్నారు.

రాష్ట్రానికి మరో మూడు ప్రఖ్యాత కంపెనీలు

» ఎన్‌పీఎస్‌పీఎల్, సిప్సా టెక్, హిందాల్కో యూనిట్లు

» 1300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి

న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీం(ఈసీఎంఎస్) మూడో విడతలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు మూడు కీలక ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసింది. ఈసీఎంఎస్ కింద దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో రూ. 41,863 కోట్ల పెట్టుబడులతో కూడిన 22 దరఖాస్తులకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ఇందులో మూడు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనున్నాయి. శుక్రవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఈసీఎంస్ కింద ఎన్‌పీఎస్‌పీఎల్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్, సిప్సా టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ రాష్ట్రంలో తమ యూనిట్లను నెలకొల్పనున్నాయి. ఈ యూనిట్ల ద్వారా 1,300 మందికి పైగా ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. లిథియం-అయాన్‌సెల్ తయారీలో కీలకమైన యానోడ్ మెటీరియల్‌ని ఉత్పత్తి చేసేందుకు ఎన్‌పీఎస్‌పీఎల్ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఈ యూనిట్ ద్వారా 600 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. మల్టీలేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు(పీసీబీ) తయారీకి సిప్సా టెక్ రాష్ట్రంలో యూనిట్‌ను ఏర్పాటు చేసి, 100 మందికి ఉపాధి కల్పిస్తుంది. హిందాల్కో అల్యూమినియం ఉత్పత్తులను తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పి 613 మందికి ఉపాధి కల్పిస్తుంది.

తెలంగాణలో కొత్త బైక్‌పై రూ.2 వేలు సెస్సు!

» కారుకు 5 వేలు.. భారీ వాహనానికి 10 వేలు.. అసెంబ్లీలో బిల్లు

హైదరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొత్తగా బైక్ కొంటే ఇకపై రూ.2వేలు సెస్సు కట్టాలి. కారు కొంటే రూ.5వేలు.. భారీ వాహనాలైతే రూ.10 వేలు చెల్లించాలి. వాహన కొనుగోలుదారుల నుంచి రహదారి భద్రతా సెస్సు (రోడ్ సేఫ్టీ సెస్సు) వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మోటారు వాహనాల సవరణ బిల్లును శుక్రవారం సభలో ప్రవేశపెట్టింది. ఆటోలు, ట్రాక్టర్ ట్రైలర్లకు ఈ పన్ను నుంచి మినహాయింపు ఉంది. సరుకు వాహనాలపై వసూలు చేస్తున్న త్రైమాసిక పన్నును రద్దు చేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఇకపై లైఫ్ ట్యాక్స్‌గా 7.5 శాతం వసూలు చేస్తామన్నారు. లైసెన్స్ విధానాన్ని కఠినం చేస్తున్నామన్నారు.

జనవరిలోనూ చలి పంజా!

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా నమోదు కానుంది. రాష్ట్రంలోని ఉత్తర కోస్తాలో చలి తీవ్రత ఎక్కువగా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఒక మోస్తరుగా లేదా తక్కువగా ఉంటుంది. సంక్రాంతి తరువాత ఉత్తర కోస్తాలో ఎండ తీవ్రత స్వల్పంగా పెరగనుంది. జనవరి, ఇంకా జనవరి నుంచి మార్చి వరకు దేశంలో వాతావరణ పరిస్థితులపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గురువారం బులెటిన్ విడుదల చేసింది. దీని ప్రకారం... జనవరిలో దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్, ఈశాన్య, దక్షిణ భారతంలోని కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా నమోదవుతాయి. మధ్య, పశ్చిమ, తూర్పు భారతంలోని కొన్ని రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా, ఉత్తర, తూర్పు/ఈశాన్య భారతంలోని కొన్నిచోట్ల ఎక్కువగా, దక్షిణాదిలో సాధారణంగా నమోదవుతాయి. జనవరిలో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా, ఉత్తర, ఈశాన్య భారతం, తమిళనాడుల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ పేర్కొంది. కాగా, 2025లో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో తీవ్రస్థాయిలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. 1991-2020 మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు పరిగణనలోకి తీసుకుని గణించిన దీర్ఘకాల సగటు కంటే గతేడాది దేశవ్యాప్తంగా భూఉపరితల ఉష్ణోగ్రతలు 0.28 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. వాతావరణ శాఖ వద్ద ఉన్న రికార్డుల మేరకు 1901 నుంచి ఇప్పటివరకూ నమోదైన 8 అత్యంత వేడి సంవత్సరాల్లో 2025 ఒకటి. 2011 నుంచి 2025 వరకు పది వేడి సంవత్సరాలు, 2016 నుంచి 2025 వరకూ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



శ్రీశైలంలో ఓ ఇంటి ఆవరణలోకి ప్రవేశిస్తున్న చిరుత

ఇంటి ఆవరణలోకి చిరుత

» శ్రీశైలంలో కలకలం.. సీసీ టీవీలో నమోదైన దృశ్యాలు

శ్రీశైలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర శివార్లలో నిత్యం పులులు, చిరుతల సంచారం జరుగుతూనే ఉంది. శుక్రవారం తెల్ల వారుజామున పాతాళగంగ రోడ్డు మార్గంలో నివాసం ఉన్న సత్య నారాయణ శర్మ ఇంటి ఆవరణలోకి చిరుత ప్రవేశించింది. మోషన్ డిటెక్షన్ అలారం (కదలికలను గుర్తించే అలారం) మోగటంతో మేల్కొన్న సత్యనారాయణ అప్రమత్తమై సీసీ ఫుటేజీని పరిశీలించి స్థానికులను అప్రమత్తం చేశారు. కల్యాణకట్ట, మల్లికార్జున సత్రం, రజక సత్రం తదితర ప్రాంతాల్లో చిరుత తిరిగిన జాడలు కనిపించాయని పలువురు యాత్రికులు అంటున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న క్షేత్ర శివారు ప్రాంతాల్లో నివాసం ఉండే వారు, భక్తులు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) పరమేశు హెచ్చరించారు. దేవస్థానం అధికారులు కూడా ఎప్పటికప్పుడు మైక్ సెట్ల ద్వారా వన్యమృగాల సంచారంపై భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మార్చి 6, 7, 8 తేదీల్లో దుర్గగుడిలో మహాకుంభాభిషేకం

» విచ్చేయనున్న కంచి కామకోటి పీఠాధిపతి

ఇంద్రకీలాద్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈ ఏడాది మహాకుంభాభిషేకం నిర్వహించాలని దేవస్థానం వైదిక కమిటీ నిర్ణయించింది. మహా కుంభాభిషేకం నిర్వహణపై కంచి కామకోటి పీఠం నుంచి అనుమతి వచ్చింది. మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజులు ఈ కార్యక్రమాలు జరుగుతాయి. మహా కుంభాభిషేక కార్యక్రమానికి కంచి పీఠాధిపతి విచ్చేస్తారు. ప్రధాన కార్యక్రమం మార్చి 6వ తేదీ ఉదయం ప్రారంభమవుతుంది.

రాష్ట్రంలో కొనసాగుతున్న మంచు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకూ మంచు కురిసింది. దీంతో ఉదయం పూట వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విశాఖ ఎయిర్‌పోర్టులో విజిబిలిటీ 800 మీటర్లకు పడిపోయింది. అయితే సముద్రం మీదుగా తూర్పుగాలులు వీస్తుండడంతో తేమ వల్ల మేఘాలు ఆవరించి చలి స్వల్పంగా తగ్గింది. కాగా శ్రీలంక సమీపాన నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అయితే దీని ప్రభావం రాయలసీమ, కోస్తాపై ఉండదని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో మంచు కురుస్తోందని, చలి ప్రభావం ఒక మోస్తరుగా ఉంటుందని పేర్కొంది.

ఏవీవైఏవైకు రూ.2.91 కోట్లు విడుదల

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అటల్ వయో అభ్యుదయ యోజన(ఏవీవైఏవై)కు ప్రభుత్వం రూ. 2.91,17,446 అదనపు నిధులు మంజూరు చేసింది. శుక్రవారం ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద వృద్ధుల సంరక్షణ నిర్వహణ చట్టానికి సంబంధించి రాష్ట్ర వ్యాపంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

మాజీ ఎమ్మెల్యే సుమన కన్నుమూత



గంటెల సుమన

విశాఖపట్నం/నక్కపల్లి/పాయకరావుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):పాయకరావుపేట మాజీ శాసనసభ్యురాలు గంటెల సుమన (67) కన్నుమూశారు. ఆమె 1983 ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పాయకరావుపేట (ఎస్సీ రిజర్వుడ్) నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థినిగా విజయం సాధించారు. పార్టీలో సంక్షోభం తలెత్తినపుడు నాదెండ్ల పక్షాన నిలిచారు. ఆ తరువాత రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థినిగా మూడుసార్లు, ఇండిపెండెంట్‌గా ఒకసారి పాయకరావుపేట నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. సుమనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో పదిహేను రోజుల క్రితం కుటుంబ సభ్యులు రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె మృతి పట్ల హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సంతాపం తెలిపారు.

నూతన విద్యుత్ సవరణ బిల్లుపై ఇక యుద్ధమే!

» సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్



విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్పొరేట్లకు లబ్ధి కలిగించేలా రూపొందించిన కొత్త విద్యుత్ సవరణ బిల్లుపై యుద్ధం చేయనున్నట్టు సీఐటీయూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ తెలిపారు. విశాఖపట్నం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న 18వ అఖిల భారత సీఐటీయూ మహాసభలకు హాజరైన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ కారణంగా ప్రజల జీవనం ప్రమాదంలో పడిందన్నారు. కొత్త విద్యుత్ సవరణ బిల్లు, లేబర్ కోడ్‌లు, ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచడం వంటి చర్యలకు కేంద్రం పాల్పడుతోందన్నారు. దీనిపై ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో త్వరలోనే క్షేత్రస్థాయిలో ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. దేశరక్షణ, ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు వచ్చే నెల 12న సార్వత్రిక సమ్మెతో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నామని చెప్పారు. విశాఖలో జరుగుతున్న మహాసభల్లో ఉద్యమ కార్యాచరణపై రాష్ట్రాల వారీగా చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. విశాఖ ఉక్కుపై మహాసభల్లో చర్చ జరిగిందన్నారు. ముడిసరుకు ఇవ్వకుండా, ఉత్పత్తిని పూర్తిస్థాయిలో జరగనివ్వకుండా బీజేపీ కుట్ర పన్నుతోందని తపన్‌సేన్ ఆరోపించారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.

కూతురిపై తండ్రి అఘాయిత్యం

పెద్దపంజాణి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కూతురిపై కన్న తండ్రే అఘాయిత్యానికి పాల్పడిన ఘటన చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.... పెద్దపంజాణి మండలంలో ఓ కాలనీకి చెందిన వ్యక్తికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు 12ఏళ్ల కుమార్తె ఉంది. శుక్రవారం సాయంత్రం ఆ అమ్మాయి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో తండ్రి బలవంతం చేయబోయాడు. ఆమె కేకలు వేయడంతో సమీపంలోనే ఉన్న అతడి తల్లి అడ్డుకుంది. దీంతో ఆమెను చితకబాది కూతురిని చెట్లలోకి లాక్కుపోయాడు. దెబ్బలు తిన్న అతడి తల్లి పరుగున కాలనీకి చేరుకుని గ్రామస్థులకు విషయం తెలిపింది. అందరూ ఘటనా స్థలానికి వెళ్లేసరికి అప్పటికే తన మనవరాలిని మానభంగంచేసి పరారయ్యాడని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలితో స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



నిలువరిస్తున్న యువకులపైకి దూసుకొచ్చిన కోడెగిత్తలు

నేటి నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

» గుంటూరులో ఏర్పాట్లు పూర్తి



ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణం

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలు గుంటూరులో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. అన్నమయ్య కీర్తనలు, సహస్ర గళార్చనల నడుమ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహం చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కానుండగా, గజల్ శ్రీనివాస్ తెలుగు మహాసభలకు అధ్యక్షత వహించనున్నారు. గుంటూరు నగర శివార్లలోని శ్రీ సత్యసాయి స్పిరిట్యూయల్ సిటీలోని తెలుగు మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మరో ఐదు ఉప వేదికలపై సన్మానాలు, సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలు 3, 4, 5 తేదీల్లో జరుగుతాయి. దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి తెలుగు సంఘాల ప్రతినిధులు హాజరుకానున్న దృష్ట్యా వారందరికీ ఆంధ్ర సారస్వత పరిషత్ వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తోంది. 60 విద్యాసంస్థల నుంచి 25 వేల మంది విద్యార్థులు ఈ తెలుగు మహాసభలను సందర్శించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. తెలు గు వెలుగులు పేరుతో తెలుగు భాష ఉన్నతి కోసం కృషి చేసిన 350 మంది ప్రముఖుల చిత్రపటాలను ప్రాంగణమంతా ఏర్పాటు చేశారు. 42 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గజల్ శ్రీనివాస్ తెలిపారు.

యువకులపైకి దూసుకొచ్చిన కోడెగిత్తలు

» తిరుపతి జిల్లాలో జల్లికట్టు.. పలువురికి తీవ్రగాయాలు

చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కొత్తశానంబట్ల గ్రామంలో శుక్రవారం ఉత్కంఠభరితంగా జల్లికట్టు (పశువుల పండుగ) జరిగింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గ్రామంలోని నడివీధిలో పశువులను గుంపులుగా వదిలారు. అప్పటికే పరిసర గ్రామాలకు చెందిన యువత తరలివచ్చి కోడెగిత్తలను నిలువరించి.. వాటి కొమ్ములకు కట్టిన బహుమతులను సొంతం చేసుకొనేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో యువకులపైకి కోడెగిత్తలు దూసుకురావడం.. వాటి కింద పడటంతో 15 మందికిపైగా తీవ్రగాయాలయ్యాయి.వైద్య బృందం బాధితులకు చికిత్స చేయగా, మరి కొందరిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

న్యాయంపై భరోసా

ఉత్తర్‌ప్రదేశ్‌లో పదేళ్ళనాటి మహమ్మద్ అఖ్లాఖ్ హత్యకేసులో నిందితులపై ఆరోపణలు ఉపసంహరించుకోవాలన్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయాన్ని స్థానికకోర్టు ఇటీవల తిరస్కరించింది. నేరారోపణలు జరిగిన ఇంతకాలానికి, అఖ్లాఖ్‌ను కొట్టిచంపిన వారిని రక్షించుకొనే లక్ష్యంతో యూపీ ప్రభుత్వం స్థానిక సెషన్స్‌కోర్టులో నవంబరులో దరఖాస్తు దాఖలు చేసినప్పుడు దేశం నివ్వెరపోయింది. గవర్నర్ సహా పకడ్బందీగా పెద్దతలకాయలందరి సంతకాలతో, నేరశిక్షాస్మృతిలోని 321వ సెక్షన్ వాడుకొని ప్రభుత్వం ఈ కేసు మూసివేతకు సిద్ధపడింది. సర్వసాధారణంగా స్థానికకోర్టులు ధిక్కారాన్ని ప్రదర్శించవు కనుక కేసు మూతబడిపోతుందనే అంతా భావించారు. కానీ, గ్రేటర్ నోయిడా సురాజ్‌పూర్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి సౌరభ్ ద్వివేది అందుకు అంగీకరించలేదు. అఖ్లాఖ్ హత్య కేసును అతి ముఖ్యమైనదిగా అభివర్ణిస్తూ, ఉపసంహరణ ప్రతిపాదనను తిరగ్గొట్టారు. అంతేకాదు, జనవరి 6నుంచి ప్రతిరోజు విచారణ కొనసాగించి, వేగవంతం చేయాలని సంకల్పించారు. ఏ అనుమానం కలిగిందో ఏమో, బాధితకుటుంబీకులకు, సాక్షులకు అదనపు భద్రత కల్పించాలని కూడా జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. యోగి ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన అదనపు జిల్లా జడ్జి ద్వివేదీ ధైర్యాన్ని కాంగ్రెస్ తెగమెచ్చుకుంటూ, ముందు ఈ జడ్జిగారికి అదనపు భద్రత కల్పించడం అత్యావశ్యకమంటోంది.

ఇటీవల 'ఉన్నావ్' ఉన్మాది కుల్‌దీప్‌సింగ్ సెంగార్‌ను ఢిల్లీహైకోర్టు ఏవో కొన్ని సాంకేతిక కారణలమీద వదిలేసిన రోజుల్లోనే ఈ దాద్రి ఘటనలో ఫాస్ట్‌కోర్టు పూర్తిభిన్నమైన నిర్ణయం తీసుకోవడం విశేషం. ప్రభుత్వ అధికారి నిర్వచనంలోకి రారు అన్న ఏకైక వాదనతో కుల్‌దీప్‌ను జైలునుంచి విడుదల చేయాలన్న ఆ నిర్ణయం దేశాన్ని నివ్వెరపరిచింది. అనేకరోజులు ఈ బీజేపీ ఎమ్మెల్యే నిర్బంధంలో ఉంటూ, అత్యాచారానికి గురైన ఆ యువతి ఈ పరిణామంతో వొణికిపోయి మళ్ళీ వీధిపోరాటాలకు దిగాల్సివచ్చింది. దేశరాజధానిలో నిరసన చేపట్టిన బాధితురాలిని, ఆమె తల్లిని పారామిలటరీ బలగాలు ఈడ్చి పారేశాయి. సెంగార్ జైలునుంచి బయటకు వస్తే తనకు చావు ఖాయమన్న ఆమె భయం వెనుక కారణాలు తెలియనివేమీ కావు. సదరు బీజేపీనేతపై కేసు నమోదుచేయడానికి కూడా పోలీసులు మొదట ఒప్పుకోలేదు. ఆ తరువాత సెంగార్ మనుషులతో కలిసి వారు ఆమె తండ్రిని జైల్లోనే కొట్టిచంపేశారు. ముఖ్యమంత్రి ఇంటిముందు ఆమె ఆత్మాహుతికి ప్రయత్నించడం, ప్రజాగ్రహానికి జడిసి యోగి ప్రభుత్వం ఎట్టకేలకు సెంగార్‌ను అరెస్టు చేసినప్పటికీ ఇతగాడు జైలు నుంచే బాధితురాలిని హత్యచేయించేందుకు కుట్రపన్నడం, ఘోర రోడ్డు ప్రమాదంలో ఆమె ఆత్మీయులను కోల్పోవడం వంటి పలు పరిణామాలు ఈ భయానికి కారణం. ట్రయల్ కోర్టు సెంగార్‌కు జీవితఖైదు విధిస్తే, ఢిల్లీహైకోర్టు చిలికిచిలికి వెలికితీసిన ఓ చిన్న నిర్వచనం ఆధారంగా అతికష్టంమీద బాధితురాలు గతంలో సాధించిన న్యాయాన్ని తిరిగి లాగేసుకుంది. కొందరు న్యాయవాదులు, ఆ తరువాత తప్పనిసరై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో అది సెంగార్ విడుదలకు అడ్డుకట్టవేసి న్యాయం పట్ల ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టింది.

అఖ్లాఖ్ హత్య ఘటనలో ప్రధాన నిందితుడు స్థానిక బీజేపీ నాయకుడి కుమారుడు విశాల్‌రాణా. అఖ్లాఖ్ ఇంటిమీదకు దండెత్తి, అతడి ఫ్రిజ్‌లో గోమాంసం ఉన్నదని వాదించి, అక్కడి ఆలయం మైకు నుంచి దానిని ప్రకటించి, సామూహికంగా కొట్టిచంపిన పద్నాలుగు మందినీ యోగిప్రభుత్వం కాపాడదల్చుకుంది. అఖ్లాఖ్ కుటుంబీకులు చీటికీమాటికీ తమ వాదనలను మార్చేస్తున్నారని, నిందితులు మారణాయుధాలు వాడలేదని, బాధితుడికీ, నిందితులకు మధ్య పాత కక్షలు లేవనీ, అందువల్ల ఈ కేసు కొనసాగింపు అర్థంలేనిదన్న వాదనతో చివరి అంకంలోకి చేరిన ఈ కేసును యోగి ప్రభుత్వం మూసివేసే ప్రయత్నం చేసింది. కానీ, అఖ్లాఖ్ హత్యకు వారంతా కర్రలు, ఇనుపరాడ్లు, ఇటుకలు ఇత్యాదివి వాడిన విషయం సహా, అన్ని తీవ్రమైన సెక్షన్లనూ సమర్థించే పకడ్బందీ ఆధారాలున్నాయి. మతోన్మాదానికీ, మూకదాడులకూ ప్రతీకగా నిలిచిన ఈ కేసును మూసివేయడం ద్వారా ఈ తరహా హత్యలను సాధారణీకరించేందుకు యోగి ప్రభుత్వం ప్రయత్నించింది. న్యాయస్థానాలు, సమాజం తమను ప్రశ్నించబోమన్న పాలకుల ధైర్యాన్ని వమ్ముచేసి, అఖ్లాఖ్ కుటుంబానికి భవిష్యత్తులో న్యాయం దక్కవచ్చునన్న నమ్మకాన్ని దేశానికి మిగల్చినందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తిని అభినందించాలి.

భారత్ భావనకు 'విద్వేష' ఉపద్రవం

నూతన సంవత్సర శుభాకాంక్షలు. గతించిన సంవత్సరం (2025)లో మీ మనసుపై ముద్ర వేసిన ప్రభావం లేదా ఘటన ఏమిటి? శాశ్వతంగా నిలిచిపోయే దాని జ్ఞాపకాన్ని సువ్యక్తం చేసే పదం ఏమిటి? ఈ సువిశాల దేశంలో అత్యధిక ప్రజలను కదిలించిన మాట ఏమిటి?

2025 సంవత్సరం మనలో మిగిల్చిన మన్నికైన జ్ఞాపకం 'సిందూర్'. పహల్గాంలో అమానుష ఉగ్రవాద దాడికి పాల్పడింది ముగ్గురు పాకిస్థానీ చొరబాటుదారులు. ఈ పాకిస్థానీ దుండగులకు ఆశ్రయమిచ్చి, వారి ఘాతుకానికి సహకరించినది ఇద్దరు భారతీయులు అని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వెల్లడించింది. పహల్గాం హత్యాకాండకు భారత ప్రభుత్వ ప్రతిస్పందనే 'ఆపరేషన్ సిందూర్'. ఈ సైనిక చర్యలో భారత వాయుసేన, క్షిపణులు, డ్రోన్‌లు పాకిస్థాన్ సైనిక స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించాయి. మన దేశానికీ కొంత నష్టం సంభవించింది (ఏ యుద్ధంలోనైనా ఇది అనివార్యం). ముగ్గురు పాకిస్థానీ చొరబాటుదారులు ఒక ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఎన్ఐఏ అరెస్ట్ చేసిన ఇద్దరు భారతీయుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ఆపరేషన్ సిందూర్ నిర్వహణ, సాధించిన ఫలితాలపై ఇప్పటికీ పారదర్శకత కొరవడింది. కేవలం నాలుగు రోజులు మాత్రమే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' దేశ ప్రజల మనసులపై శాశ్వత ప్రభావం కలిగించేంత సుదీర్ఘ యుద్ధం కాదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

2025లో భారత్‌ను నిర్వచించేందుకు యుక్తమైన మరో పదం 'టారిఫ్'. ఆ సేతు హిమాచలం అశేష ప్రజల మాటామంతీ, పిచ్చాపాటీలో ప్రస్తావితమైన, ఇంకా ప్రస్తావితమవుతోన్న పదమది. దానికి దీటైన మరొక పదం 'ట్రంప్' మాత్రమే! ట్రంప్ టారిఫ్‌లు అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను సంక్లిష్ట సమస్యల్లోకి నెట్టివేశాయి. చాలా దేశాల్లో ఈ సమస్యలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఉదాహరణకు అమెరికాకు భారత్ ఎగుమతులపై ప్రతీకార సుంకాలు, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానా విధింపులు కొనసాగుతున్నాయి. అమెరికాకు భారత్ చేస్తున్న– ఉక్కు, అల్యూమినియం, జౌళి ఉత్పత్తులు, ముత్యాలు, ఆభరణాలు, సముద్ర ఆహార ఉత్పత్తులు, రసాయనాల ఎగుమతులను ట్రంప్ సుంకాలు ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా, భారత్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం 'సమీప భవిష్యత్తు'లో కుదరనున్నదని 2025 ఏప్రిల్‌లో వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ ప్రకటించారు. 2025 సంవత్సరం ముగిసిపోయింది. ఇప్పటికీ ఆ ఆశావహ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చాలా సుదూర విషయంగానే కనిపిస్తోంది మరి.

జీఎస్టీ (వస్తుసేవల పన్ను) మరొక యుక్తమైన పదంగా చెప్పవచ్చు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఈ పన్ను వ్యవస్థ ప్రారంభమయింది. వినియోగదారులకు, వ్యాపార వర్గాలకు అదొక ఉపద్రవం. సముచిత సలహాలు, సూచనలకు కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానే అయినప్పటికీ సానుకూలంగా ప్రతిస్పందించింది. చాలా సరుకులు, సేవలపై జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించింది. అయినప్పటికీ వర్తకులు, వ్యాపారులు, వాణిజ్యవేత్తలకు పాలనా యంత్రాంగాల నుంచి వేధింపులు, చికాకులు తప్పడం లేదు. కొంతమంది వ్యాపారులు అయితే ఇప్పటికీ జీఎస్టీ విషయంలో తికమక పడుతూనే ఉన్నారు. జీఎస్టీ చట్టాలకు అనుగుణంగా వ్యవహరించడంలో తమకు ఎదురవుతున్న కష్ట నష్టాలకు వర్తకులు, వ్యాపారులు ఎంతో మంది గుండెలు బాదుకుంటూనే ఉన్నారు. కొన్ని ముఖ్యమైన సరుకులపై పన్ను రాయితీ కల్పించారు. అయితే వాటి వినియోగ పరిమాణంతో పోల్చితే ఆ రాయితీ చాలా స్వల్పమైనది మాత్రమే. జీఎస్టీపై ఇచ్చిన రాయితీలతో వినియోగం ఇతోధికంగా పెరుగుతుందని ప్రభుత్వం భావించింది. అయితే దేశ జనాభాలో అధిక ఆదాయమున్న పదిశాతం ప్రజల వినియోగం మాత్రమే పెరిగింది. చెప్పవచ్చిన దేమిటంటే జీఎస్టీ ఇప్పటికీ సామాన్య వినియోగదారులకు చికాకు కలిగిస్తూనే ఉన్నది.

2025 సంవత్సరం భారత ఆర్థిక వ్యవస్థకు 'Goldilocks year' (స్థిరమైన, మితమైన వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం, తక్కువ నిరుద్యోగంతో ఆర్థిక వ్యవస్థ వర్ధిల్లిన అరుదైన సంవత్సరం) అని ప్రభుత్వం ఆర్భాటంగా చాటింది. అయితే ఈ ప్రచారార్భాటం చాలా త్వరితంగానే అంతరించిపోయింది. ఆ ఘనమైన మాట–గోల్డిలాక్స్ ఇయర్ సూచించే విషయాలు విద్యాధికులకే అపరిచితమైనవి. దీనికి తోడు దేశ జాతీయ గణాంకాల విశ్వసనీయతను అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ ప్రశ్నించింది. దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనతల గురించి మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు మొదలు అర్థశాస్త్ర ఘనాపాఠీలు అయిన



విశ్వవిద్యాలయాల ఆచార్యుల వరకూ ఎందరో మాట్లాడారు. అయితే ఉద్యోగాలకై యువజనులు చేసిన ఆందోళనలతో ప్రభుత్వ ప్రాయోజిత 'గోల్డిలాక్స్ ఇయర్' ప్రచారం నిలిచిపోయింది. నిజానికి ప్రధాన ఆర్థిక మాజీ సలహాదారు, తదితరులు చెబుతున్న వాటికంటే చాలా బలహీనతలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఉన్నాయి. వాటిని అంగీకరించేందుకు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఇంకా చెప్పాలంటే... బహుశా, ఆ బలహీనతలను అర్థం చేసుకునేందుకు సైతం ప్రభుత్వం నిరాకరిస్తోంది.

సరే, ఒకప్పుడు అందరూ 'లౌకికవాదం' అనే పదాన్ని ప్రస్తావిస్తుండేవారు. లౌకికవాద విలువల గురించి మాట్లాడుతుండేవారు. అయితే ఇప్పుడు ఆ పదం ఎక్కడా విన్పించడం లేదు. తమనుతాము లౌకికవాదులుగా చెప్పుకునే వారి సంఖ్య అంతకంతకూ తగ్గిపోతోంది. రాజ్య వ్యవస్థ కార్యకలాపాల నుంచి మత ప్రమేయ వ్యవహారాలను వేరు చేయడమే లౌకికవాదం. అయితే మత సిద్ధాంతాలపై కాకుండా హేతువు, మానవతావాదంపై లౌకికవాద విలువలు ఆధారపడి ఉంటాయనే అర్థాన్ని ఆ పదం కాలక్రమేణా సంతరించుకున్నది.

లౌకికవాద విలువల, విశ్వాసాల తిరోగమనం విద్వేషం ప్రబలిపోయేందుకు దారితీసింది. ప్రతి మతమూ గర్హించిన మానవ స్వభావమది. విద్వేష ప్రసంగాలు, విద్వేష రచనలుగా చెప్పదగినవాటిలో అత్యధికం మత ఆధారితమైనవి. జాతి, భాష, కులం కూడా చాలా మందిలో విద్వేష వైఖరులకు ఆధారంగా ఉన్నాయి. విద్వేష వైఖరులకొక స్పష్టమైన తార్కాణం ముస్లింల పట్ల ద్వేషం. వారి వస్త్రధారణ, ఆహార అలవాట్లు, ప్రార్థనా ప్రదేశాల పట్ల ఇతరుల్లో వ్యతిరేకత పెరుగుతోంది. ఈ కారణంగానే ముస్లింల 'నమాజ్' (ప్రార్థన)కు అంతరాయం కలిగించడం, ఆ మతాచారాలపై ఆంక్షలు విధించడం జరుగుతోంది.

తోటి భారతీయులు అయిన ముస్లింల పట్ల ఇలా ఎందుకు వ్యతిరేకత ప్రబలిపోతోంది? సుదూర ప్రాంతాలకు చెందిన ముస్లింలు భారత్‌ను దురాక్రమించి ఆరు శతాబ్దాల పాటు పరిపాలించారని, ముస్లింలకు ఈ దేశంలో వారి స్థానమేమిటో చూపే సమయం ఇప్పుడు ఆసన్నమయిందని, హిందువులు ఆ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారని... ముస్లింలను ద్వేషించే పలువురు వాదిస్తున్నారు. ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే వాదన, సందేహం లేదు. ముస్లింల మీదే కాదు, మరో మైనారిటీ మతమైన క్రైస్తవం పట్ల కూడా ఆగ్రహం ప్రచండంగా వ్యక్తమవుతోంది. క్రైస్తవ ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేస్తున్నారు. క్రైస్తవ పూజారులు, మతాచార్యులు, క్రైస్తవ ధర్మ ప్రచారకులను హతమారుస్తున్నారు. జీసస్ స్తుతి గీతాలు గానం చేస్తున్న క్రైస్తవ బాలలపై దాడులు జరుగుతున్నాయి. ఈ ఆగడాలన్నీ హిందూ 'హక్కుల'ను రక్షించడం పేరిట జరుగుతున్నాయి!

హిందూ మత ఆధిపత్య భావనను ఏవగించుకున్నంతగా మరే భావనను భారత రాజ్యాంగం అసహ్యించుకోదు, వ్యతిరేకించదు. భారత్ భావన (ఐడియా ఆఫ్ ఇండియా)కు పునాది పౌరసత్వమే కానీ మతం ఎంత మాత్రం కాదు. అలాగే కులం లేదా జాతి లేదా భాష కూడా భారతీయ భావనకు ప్రాతిపదికలు కావు. భారతీయులలో అత్యధికులు డాక్టర్ అబ్దుల్ కలాం, మదర్ థెరిస్సా ఉదాత్త జీవితాల నుంచి స్ఫూర్తి పొందుతున్నారు. వారిని పూజ్యభావంతో స్మరించుకోవడం తమ భారతీయతకు చిహ్నంగా విశ్వసిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులకు వ్యతిరేకంగా విద్వేషాన్ని రగిలించి వ్యాపింపజేస్తున్న భారతీయుల సంఖ్య చాలా చాలా స్వల్పం.

ఈ విద్వేష పర్వంలో అత్యంత ఆందోళనకరమైన విషయం మైనారిటీ మతాల వారిపై దాడులను శాసన సమ్మతం చేసే ప్రయత్నమే. రాజ్య వ్యవస్థ, ఉన్నత పదవులలో ఉన్న నాయకులు, ప్రభుత్వాల అండదండలతో పెట్రేగిపోతున్న కొన్ని సంఘాలు ఈ రాజ్యాంగ విరుద్ధ చర్యలకు ప్రధాన బాధ్యులు. వారి మాటలు, చేతలు లేదా మౌనం విద్వేషకారులు చెలరేగిపోయేందుకు ప్రోత్సాహమిస్తున్నాయి. ఆ విద్వేష దాడులు మానవతను కాలరాసివేసేవే. ఈ ధోరణి కొనసాగడం భారతీయ సమాజానికి చేటుచేస్తున్నది. భారత గణతంత్ర రాజ్య వ్యవస్థాపకులు ఏది జరగకూడదని సంకల్పించారో అదే సంభవిస్తున్నది. సంకుచితత్వాల ఇరుకు గోడల మధ్య మన మహోన్నత పురానవజాతి మరొకసారి ముక్కలు ముక్కలయి పోగలదు. ఈ అరిష్టం సంభవించకుండా అడ్డుకోవడం భారతీయ పౌరుల విధ్యుక్త ధర్మం. ఆవేదన, ఆగ్రహం, అమితమైన వ్యాకులత, అంతకు మించిన తలవంపులతో గతించిన సంవత్సరం (2025)లో భారతదేశాన్ని నిర్వచించే పదంగా 'విద్వేషం'ను ఎంచుకున్నాను.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

> **భారత్ భావన (ఐడియా ఆఫ్ ఇండియా)కు పునాది పౌరసత్వమే కానీ మతం కాదు. కులం లేదా జాతి లేదా భాష కూడా భారతీయ భావనకు ప్రాతిపదికలు కావు. భారతీయులలో అత్యధికులు అబ్దుల్ కలాం, మదర్ థెరిస్సా ఉదాత్త జీవితాల నుంచి స్ఫూర్తి పొందుతున్నారు. వారిని పూజ్యభావంతో స్మరించుకోవడం భారతీయతకు చిహ్నంగా విశ్వసిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులకు వ్యతిరేకంగా విద్వేషాన్ని రగిలించి, దాన్ని వ్యాపింపజేస్తున్న భారతీయుల సంఖ్య చాలా చాలా స్వల్పం.**

సేంద్రియ శిక్షణలో పదేళ్ల ప్రస్థానం

మన నేలలే మన భవిత. సారమున్న భూములే ప్రగతికి పునాది. ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి, సామాజిక స్థిరత్వం, సమగ్ర అభివృద్ధి సైతం వ్యవసాయ, అనుబంధ రంగాలతోనే ముడిపడి ఉంది. భూముల్లో సేంద్రియ కర్బనస్థాయి 1951లో 4 శాతంగా ఉంటే ఇప్పుడు 0.4శాతానికి తగ్గిపోయింది. దీనికి విచక్షణ లేకుండా రసాయన ఎరువుల వినియోగం ప్రధాన కారణం. నేలల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ వినియోగం సిఫారసు చేసిన 4:2:1 నిష్పత్తి కంటే అధికంగా 6:4:1గా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఈ పరిస్థితి మరింత దిగజారకుండా, క్షేత్ర స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా అహరహం శ్రమిస్తున్నాయి. వీటిలో భిన్నమైనది రైతునేస్తం ఫౌండేషన్.

పదేళ్లుగా రైతునేస్తం వ్యవసాయ మాసపత్రికను విజయవంతంగా నడిపిన యడ్లపల్లి వెంకటేశ్వరరావు తన అనుభవంలో– నిరంతర శిక్షణ అవసరం అన్న విషయం గ్రహించి 2016 ఫిబ్రవరి 28న జాతీయ రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు అప్పటి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మంత్రి పత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా గుంటూరు జిల్లా పుల్లడిగుంట, కొర్నెపాడులో రైతునేస్తం ఫౌండేషన్ ప్రారంభించారు. పదేళ్ల కాలంలో ఈ ఫౌండేషన్ సేంద్రియ రైతులకు వేదికయింది. వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువల జోడింపుతోనే రైతుకు గిట్టుబాటు అనే సూత్రం నేర్పిన పాఠశాల అయింది. రసాయన రహిత సేద్య ఉద్యమానికి కేంద్రమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలతో వందలాది అవగాహన కార్యక్రమాలు, శిక్షణ తరగతులు నిర్వహించి, లక్షలాది రైతులకు సేంద్రియ, రసాయన రహిత వ్యవసాయ విధానాలు బోధించింది. అనుబంధ రంగాలపై అవగాహన కల్పించి వారి ఆలోచనా ధోరణిలో మార్పునకు బీజం వేసింది. దీనిని ఒక సామాజిక బాధ్యతగా రైతునేస్తం ఫౌండేషన్ చేపట్టింది.



> **దశాబ్దకాలంలో రైతునేస్తం ఫౌండేషన్ సేంద్రియ రైతులకు వేదికయింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలతో వందలాది అవగాహన కార్యక్రమాలు, శిక్షణ తరగతులు నిర్వహించి, లక్షలాది రైతులకు సేంద్రియ, రసాయన రహిత వ్యవసాయ విధానాలు బోధించింది. అనుబంధ రంగాలపై అవగాహన కల్పించి, వారి ఆలోచనా ధోరణిలో మార్పునకు బీజం వేసింది.**

శిక్షణ తరగతులలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో పాటు అనుబంధ రంగాలైన పశుపోషణ, గొర్రెలు, కోళ్ళు, చేపలు, పశుగ్రాసాలు, పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకంతో పాటు పెరటిలో కూరగాయల సాగు అంశం కూడా చేర్చి, ఆయా రంగాల్లో నిపుణులతో అవగాహన తరగతులు నిర్వహించడం విశేషం. వీటితో పాటు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్స్ వాడకంపై చైతన్యపరచింది. ఇక మన సంప్రదాయ పంటలయిన చిరుధాన్యాలను తిరిగి సాగులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో వీటి ప్రాముఖ్యం, వాడకంతోనే సంపూర్ణ ఆరోగ్యం అనే అంశాలపై తెలుగు రైతులోకానికి డా. ఖాదర్‌వలితో వందలాది అవగాహన సదస్సులు నిర్వహించి, నిశ్శబ్ద విప్లవానికి శ్రీకారం చుట్టింది. చిరుధాన్యాల సాగు, మార్కెటింగ్‌పై అవగాహన తీసుకురావటానికి రైతునేస్తం ఫౌండేషన్‌లో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను సైతం ఏర్పాటు చేశారు. అలాగే సేంద్రియ వ్యవసాయానికి మూలమైన దేశీ జాతి 50 ఆవులతో రైతునేస్తం గోశాలను ఏర్పాటు చేసింది.

సేంద్రియ వ్యవసాయంలో రైతులకు అవగాహనతో పాటు, ఆ విధానంలో పండించిన పంటలను క్షేత్రస్థాయిలో చూపించటంతో పాటు, రైతునేస్తం మొబైల్ యాప్ ద్వారా సేంద్రియ వ్యవసాయ సమాచారాన్ని రైతులకు అందించడాన్ని ఫౌండేషన్ బాధ్యతగా పెట్టుకున్నది. రైతునేస్తం పబ్లికేషన్స్ ద్వారా 100కి పైగా వ్యవసాయం, అనుబంధ రంగాల పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చింది. సేంద్రియ రైతులను, అందుకు కృషిచేస్తున్న శాస్త్రవేత్తలను, విస్తరణ అధికారులను, అగ్రి జర్నలిస్టులను రైతునేస్తం పురస్కారాలు'తో ప్రతి ఏటా గౌరవించే కొత్త సంప్రదాయానికి తెరతీసింది. అంతటితో ఆగకుండా మారిన కాలానికి దీటుగా వీరి రైతునేస్తం యూట్యూబ్ చానెల్ సేంద్రియ రైతుల విజయగాథలకు ఆలంబన అయింది. దాదాపు 14 లక్షల మంది చానెల్‌కు చందాదారులు కావటం వారి విశ్వసనీయతకు, పనితీరుకు, ప్రతిభకు నిదర్శనం. రైతులు పండించిన సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలపై అవగాహన కల్పించి, మంచి ధర లభించేలా రైతునేస్తం కృషి చేస్తున్నది. అయితే రైతాంగం ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని 'సేంద్రియ వ్యవసాయ హబ్'లుగా తెలుగు ప్రాంతాలను మార్చాలన్న వారి లక్ష్యం ఈ దశాబ్దకాలంలో ఎంత మేర నెరవేరిందన్నది వారు విశ్లేషించుకోవాలి. ఇన్నేళ్ల కృషి ఫలితాన్ని మదింపు చేసుకోవాలి.


గత పదేళ్లుగా వారి ఆలోచనలను వారికున్న పరిధిలో త్రికరణశుద్ధిగా ఆచరణలో పెట్టారు. క్షేత్ర స్థాయిలో కలసి వచ్చిన ఉద్యాన, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలతో పాటు మరెందరినో సమన్వయం చేసుకుంటూ ముందుకు నడిచారు. అయితే ఎవ్వరి ఆర్థిక సహాయ సహకారాలు లేకుండా స్వంత నిధులతో పనులు నిర్వహిస్తూ ఫౌండేషన్ రైతులకు దగ్గరైంది. కొన్ని శిక్షణలకు అడపా దడపా నాబార్డు పాత్ర ఉండివుండవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో రైతు సాధికారిక సమితి ఆధ్వర్యంలో సాగుతున్న సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ ఉద్యమం కూడా వీరిని భాగస్వామిగా తీసుకోలేదు. ఎవరి తోవలో వారు నడుస్తున్నారు. సేంద్రియ సేద్యం, చిరుధాన్యాలు, మిద్దెతోటల ఆలోచనలను మాత్రం తెలుగు నాట రైతునేస్తం ఫౌండేషన్ నాటగలిగింది.

• వలేటి గోపీచంద్

(ఈ నెల 5న గుంటూరు జిల్లా కొర్నెపాడులో రైతునేస్తం ఫౌండేషన్ దశాబ్ది ఉత్సవాలను పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభించనున్నారు.)

దళిత సాహిత్య వేగుచుక్క

ఆధునిక భారతదేశ చరిత్రలో కుసుమ ధర్మన్న, డా. బి.ఆర్. అంబేద్కర్, డా. అన్నాభావు సాఠె, బోయి భీమన్న మొదలైనవారు తమ రచనల ద్వారా దళిత సాహిత్యం అనే సౌధాన్ని నిర్మించగా, ఆ సాహిత్య భవనానికి పునాది వేసింది మాత్రం ఒక పాఠశాల విద్యార్థిని. ఆమె పేరు ముక్తా సాళ్వే. ఘనమైన చారిత్రక నేపథ్యం కలిగివున్న లహుజీ సాళ్వే వంశంలో పూణేలోని గంజ్‌పేట్‌లో 1840 జనవరి, 5న ఆమె జన్మించారు. అగ్రవర్ణాలు ఆధిపత్యం చెలాయించే అప్పటి సామాజిక వ్యవస్థలో బాలికలకు విద్య అనేది కలలో కూడా ఊహించుకోవడానికి ఆస్కారం లేదు.



మొట్టమొదటిసారిగా భారతదేశ చరిత్రలో తన గురువు, క్రాంతిపిత లహుజీ సాళ్వే సహకారంతో, మహాత్మా జ్యోతిబారావ్ పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను పూణేలోని భిడేవాడాలో 1848లో ప్రారంభించారు. ఇది పెను సంచలనానికి దారితీసింది. పూలే దంపతులు మాంగ్, మహర్ వంటి కులాల బాలికల కోసం 'వెటల్‌పేట్'లో స్థాపించిన పాఠశాలలో చేరిన ఎనిమిది మంది అమ్మాయిలలో ముక్తా సాళ్వే మొదటి విద్యార్థి. ఆమె కుటుంబ సభ్యుల నుంచి సమాజం అనే విషయం గురించి తెలుసుకొని, పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనతో ఆ విషయాలను అక్షర రూపంలో నేర్చుకున్నది. అనుభవంతో నేర్చుకున్న అంశాలను అక్షరబద్ధం చేసిన ఆమె 'మాంగ్ మహారాచి దుఃఖవిశాయి' అనే పేరుతో ఒక వ్యాసం రాసి, బడుగు బలహీన వర్గాలు, స్త్రీల సమస్యలను, అప్పటి క్రూర సమాజ కట్టుబాట్లను కళ్లకు కట్టినట్లు వివరించింది. దీని మొదటి భాగం 1855, ఫిబ్రవరి 15న, రెండవ భాగం మార్చి 1న 'జ్ఞానోదయ్' అనే మరాఠీ పత్రికలో ప్రచురితమయ్యాయి.

తన వ్యాసం ద్వారా 'ఒక వ్యక్తికి లేదా ఒక వర్గానికి మాత్రమే ప్రత్యేక హక్కులు కల్పించి, మిగిలిన వారికి ఎలాంటి హక్కులూ కల్పించలేని ధర్మం ఈ భూమి నుంచి అంతరించిపోవాలి' అని ముక్తా పేర్కొన్నది. ఈ వ్యాసంలో విద్య ఆవశ్యకతను నొక్కి చెప్పడంతో పాటు, మహిళలు, బడుగు బలహీన పేద వర్గాల వారు కేవలం జ్ఞానం ద్వారా మాత్రమే తమ న్యాయమైన హక్కుల్ని, గౌరవాన్ని పొంది, అభివృద్ధి మార్గంలో పయనిస్తారని చెప్పింది. అందరికీ కనిపించే విధంగా ప్రతి పాఠశాల దర్శనీయ ప్రదేశాల్లో ఈ వ్యాసం ప్రదర్శించాలని బొంబాయి విద్యాశాఖ 1855లో ఉత్తర్వులు జారీ చేసి, ఆమెను ఉత్తమ విద్యార్థిగా గౌరవించింది. అదే ఏడాది పూణా గెజిట్‌లో కూడా ముక్తా వ్యాసం ప్రచురితమయింది. అనేకసార్లు అనువాదమైన ఘాటైన ఆమె వ్యాసం, దళిత సాహిత్యంలో మొదటి రచనగా ఖ్యాతిగాంచింది. అందుకే ముక్తాను దళిత సాహిత్యానికి తల్లి అని పిలుస్తారు.

కేవలం మూడు సంవత్సరాల పాఠశాల విద్యాభ్యాసం ద్వారా 14 ఏళ్ల వయస్సులోనే వివక్ష, అణచివేత లాంటి విస్తృత భావనలను అర్థం చేసుకొని, బలహీనవర్గాలపై ఆధిపత్య వర్గాలు చేస్తున్న అకృత్యాలను బహిర్గతం చేసింది. విద్యా జ్ఞానమే అన్ని సమస్యలకు దివ్యౌషధం అని ప్రపంచానికి చాటిచెప్పి, ఆధునిక భారతీయ విద్యా విధానం ప్రక్షాళనకు కారకులైన మొదటి దళిత రచయిత ముక్తా సాళ్వే. ఆమె ఆశయాలను, కృషిని స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

○ గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్

రాష్ట్ర అధ్యక్షులు, మాంగ్ సమాజ్ తెలంగాణ

(జనవరి 5: ముక్తా సాళ్వే జయంతి)

ఆస్పత్రుల్లో వలంటీర్లు అవసరం

ప్రభుత్వ వైద్యశాలలకు చికిత్స కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు, నిరక్షరాస్యులు నిత్యం వస్తుంటారు. వారు వైద్యశాలలో ఓపీ చీటి తీసుకున్న తర్వాత డాక్టర్ వద్దకు, ల్యాబ్‌కు, స్కానింగ్‌కు... ఇలా ఎటువెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతుంటారు. వీరికి సహాయం చేసేవారు శూన్యం. అలాగే, అత్యవసర పరిస్థితుల్లో రోగులను వీల్‌ఛైర్లు, స్ట్రెచర్లతో వార్డులకు చేర్చడానికి వలంటీర్ల సహాయం అవసరం. కాబట్టి సీనియర్ సిటిజన్లకు గానీ, ఆసక్తి ఉన్న ఇతరులకు గానీ అవకాశమిస్తే వారు వలంటీర్లుగా ఉచితసేవ చేయడానికి సిద్ధంగా ఉంటారు. వీరిని ఉపయోగించుకుంటే రోగులకు కొంతలో కొంత తక్షణ వైద్య సహాయం అందుతుంది. పలు ధార్మిక సంస్థల్లో ఇలాగే వలంటీర్లు ఉచితసేవ చేస్తున్నారు. ఇలాంటి విధానాన్నే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ అమలు చేసేందుకు పాలకులు తగు చర్యలు చేపట్టాలి.

– బీవీ సుబ్బన్న
అనంతపురం

ఆధునిక విద్యాభారతి వైతాళికురాలు

మహిళలు, దళితులు, శూద్రులు చదువు పొందకూడదనే కఠినమైన సామాజిక ఆంక్షలు ఉన్న కాలంలో, వాటన్నిటినీ ఛేదించి విద్య మాత్రమే విముక్తికి మార్గమని నిరూపించిన ధైర్యశాలి సావిత్రిబాయి పూలే. అణచివేత, అవమానం, అపహాస్యం వంటి ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ కూడా సమానత్వం, మానవత్వం, న్యాయం అనే విలువల కోసం ఆమె అలుపెరుగకుండా పోరాడారు. ఆమె దృష్టిలో చదువనేది కుల, లింగ వివక్ష నుంచి విముక్తి పొందే ఆయుధం. ఇలాంటి పోరాటాల ఫలితంగానే బాలికల విద్య, దళితుల చదువు, వితంతువుల జీవితాల్లో వెలుగు మొదలైనాయి.




సావిత్రిబాయి పూలే కేవలం బోధనకే పరిమితం కాలేదు. అనాథల, వితంతువుల, రోగుల సేవలోనూ పాల్గొని ఉపాధ్యాయ వృత్తికి మానవీయ విలువలను జోడించారు. భారతీయ సమాజంలో అట్టడుగువర్గాల జీవితాల్లో ప్రత్యక్షంగా సంస్కరణలు తీసుకొచ్చిన తొలి వ్యక్తిగా ఆమెను పరిశీలిస్తే, సావిత్రిబాయి పూలే నిజమైన మొదటి సంఘసంస్కర్త. సమాజం కోసం జీవించి, సమాజం కోసం మరణించిన వ్యక్తి మాత్రమే అసలైన సంఘసంస్కర్త అవుతారు. ఆ ప్రమాణానికి పూర్తిగా సరిపోయిన తొలి వ్యక్తి ఆమె.

సావిత్రిబాయి ఉద్యమం సమగ్ర మానవ విముక్తిని లక్ష్యంగా పెట్టుకుంది. మహిళ, శూద్రుడు, అతిశూద్రుడు అనే భేదాలను ఒక్కరీతిగా ప్రశ్నించిన సంస్కర్త ఆమె. సమకాలీన సంస్కర్తలు సమాజంలోని ఒక్కో అన్యాయాన్ని మాత్రమే ఎదుర్కొంటే, ఆమె మూల వ్యవస్థలనే ప్రశ్నించారు. అందుకే ఆమెను కేవలం ఒక మహిళా సంస్కర్తగా కాకుండా, భారతదేశంలోని అత్యంత విప్లవాత్మక సామాజిక సంస్కర్తగా గుర్తించాలి. నేటి మహిళా ఉపాధ్యాయులకు సావిత్రిబాయి నిజమైన ఆదర్శం. ఆమె ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాక, సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారు. తీవ్రమైన సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారు. ఆడపిల్లలకు చదువు అందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న దూరదృష్టితో బోధించారు. ప్లేగు వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న సమయంలో ఆయా రోగులకు సేవ చేస్తూ ప్రాణాలు కోల్పోవడం ఆమె త్యాగభావానికి పరాకాష్ఠ. నేటి మహిళా ఉపాధ్యాయులంతా సావిత్రిబాయిని ఒక చారిత్రక వ్యక్తిగా మాత్రమే కాక, వృత్తి నిబద్ధతకు, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా చూడాలి. ఆమె జీవితాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే ఉపాధ్యాయ వృత్తికి నిజమైన గౌరవం వస్తుంది.

సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపడం గౌరవప్రదమైన విషయమే. అయితే ఆమె ఆశయాలు కేవలం సభలు, ప్రసంగాలు, పూలమాలలకే పరిమితమైతే అది ఆమె చేసిన త్యాగానికి న్యాయం చేసినట్లు కాదు. ఆమె జీవితమంతా ఆచరణాత్మక పోరాటమే; కాబట్టి ఆమెను స్మరించుకోవడం కూడా కార్యాచరణ రూపంలోనే ఉండాలి. మహిళా విద్య, దళిత– వెనుకబడిన వర్గాల చదువు, సమానత్వం, ఆత్మగౌరవం... ఇవే సావిత్రిబాయి ప్రధాన లక్ష్యాలు. నేటి కాలంలో కూడా బాలికల డ్రాప్ అవుట్లు, విద్యలో అసమానతలు, సామాజిక వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని నిర్మూలించేందుకు నాణ్యమైన ప్రభుత్వ పాఠశాలలు, బాలికలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, పేద విద్యార్థులకు నిరంతర సహాయం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యను కేవలం డిగ్రీలకే పరిమితం చేయకుండా, ప్రశ్నించే చైతన్యం, సామాజిక బాధ్యతను పెంపొందించేలా రూపొందించాలి. అప్పుడే సావిత్రిబాయి ఆలోచనలు సజీవంగా నిలుస్తాయి. అందువల్ల, ప్రభుత్వం సావిత్రిబాయి జయంతిని జరపడం కంటే, ప్రధానంగా ఆమె లక్ష్యాలను కొనసాగించే విధానాలు అమలు చేయడమే నిజమైన నివాళి అవుతుంది.

■ జుర్రు నారాయణయాదవ్

(నేడు సావిత్రిబాయి పూలే జయంతి)





● సిద్ధమైన ప్రధాన వేదిక

తెలుగు పండుగకు సిద్ధం

నేటి నుంచి ప్రపంచ మహాసభలు ● గుంటూరు వేదికగా మూడు రోజుల పండగ

- దేశ, విదేశాల నుంచి తరలివస్తోన్న అతిథులు
- ప్రారంభించనున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ
- రెండో రోజు మారిషస్ దేశాధినేత, చివరి రోజున సీఎం చంద్రబాబు రాక

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా ప్రియుల కేరింతలు, తెలుగు మహనీయుల తీపి గుర్తులను గుర్తుచేస్తూ, అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చనలతో, వర్తమానంలో తెలుగుదనాన్ని ప్రపంచ వ్యాప్తం చేస్తున్న భాషాభిమానుల మధుర భాషణలతో, సన్మానాలు, సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలతో మూడు రోజులు గుంటూరు పులకించనున్నది. రెండేళ్లకు ఒక సారి జరిగే తెలుగు భాషకు సంబంధించిన అతి పెద్ద పండుగ అయిన ప్రపంచ తెలుగు మహాసభలకు ఈసారి గుంటూరు ఆతిథ్యమిస్తుంది. రాజధాని అమరావతి పరిధిలోని గుంటూరు నగర శివార్లలో ఏటుకూరు బైపాసుకు సమీపంలోని శ్రీసత్యసాయి స్పిరిట్యూవల్ సిటీ ప్రాంగణంలో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు శనివారం ఉదయం నుంచి ప్రారంభంకానున్నాయి. మూడు రోజులు



జరిగే ఈ అతి పెద్ద తెలుగు పండగకు దేశ, విదేశాల నుంచి అతిథులు తరలిరానున్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు, మూడు గిన్నీస్ రికార్డుల గ్రహీత డాక్టర్ కేసిరాజు(గజల్) శ్రీనివాస్ తెలుగు మహాసభలకు అధ్యక్షత వహించనున్నారు. సభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మరో ఐదు ఉప వేదికలపై తెలుగుదనం ఉట్టిపడే కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో రామోజీరావు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. తెలుగు భాష ప్రాచీన తత్వాన్ని వివరించేలా పురాతన తెలుగు సాహిత్యం, నాణేలు, సాంప్రదాయ వంటకాలు, వినోదం వంటి అనేక అంశాలతో కార్యక్రమాలను రూపొందించారు. సుప్రీంకోర్టు (మిగతా 8వ పేజీలో)

నేడు పూర్ణకుంభ పురస్కారాలు

మహాసభలో భాగంగా శనివారం సాయంత్రం ఆంధ్ర శ్రీపూర్ణకుంభ పురస్కారాలను అందజేయనున్నారు. ఈ సభకు ముఖ్య అతిధిగా ఒడిస్సా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు హాజరు కానున్నారు. సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు పాల్గొననున్నారు.



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తోన్న పెమ్మసాని

2027 జూలై 27కి శంకర్‌విలాస్ బ్రిడ్జి పూర్తి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్మాణంలో ఉన్న శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు నిర్ణీత కాలవ్యవధిలోనే పూర్తవుతాయని, 2027 జూలై 27వ తేదీకి ప్రారంభిస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. శుక్రవారం బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే జీజీహెచ్ వైపు 9 పిల్లర్ల నిర్మాణం పూర్తి అయినట్లు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి మరో రెండు మూడు రోజుల్లో తుది అనుమతి వస్తుందని, ఆ వెంటనే పాత బ్రిడ్జి మధ్యభాగం తొలగింపు పనులు ప్రారంభిస్తామన్నారు. 70 శాతం భవన యజమానులకు నగరపాలక సంస్థ టీడీఆర్ బాండ్ల ను అందించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పిల్లర్ల వద్ద ఉన్న కొద్ది షాపుల యజమానులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రైల్వే అనుమతులు లేకుండా పనులు ప్రారంభించారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అండర్‌పాస్ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని యూ-ఆకారం పిల్లర్లతో ప్రత్యేక డిజైన్ రూపొందించామని తెలిపారు. భవిష్యత్తులో అండర్‌పాస్‌కు అవకాశం ఉండేలా 60 అడుగుల గ్యాప్ ఉంచామన్నారు. ప్రజలు ఛీత్కరించుకుంటున్నా బ్రిడ్జి పనుల విషయం లో ఎంతోకొంత లబ్ధి పొందాలని వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే గల్లా మాధవి విమర్శించారు. ఆర్వోబీ నిర్మాణం గురించి తమ కు చెప్పలేదంటూ కొందరు డమ్మీలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ మండిపడ్డారు. ఈ పరిశీలనలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఈఈ ఎస్ సుందర్ రామిరెడ్డి, సిటీ ప్లానర్ రాంబాబు, ఆర్ అండ్‌బీ ఈఈ విశ్వనాథ రెడ్డి, బీజేపీ నేత చెరుకూరి తిరుపతిరావు, జనసేన నాయకుడు గాదె వెంకటే శ్వరరావు, పలువురు కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



స్టీల్ బ్రిడ్జి వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

అందుబాటులోకి సీడ్ యాక్సిస్ రోడ్డు

- నెలాఖరుకు స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి కావాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి నారాయణ

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రహదారి వ్యవస్థలో అత్యంత ప్రధానమైన సీడ్ యాక్సిస్ రోడ్డు మరో 1.5 కిలోమీటర్ల మేర అందుబాటులోకి వచ్చిందని మంత్రి నారాయణ తెలిపారు. వెంకటపాలెం, ఉండవల్లిలో జరుగుతున్న సీడ్ యాక్సిస్ రోడ్డు రెండో దశ పనులు, గుంటూరు ఛానల్‌పై నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను శుక్రవారం మంత్రి పరిశీలించి పురోగతి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరుకి స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. కరకట్టపై వెళ్లే అవసరం లేకుండా బ్రిడ్జిని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉండవల్లిలో కరకట్ట నుంచి అప్రోచ్ రోడ్డు ద్వారా సీడ్ యాక్సిస్ రోడ్డులోకి వెళ్లవచ్చని తెలిపారు.

సంక్రాంతికి 100 బస్సులు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రానున్న సంక్రాంతి పండుగకు ఆర్టీసీ సిద్ధమైంది. షెడ్యూల్ బస్సులతో పాటు అదనపు సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. సంక్రాంతికి 100కి పైగా సర్వీసులను అందుబాటులో ఉంచనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. పండుగకు ముందుగా ఈ నెల 9 నుంచి 13 వరకు జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పండుగ అనంతరం తిరుగు ప్రయాణికుల కోసం గుంటూరు-1, 2, తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోల నుంచి అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్ వంటి దూర ప్రాంతాలకు 70 నుంచి 80 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సంక్రాంతి రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.



పూర్తికాని కళాశాల భవనం

కొసరు లేక.. అసలుకే ఎసరు!

అసంపూర్తిగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవనాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మండలం కాకాని వద్ద కాకినాడ జేఎన్‌టీయూ నిర్వహణలో నెలకొల్పిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. కొసరు ఇవ్వలేక.. అసలుకే ఎసరు పెట్టినట్లుంది వర్సిటీ పెద్దల తీరు. వీరి నిర్లక్ష్యానికి ఏళ్ల తరబడి విద్యార్థు లకు కష్టాలు వెంటాడుతున్నాయి. నాణ్యమైన విద్య, వసతి కల్పించడంలో వర్సిటీ ఘోరంగా విఫలమైంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కళాశాల దుస్థితిని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం. వసతి లేక ముఖ్యంగా బాలికలు పడుతున్న కష్టాలు చెప్పనలవి కావు. నిధులు లేక భవనాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోవడంతో వసతి ప్రశ్నార్థకంగా (మిగతా 8వ పేజీలో)

- 2023లో రూ.31 కోట్లు మంజూరు
- రెండేళ్లుగా టెండర్లు నిర్వహించని వైనం
- వసతి భవనాలను పరిశీలించిన ప్రత్యేక బృందం
- నిర్మాణం పూర్తికి రూ.10 కోట్లు అంచనా..
- చోద్యం చూస్తున్న పాలకులు..

కొసరు ఇస్తే.. అసలు పూర్తి

నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో 750 పడకల సామర్థ్యంతో బాలుర వసతి గృహం నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తి చేసేందుకు రూ.5 కోట్లు నిధులు అవసరం ఉందని వర్సిటీ నుంచి వచ్చిన టీం నిర్ధారించింది. అలాగే 750 పడకల సామర్థ్యంతో చేపట్టిన బాలికల వసతి గృహం ఒకదానికి రూ.2 కోట్లు, రెండవ వసతి గృహానికి రూ.3 కోట్లు నిధులు అవసరం ఉందని గుర్తించారు. బాలికల వసతి గృహలకు ప్రహరీ నిర్మించేందుకు రూ. 1.10 కోట్లు నిధులు కేటాయించాల్సి ఉంది. వర్సిటీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం వసతి గృహాలకు అవసరమై నిధుల అంచనాలతో నివేదికను వర్సిటీ వీసీకి సమర్పించినుట్లు చెబుతున్నారు. వెనువెంటనే నిధులు మంజూరు చేసి టెండర్లు నిర్వహిస్తే కనీసం వచ్చే విద్యా సంవత్సరానికైనా.. వసతి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని విద్యార్థులు భావిస్తున్నారు.



వసతి భవనాలను పరిశీలిస్తున్న వర్సిటీ టీం

128 దేశాలకు పొగాకు

ఎగుమతి

- రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా భారత్
- బోర్డు వ్యవస్థాపక దినోత్సవంలో చైర్మన్ యశ్వంత్‌కుమార్

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ పొగాకు 128 దేశాలకు ఎగుమతి అవుతోందని, దీని విలువ రూ.16,800 కోట్లుగా ఉందని టుబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ తెలిపారు. స్థానిక ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో శుక్రవారం పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవం, స్వర్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్జీనియా పొగాకు విశిష్టతని అంతర్జాతీయ వేదికలపై ప్రమోట్ చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడ ఎగ్జిబిషన్స్ జరిగినా అక్కడ బోర్డు తరపున స్టాల్‌ని ఏర్పాటు చేసి వివిధ దేశాలకు చెందిన ట్రేడర్స్‌ను ఆకర్షిస్తున్నామన్నారు. బోర్డు కేవలం నియంత్రణ సంస్థగానే కాకుండా రైతుల సంక్షేమానికి, అంతర్జాతీయ మార్కెట్లో



పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

భారతీయ పొగాకును ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తోన్నదని చెప్పారు. గుంటూరులో 1976 జనవరి 1న ఓ చిన్న అద్దె భవనంలో ప్రారంభమై నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన జాతీయ సంస్థగా టుబాకో బోర్డు ఎదిగిందన్నారు. సీటీఆర్ఐ కృషి వల్ల హెక్టార్‌కు 800 కిలోల నుంచి 3000 కిలోలకు ఉత్పత్తి పెరిగిందన్నారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద పొగాకు ఉత్పత్తిదారుగా, నాల్గో అతిపెద్ద ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిదారుగా భారతదేశం నిలిచిందన్నారు. రాబోయే రబీ సీజన్‌కు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో పొగాకును చేర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. బోర్డు ఈడీ విశ్వశ్రీ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో 325.6 మిలియన్ కేజీల ఎఫ్‌సీవీ పొగాకు అమ్మి రైతులకు రూ.8174.6 కోట్ల అందించామన్నారు. రైతుల పిల్లలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, విద్యారుణాల చెల్లింపు కాలాన్ని మూడు విడతల నుంచి ఐదు విడతలకు పెంచారన్నారు. అనంతరం బ్యారన్ రెమ్యూనరేషన్ యాప్, టుబాకో బోర్డు వెబ్‌సైట్, 2026 డైరీని ఆవిష్కరించారు. ఉత్తమ రైతులను, వ్యాపారులను సన్మానించారు. కార్యక్రమంలో ఐసీఎఆర్ - ఎన్ఐఆర్సీఏ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్, బోర్డు డైరెక్టర్లు శ్రీనివాస్, వేణుగోపాల్, ఇండియన్ అసోసియేషన్ సెక్రటరి వై అంకమ్మ చౌదరి, టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, సభ్యులు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రైతులు, వ్యాపారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో భూ సర్వే

దేశంలో ఏపీ ప్రథమం.. రూ.490 కోట్ల ప్రోత్సాహం ● పాస్ పుస్తకాల పంపిణీలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భూ సర్వే-రీసర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించి, డ్రోన్లు, రోవర్స్ ద్వారా అత్యంత ఖచ్చితంగా భూ హద్దులు నిర్ణయిస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రీ సర్వే ప్రాజెక్టు కింద జరిగిన పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో శుక్ర వారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని, ఇప్పటివరకు రూ.490 కోట్ల వరకు ప్రోత్సాహం పొందిందని చెప్పారు. గుంటూరు, మంగళగిరి నగరాలతో పాటు పలు పట్టణాల్లో పైలట్ ప్రోగ్రామ్‌గా భూ సర్వే జరు గుతుందన్నారు. భూ రికార్డులకు సంబంధించిన వివాదాలను శాశ్వతం గా పరిష్కరించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో 35,690 నూతనంగా పట్టాదారు పుస్తకాలను రైతులకు పంపిణీ చేయను న్నట్లు చెప్పారు. సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆర్ కూర్మ నాథ్ మాట్లాడుతూ గతంలో చేపట్టిన రీ సర్వేలో తప్పిదాలకు సంబంధించి 7.50 లక్షల అర్జీలు రైతుల నుంచి వచ్చాయన్నారు. వాటిని సరి చేస్తూ జాయింట్ ఎల్పీఎం, నెంబర్లలో తప్పులు లేకుండా రాజముద్రతో నిజమైన హక్కుదారుకు వారి పేరుతో పట్టాదారు పాసుపుస్తకాలను ఇస్తున్నామన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి గత ప్రభుత్వం రైతులను భయాందోళనలకు గురిచేసిందన్నారు. 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు, జేసీ ఆశుతోష్ శ్రీవాస్తవ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, హజ్ కమిటీ చైర్మన్ హసన్‌బాష, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర రావు, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




రైతులకు పాస్‌పుస్తకాలను అందజేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు, మల్లె ఈశ్వరరావు

జోన్-8లో పనులకు టెండరు ఖరారు

రెండు పనులకు బిడ్లను ఆమోదించిన సీఆర్డీఏ

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జోన్-8కు సంబంధించి రెండు కీలకమైన పనులకు 2026 సంవత్సరం ఆరంభంలోనే సీఆర్డీఏ టెండర్లు ఖరారు చేసింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులతో చేపట్టనున్న పనులకు టెండర్లను ఆహ్వానించి డిసెంబరు 9వ వరకు బిడ్లను స్వీకరించింది. వాటిని జనవరి 1న ఖరారు చేసింది. మౌలిక సదుపాయల కల్పనకు రూ.1305.39 అంచనాతో ఏడీసీఎల్ టెండర్లను ఆహ్వానించింది. తాజాగా వచ్చిన ఎల్ 1 బిడ్లలో 4.03 శాతం అదనపు ఈసీవీతో రూ.1,358 కోట్లతో బిడ్ ఆమోదం పొందింది. కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి గ్రామాల్లో రహదారుల నిర్మాణంతో పాటు డ్రెయినేజీలు, నీటి సరఫరా, సీవరేజీ, విద్యుత్, కమ్యూనికేషన్ లైన్ల కోసం కావాల్సిన యుటిలిటీ డక్టుల నిర్మాణం, పునర్వినియోగ నీటిలైను, ఎస్‌టీపీ, ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నారు. దీంతోపాటు ఆ గ్రామాల్లో ఉన్న ల్యాండ్ పూలింగ్ స్కీము లేఅవుట్లను అనుసంధానించే మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. కొండవీటివాగు వరద నివారణకు సంబంధించి ఉండవల్లిలో కొండవీటివాగుపై నిర్మించ తలపెట్టిన రెండో పంపింగ్ హౌస్ నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన టెండర్‌ను కూడా సీఆర్డీఏ ఖరారు చేసింది. రూ.423.64 కోట్లతో 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించే పంపింగ్ హౌస్ నిర్మాణం, నిర్వహణకు రూ.423.64 కోట్ల అంచనాతో టెండర్లకు పిలవగా 4.75 శాతం అదనపు ఈసీవీ విలువతో రూ.443.76 కోట్లకు ఎల్ 1 బిడ్ ఖరారైంది.



వృత్తంలో జోన్- 8



మినీ భారత సమ్మేళనానికి విస్తృత ఏర్పాట్లు

- 300 స్టాల్స్ ఏర్పాటు

8

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌వో, కమిషనర్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 3 జనవరి 2026

భోజన కుతూహలం

వంకాయ వాస్తవాలు

వంకాయ తెలుగు వారిది మాత్రమేనని చాలా మంది భావిస్తూ ఉంటారు. కానీ మన దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ వంకాయకు విశేషమైన ప్రాధాన్యం ఉంది. వంకాయలలో ఉన్న విశిష్టతను ఆయుర్వేద గ్రంధాలన్నీ గుర్తించాయి. వంకాయలో ఉండే సొలనైన్ అనే రసాయనం వల్ల కొన్ని సమస్యలు ఏర్పడతాయని ఆధునిక వైద్యులు భావిస్తూ ఉంటారు. కానీ వంకాయవల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద గ్రంథాలు పేర్కొంటున్నాయి. వంకాయను ఒక సంపూర్ణమైన ఆహారంగా ఈ గ్రంథాల్లో పేర్కొన్నారు. వీటి ప్రకారం...

- వంకాయను క్రమం తప్పకుండా తింటే నడుము నొప్పి, కీళ్ల నొప్పి వంటివి తగ్గుతాయి.
- పైల్స్ వంటి సమస్యలు వచ్చినప్పుడు వాటి నివారణలో వంకాయ తోడ్పడుతుంది.
- వంకాయలు నోటికి రుచిని కలిగిస్తాయి. అన్నహితవుకు కారణమవుతాయి.
- వంకాయలు వేడిని తగ్గిస్తాయి.
- తిమ్మిర్లు, చర్మం మొద్దుబారటం మొదలైన సమస్యలు ఉన్నవారు వీటిని తక్కువగా తినాలి.
- వంకాయలు మలబద్ధకానికి కారణమవుతాయి. అందువల్ల వంకాయను పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే కూరగాయలతో కలిపి వండుకోవాలి. ముఖ్యంగా అల్లంతో కలిపి వంకాయను వండుకుంటే మలబద్ధకం తగ్గుతుంది.
- వంకాయను వండిన తర్వాత దానిలో ఉండే సొలనైన్ శాతం తగ్గుతుంది. నువ్వుల నూనెను వాడటం వల్ల ఈ శాతం మరింతగా తగ్గుతుంది.
- వంకాయను అతిగా తింటే మలబద్ధకం, వాంతులు, జీర్ణ సమస్యలు ఏర్పడే అవకాశముంది.



• గంగరాజు అరుణాదేవి



వంటిల్లు

బ్రోకలీతో భలే రుచులు

పోషకాల గనిగా పరిగణించే బ్రోకలీతో రకరకాల కూరలు, సలాడ్లు చేసుకుని తింటూ ఉంటాం. దీనితో పిల్లలు అమితంగా ఇష్టపడే స్నాక్స్ కూడా ప్రయత్నించవచ్చు. బ్రోకలీని విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు.

బ్రోకలీ టిక్కీ

కావాల్సిన పదార్థాలు

బ్రోకలీ- ఒకటి, కేరట్ తురుం- అర కప్పు, పనీర్ తురుం- అర కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, కొత్తిమీర తరుగు- కొద్దిగా, కారం- అర చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, ధనియాల పొడి- అర చెంచా, గరం మసాలా- అర చెంచా, ఉప్పు- చెంచా, వెల్లుల్లి తరుగు- ఒక చెంచా, అల్లం తరుగు- చెంచా, శనగ పిండి- రెండు చెంచాలు, బొంబాయి రవ్వ- ఒక చెంచా, నూనె- తగినంత

తయారీ విధానం

బ్రోకలీని సన్నగా తరిగి వేడి నీళ్లలో వేసి తీయాలి. తరువాత బ్లెండర్‌లో వేసి కచ్చాపచ్చాగా బ్లెండ్ చేయాలి. వెడల్పాటి గిన్నెలో బ్రోకలీ తరుగు, కేరట్ తురుం, పనీర్ తురుం, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు, కారం, జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాల పొడి, ఉప్పు, వెల్లుల్లి తరుగు, అల్లం తరుగు, శనగపిండి, బొంబాయి రవ్వ, ఒక చెంచా వేడి నూనె వేసి ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్ది కొద్దిగా తీసుకుంటూ అరచేతిలో చిన్న బిళ్లల్లా చేయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. దాని మీద బ్రోకలీ మిశ్రమంతో చేసిన బిళ్లలు పరచాలి. వీటిని చిన్న మంట మీద రెండు వైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఇలా తయారుచేసిన టిక్కీలను టమాటా సాస్ లేదా చిల్లీ సాస్‌తో వేడి వేడిగా సర్వ్ చేయాలి.



ఛీజ్ బాల్స్

కావాల్సిన పదార్థాలు

బ్రోకలీ- ఒకటి, ఆలుగడ్డలు- నాలుగు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, వెల్లుల్లి తరుగు- ఒక చెంచా, పచ్చి మిర్చి- రెండు, రెడ్ చిల్లీ ఫ్లేక్స్- ఒక చెంచా, ఉప్పు- ఒక చెంచా, మిరియాల పొడి- ఒక చెంచా, గరం మసాల పొడి- ఒక చెంచా, కార్న్‌ఫ్లోర్- రెండు చెంచాలు, బ్రెడ్ పౌడర్- రెండు కప్పులు, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నూనె- తగినంత, ఛీజ్ క్యూబ్స్- తగినన్ని

తయారీ విధానం

బ్రోకలీని వేడి నీళ్లతో కడిగి సన్నగా తరగాలి. ఆలుగడ్డలను ఉడికించి తొక్క తీసి చిన్న ముక్కలుగా కోయాలి. వీటిని గిన్నెలోకి తీసుకుని మెత్తగా మెదపాలి. వెడల్పాటి గిన్నెలో బ్రోకలీ తరుగు, ఉడికించిన ఆలుగడ్డల మిశ్రమం, ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి తరుగు, పచ్చి మిర్చి ముక్కలు, రెడ్ చిల్లీ ఫ్లేక్స్, ఉప్పు, మిరియాల పొడి, గరం మసాల పొడి, కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలపాలి. తరువాత రెండు చెంచాల బ్రెడ్ పౌడర్, కొత్తిమీర తరుగు వేసి చేత్తో మెత్తగా కలపాలి. చేతికి కొద్దిగా నూనె రాసుకుని బ్రోకలీ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ అరచేతిలో చిన్న కప్‌లా చేయాలి. అందులో ఒక ఛీజ్ క్యూబ్ పెట్టి అన్ని వైపుల నుంచి మూసివేసి గుండ్రని బాల్‌లా చేయాలి. ఇలా అన్ని బాల్స్ రెడీచేసి బ్రెడ్ పౌడర్‌లో ఒకసారి దొర్లించి పళ్లెంలో ఉంచాలి. స్టవ్ మీద కడాయి పెట్టి సగానికి పైగా నూనె పోసి వేడిచేయాలి. తరువాత అందులో బ్రోకలీ మిశ్రమంతో చేసిన బాల్స్ వేసి అన్నివైపులా బంగారు రంగు వచ్చే వరకూ దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఈ బ్రోకలీ ఛీజ్ బాల్స్‌ను టమాటా సాస్ లేదా మయొనైజ్‌తో వేడిగా సర్వ్ చేయాలి.



బ్రోకలీ ఆమ్లెట్

కావాల్సిన పదార్థాలు

బ్రోకలీ- ఒకటి, కోడిగుడ్లు- మూడు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, టమాటా తరుగు- పావు కప్పు, క్యాప్సీకమ్ తరుగు- పావు కప్పు, పచ్చి మిర్చి- రెండు, మిరియాల పొడి- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- తగినంత, కొత్తిమీర- కొద్దిగా

తయారీ విధానం

బ్రోకలీని చిన్న గుత్తులుగా తరిగి వేడినీళ్లలో వేసి పది నిమిషాలపాటు ఉంచాలి. తరువాత నీళ్లలో నుంచి తీసి సన్నగా తరగాలి. ఒక గిన్నెలో కోడిగుడ్ల సొనలు వేసి బాగా బీట్ చేయాలి. వెడల్పాటి గిన్నెలో బ్రోకలీ తరుగు, కోడిగుడ్ల సొనలు, ఉల్లిపాయ ముక్కలు, టమాటా తరుగు, క్యాప్సీకమ్ తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, మిరియాల పొడి, కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. స్టవ్ మీద పాన్ పెట్టి కొద్దిగా నూనె రాసి వేడి చేయాలి. అందులో బ్రోకలీ మిశ్రమాన్ని పోసి సమంగా పరిచి పైన కొత్తిమీర చల్లి మూతపెట్టి మగ్గించాలి. రెండు నిమిషాల తరువాత మూత తీసి ఆమ్లెట్‌ను రెండో వైపునకు తిప్పి ఎర్రగా వేగనివ్వాలి. ఆపైన ఈ బ్రోకలీ ఆమ్లెట్‌ను పళ్లెంలోకి తీసి టమాటా సాస్‌తో సర్వ్ చేయాలి.



మృదువైన చేతులకు...



చలికాలంలో చర్మం పొడిబారి అరచేతులు గరుకుగా మారుతూ ఉంటాయి. చేతులను మృదువుగా మార్చే ఇంటి చిట్కాలివే...

- చేతులు శుభ్రం చేసుకోవడానికి వేడి వేడి నీళ్ల ఉపయోగించకూడదు. చల్లటి నీరు లేదా గోరు వెచ్చటి నీటితో మాత్రమే చేతులను కడగాలి.
- రాత్రి పడుకునేముందు అరచేతులకు మాయిశ్చరైజర్ రాసుకుంటే ఉదయానికల్లా ఫలితం కనిపిస్తుంది. బాదం నూనె లేదా కొబ్బరి నూనె రాసినా చేతులు మృదువుగా మెరుస్తాయి. బయటకు వెళ్లేప్పుడు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి.
- గిన్నెలు తోమేటప్పుడు, బట్టలు ఉతికేటప్పుడు చేతులకు గ్లౌజ్ వేసుకొంటే చలికి చేతులు పగలకుండా ఉంటాయి.
- చలికాలంలో దాహం అనిపించకపోయినా మంచినీళ్లు తాగుతూ ఉండాలి. అప్పుడే చర్మానికి తేమ అంది పొడిబారకుండా ఉంటుంది. చేతులు కూడా నున్నగా కనిపిస్తాయి.

ముత్యాల ముగ్గు



కె.వ్యూహశ్రీ
బ్రాహ్మణపల్లి,
గుంటూరు జిల్లా

19 చుక్కలు, 19 వరుసలు



మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


డాక్టర్ చంద్రశేఖర్‌కు డైరీని అందజేస్తున్న ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ సభ్యులు

వస్త్ర పరిశ్రమను పరిరక్షించేందుకు కేంద్ర స్థాయిలో మద్దతు

● కేంద్ర మంత్రిని కోరిన ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వస్త్ర పరిశ్రమను పరిరక్షించేందుకు కేంద్ర స్థాయిలో మద్దతు అందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. శుక్రవారం, బృందావన్ గార్డెన్స్‌లోని ఎంపీ కార్యాలయం లో ఆయనను సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన డైరీని పెమ్మసానికి అందజేసి, నూతన ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ సామినేని కోటేశ్వ రరావు, గౌరవ అధ్యక్షుడు పి.కోటిరావు, వైస్ చైర్మన్లు ఎంవీ సత్యనారాయణ, ఉమా మహేశ్వరరావు, సలహాదారు ఎల్ రాఘరామిరెడ్డి, కార్యదర్శి ఎం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లో పరిశుభ్రత పాటించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు


అన్న క్యాంటీన్లో టిఫిన్ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో శుభ్రత పాటించాలని, ఆహారం సరఫరా అనంతరం శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.


ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరింపజేస్తున్న శ్రీనివాసులు, అసోసియేషన్ నాయకులు

బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ కార్యదర్శి విజయానంద్‌కు వినతి

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఆయనను కలిసి బీసీ ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏప్రిల్ 11న జ్యోతిరావు పూలే జయంతి రోజును ప్రభుత్వం సెలవుగా ప్రకటించాలన్నారు. బీసీ ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, ఉద్యో గులు పాల్గొన్నారు.

ఏబీ బర్దన్ పోరాటాలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కుల పీడన, ఆర్థిక దోపిడీ లేని, నూతన సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు ఏబీ బర్దన్ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ కొనియాడారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శుక్రవారం సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాలక వర్గాలు అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై నిరంతరం రాజీలేని పోరాటాలు చేసిన ఘనత బర్దన్‌కే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, అకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతురావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా సిద్ధార్థనగర్ 1, 2 లైన్‌లు, సిద్ధార్థ నగర్ ఆర్చి రోడ్డు, ఆంధ్రాబ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంకు ఎదురు ప్రాంతాలు, డీ మార్ట్ ఏరియాల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి త్యాగరాజ సంగీత మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, త్యాగరాజ వేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయని సంఘం కార్య దర్శి వల్లూరి కృష్ణ కిషోర్ తెలిపారు. స్థానిక లక్ష్మీపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు గిరిజాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై తిరుమల తిరుపతి దేవస్థానాలు ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం సామూహిక కుంకుమార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయ పాలకమండలి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సింగిల్ నంబర్ ఆట ఆడుతున్న నలుగురి అరెస్టు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు రోడ్డులో సింగిల్ నంబర్ ఆట ఆడుతున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మూడు సెల్ ఫోన్లు, 19 లాటరీ పుస్తకాలు, రూ.ఐదు వేల 110 నగదును సీజ్ చేసి, తదుపరి విచారణ నిమిత్తం లాలాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనకు టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అడవితక్కెళ్ళపాడు టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సకల్పం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున సౌత్ సబ్ డివిజన్, నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలోని అడవి తక్కెళ్ళపాడు టిడ్కో గృహాల్లో సౌత్ డీఎస్పీ భానోదయ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. తనిఖీలో మొత్తం 450 వాహనాలను పరిశీలించి, వాటిలో సరైన పత్రాలు లేని 13 మోటార్ సైకిళ్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. 59 వాహనాలకు పత్రాలు సరిగ్గా లేనందున వారికి రూ.59వేల 975 చలానాలు విధించారు.

కొత్త పాస్ పుస్తకాల పంపిణీ సక్రమంగా జరగాలి

● చీఫ్ సెక్రటరీ విజయానంద్ ఆదేశాలు


సీఎస్ విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కి హాజరైన కలెక్టర్, జేసీ

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ సంబంధిత సమస్యలను వీలైనంత వరకూ తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 2 నుంచి 9 వరకూ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ విజయానంద్ ఆదేశించారు. ఆ పంపిణీ కార్యక్రమం సక్రమంగా జరిగేలా కలెక్టర్ పర్యవేక్షించాలన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు, ఆర్‌వోబీలు, రైల్వే కు సంబంధించి పెండింగ్ భూసేకరణ కేసులకు సంబంధించిన అంశాలు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్, డాక్యుమెంట్ అప్లోడ్ ఏజెంట్ అంశా లపై శుక్రవారం కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పాత పట్టాదారు పాస్ పుస్తకాల స్థానంలో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీని చేపట్టారని తెలిపారు. కలెక్టర్ పాసు పుస్తకాల పంపిణీని పరిశీలించాలని, స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో పంపిణీ జరిగేలా చూడా లని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానం

గుంటూరు మెడికల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ శివార్లలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో ఈ నెల 4వతేదీ ప్రతిభ గల 500 మంది విద్యార్థులకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు టీజేపీఎస్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇరవై ఏళ్లుగా ఉపకార వేతనం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు విద్యార్థులకు రూ.2.10 కోట్ల ఉపకార వేతనాలు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరవుతారని, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొంటారని ఆయన తెలిపారు.

పది విద్యార్థుల్ని నిరంతరం పర్యవేక్షించాలి

● డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా

గుంటూరు(విద్య), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులను సమర్థవంతంగా పరీక్షలకు సిద్ధం చేయాలని, వారిని నిత్యం ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా సూచించారు. పెదకాకాని సమీపంలోని వెనిగండ్ల, నంబూరు జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ప్రతి రోజు జరుగుతున్న 100 రోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రతి రోజు తరగతులకు హాజరయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని అన్నారు. స్లిప్ టెస్టులు నిర్వహించిన రోజునే మార్కులు వారికి తెలియజేసి వెంటనే ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి కీలకం

గుంటూరు(విద్య), జనవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పదో తరగతే కీలకమని బంగారుతల్లి ఫౌండేషన్ ప్రతినిధి ఆళ్ళ సాయికిరణ్ అన్నారు. కొత్తపేట లోని కాసు శాయమ్మ నగర పాలక ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదోతరగతి విద్యా ర్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు లక్ష్యసాధన కోసం నిత్యం శ్రమించాలని సూచించారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జిలానీ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చెరుకూరి తిరుపతిరావు, పాల్గొన్న బీజేపీ నాయకులు

రేపు వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి పురస్కరించుకుని గుంటూరు, లక్ష్మీపురం మదర్ థెరిస్సా సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని 4వ తేదీన ఆవిష్కరించనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు తెలిపారు. స్థానిక అరండల్‌పేట, యోగిభవన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జూపుడి రంగరాజు, దర్శనపు శ్రీనివాస్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, తాడువాయి రామకృష్ణ, బజరంగ్ రామకృష్ణ పాల్గొన్నారు.

అంజుమన్ ఆస్తులు ప్రైవేటుపరం చేస్తే సహించం

● ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అంజుమన్-ఏ-ఇస్లామియా సంస్థ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే సహించబోమని ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు నినదించారు. పొత్తూరువారితోట, లాలాపేట, ఆనందపేట, ఐపీడీ కాలనీలలోని మసీదుల వద్ద మైనార్టీ నాయకులు శుక్రవారం జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీ పార్కు పేరుతో ముస్లింల సంపదని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించొద్దన్నారు. 1915వ సంవత్సరంలో అంజుమన్‌కు దాతలు 81.23 ఎకరాల భూమిని చినకాకానిలో ఇచ్చారన్నారు. ప్రస్తుతం వాటి విలువ రూ. 2 వేల కోట్లకు పైగా ఉంటుందన్నారు. ఆ భూములను ముస్లింల అభ్యున్నతి కోసం వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ లియాఖత్ అలీ, పఠాన్ సైదా ఖాన్, ఆబిద్ అయూబ్ ఫర్జాన, సుభాని, నియమత్, బుల్లెట్ సలీం, జాఫర్ ఖాన్, జాబీర, నజీర్, నాగూరు, రహీముద్దీన్, యూసఫ్, బాజీ, ఖాదర్ వలీ, షఫీ, జహీర్, ఫారజ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నానని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజలు తాము ఎదుర్కొనే సమస్యలను స్వయంగా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. సమస్యలను ప్రాధాన్యక్రమంలో వేగంగా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ కార్యాల యంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తెలుసుకుని, ఆ తరువాత క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరిస్తున్నానని చెప్పారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖలకు అనుసంధానం చేసి, వారికి తక్షణ ఉపశమనం కలిగించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షిస్తున్నామని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాలు

● ట్రాఫిక్ ఈస్ట్ సీఐ అశోక్‌కుమార్

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా జరిగే రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాలేనని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ విశ్లేషించారు. ఎన్‌టీఆర్ బస్టాండ్ లోని తిక్కన సమావేశ మందిరంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, ప్రమాదాలు లేకుండా బస్సులను నడుపుదాం అనే నినాదంతో వాహనదారులు రహదారి సూత్రాలను పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని కోరారు. డీపీటీవో డి.సామ్రాజ్యం మాట్లాడుతూ ప్రమాదాల నివారణ కోసం పలు దఫాలుగా డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎమ్ఈ కె.సత్యనారాయణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు మల్లేశ్వరి, సౌజన్య, గుంటూరు 1, 2 డిపో మేనేజర్లు రామకృష్ణ, సీహెచ్ సునీత, బస్టాండ్ ఏటీఎం జి.సాంబశివ, పలువురు సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీడీవోలు

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను జిల్లాకు చెందిన పలువురు ఎంపీడీవోలు మర్యాద పూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు దీప్తి, సుబ్రహ్మణ్యం, ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, సమతావాణి, ప్రభాకర్, రాణి పాల్గొన్నారు.

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) సభ్యులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, మహిళా విభాగపు అధ్యక్షురాలు సుమిత్రా దేవి, మాధవి లత, మణిశ్రీ, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

మినీ భారత సమ్మేళనానికి విస్తృత ఏర్పాట్లు

● పరిశీలించిన గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ అన్సారియా



స్టాల్స్ కోసం ఏర్పాటు చేసిన గుడారాలు

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) వేదికను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శుక్రవారం సందర్శించారు. ఈ మినీ భారత సమ్మేళనంలో 300 స్టాల్స్ ఏర్పాట్లను జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు పట్టణంలో నర్సరావుపేట రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో ప్రదర్శన శాలల ఏర్పాటుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. మూడు వందల ప్రదర్శన శాలల్లో 150 స్టాల్స్ ఇతర రాష్ట్రాల నుంచి, రాష్ట్రం నుంచి 150 ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సారస్‌ను రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్వహిస్తోందన్నారు. గుంటూరు మిరపకు ప్రసిద్ధి చెందడంతో "మిరప కాయ" నే మస్కట్‌గా ఎంపిక చేశామని చెప్పారు.

ఏఎన్‌యూ బీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఈడీ ప్రథమ సెమిస్టర్(రెగ్యులర్, సప్లమెంటరీ) పరీక్షల షెడ్యూల్‌ను సీఈ శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. పరీక్షలు వచ్చే నెల 5 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు. పరీక్ష ఫీజు రూ.2,280 ఈ నెల 27న చెల్లించి, రూ.100 అపరాధ రుసుంతో 28 లోపు చెల్లించాలన్నారు.

● గతేడాది జూలైలో నిర్వహించిన ఎంఎస్‌సీ, ఎంఎస్సీ గణితం, భౌతిక శాస్త్రం ద్వితీయ సెమిస్టర్, గత జనవరిలో నిర్వహించిన ఎమ్మెస్సీ ఆక్వాకల్చర్ ప్రథమ సెమిస్టర్ పునః మూల్యాంకనం ఫలితాలను, గత ఆగస్టులో నిర్వహించిన ఎంటెక్ 2/2 నాలుగో సెమిస్టర్ (రెగ్యులర్)పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఎంటెక్ పరీక్షలకు హాజరైన 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

పొగాకు రైతుల రాస్తారోకో

● పొగాకు ఉత్పత్తులపై పెంచిన పన్నులు తగ్గించాలని ఆందోళన



చిలకలూరిపేటలో ఆందోళన చేస్తున్న రైతులు

చిలకలూరిపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులపై కేంద్రం పెంచిన పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు రాస్తారోకో చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్పత్తులపై 40 శాతం వరకు పన్ను పెంచడం పట్ల వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మురళీబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ఏపీ, కర్ణాటక రాష్ట్రాలలోని పొగాకు రైతులపై పెను ప్రభావం చూపుతుందన్నారు. భారీగా పన్ను పెంపు వల్ల దేశీయ తయారీదారులు తమ ఉత్పత్తుల ధరలను పెంచాల్సి వస్తుందని, దీంతో అమ్మకాలు తగ్గి రైతుల నుంచి పొగాకు కొనుగోళ్లు తగ్గే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో పొగాకు నిల్వలు పెరిగి మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిగరెట్ల తయారీకి ఉపయోగించే పొగాకుపై కేజీకి విధించే పన్నులు బీడీలతో పోలిస్తే 50 రెట్లు అధికంగా ఉన్నాయన్నారు. గతేడాది సెప్టెంబర్ 4న జీఎస్టీ 2.0 ప్రకటించిన సమయంలో పొగాకు ఉత్పత్తుల విషయంలో మొత్తం పన్ను భారం మారదని ప్రభుత్వం హామీ ఇచ్చి.. దానిని నిలబెట్టుకోలేదన్నారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా పొగాకు ఉత్పత్తుల అక్రమ వ్యాపారం పెరిగే పెను ప్రమాదం పొంచి ఉన్నదని పేర్కొన్నారు. దీనితో మొత్తం పొగాకు పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ నిరసనలో పొగాకు రైతు నాయకులు భాస్కర చౌదరి, వరప్రసాద్, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుక్కపిల్ల కోసం వెళ్లి..నదిలో బాలుడి గల్లంతు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిలో దుస్తులు ఉతుక్కునేందుకు కుక్కపిల్లను తీసుకుని వెళ్లిన బాలుడు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నందూరి దేవ(14) కుక్క పిల్లను వెంటబెట్టుకుని కృష్ణానది వద్దకు వెళ్లాడు. కుక్కపిల్ల నీటిలో దిగడంతో దానిని తీసుకువచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినప్పటికి ఆచూకి లభించలేదు.

మద్యం తాగుతూ వైన్‌షాపులోనే మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

తాడికొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొన్నెకల్లు గ్రామంలో వైన్‌షాపులో మద్యం తాగుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన దారా జగదీష్(36) సెంట్రింగ్ పని చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మధ్యాహ్నం పొన్నెకల్లులోని ఏకే వైన్‌షాపులో మద్యం తాగుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వైన్స్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. తాడికొండ సీఐ కే.వాసు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భారీగా గ్రామస్తులు వైన్స్ వద్దకు చేరుకోవటంతో నిర్వాహకులు షాపును మూసివేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైన్‌షాపు వద్ద పర్మిట్ రూమ్‌ను ఏర్పాటు చేయటంతో నిరంతరం మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

వరుసబెట్టి.. స్కూటీల డిక్కీలు పగలగొట్టి..

● 20 స్కూటీల్లో రూ.5500 నగదు, పవర్ బ్యాంక్‌లు చోరీ



చోరీ జరిగిన స్కూటీలు

తాడేపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పోయింది చిన్న మొత్తంలో నగదు, నిత్యం వాడే ఎలక్ట్రానిక్ పరికరాలు. కానీ, దొంగతనం చేసిన తీరుమాత్రం సంచలనం రేపింది. రాజధాని ముఖ ద్వారంగా ఉన్న ఉండవల్లి గ్రామంలో ఈ ఘటన శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. గ్రామం లోని ప్రధాన రోడ్డు నుంచి హరిజన వాడకు వెళ్లే చిన్నరోడ్ల వరకు ప్రతి ఇంటి ముందు పార్కింగ్ చేసిఉన్న స్కూటీలను నిందితులు లక్ష్యంగా చేసుకున్నారు. ఆయా రోడ్లపై ఏ ఒక్క స్కూటీని వదలకుండా.. 20 స్కూటీ ల డిక్కీలను పగలగొట్టారు. సుమారు రూ.5,500 నగదుతోపాటు పవర్ బ్యాంక్‌లు, చార్జర్లు వంటివి దోచుకు వెళ్లారు. సీఎం నివాస ప్రాంతమైన ఉండవల్లిలో ఇలాంటి ఘటనలు జరగడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు గస్తీ లేకుండా పోవడం వల్లనే ఇలాంటివి జరుగుతున్నాయని, గతంలో ఆటోలు, ట్రాక్టర్లు, లారీలలోని బ్యాటరీలను ఇదే తరహాలో చోరీ చేసిన ఘటనలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. తాడేపల్లి సీఐ వీరేంద్ర, ఎస్ఐ ఖాజావలి సిబ్బందితో కలిసి స్కూటీ లను పరిశీలించారు. ప్రత్యేక బృందా లు ఏర్పాటు చేశామని, సీసీ టీవీ ఫుటేజీలు ఇతర సాంకేతిక ఆధారా లతో త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు. బాధితుడు పి నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏక్‌సాల్ సాగుదారుల సమస్యలు పరిష్కరించండి

● రెవెన్యూ మంత్రికి ఎమ్మెల్యే ఆనందబాబు వినతి




సభలో రైతుల సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జమీందారి, హెచ్‌వో ల్యాండ్స్, నదీ పరివాహక భూముల సాగుదారుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి, అధికారుల దృష్టికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తీసుకు వచ్చారు. శుక్రవారం మండలంలోని దోనేపూడి గ్రామంలో నిర్వహించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో లంక గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్, సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వివరించారు. 2014- 2019 టీడీపీ పాలనలో చిలుమూరు, ఈపూరు, జువ్వలపాలెం, తిప్పలకట్ట తదితర లంక గ్రామాల్లో జమీందారి, హెచ్‌వో ల్యాండ్స్, నదీ పరివాహక భూములు సాగు చేసుకుంటున్న భూములకు ఏక్‌సాల్‌కా పట్టాలు అందించడం జరిగిందన్నారు. 2019- 2024 మధ్య కాలంలో ఐదు సంవత్సరాల పట్టాలను రైతులకు అందించారని, సాధారణ పట్టాభూముల రైతులకు అందే ప్రభుత్వ ప్రయోజనాలు వీరికీ వర్తిస్తున్నాయన్నారు. కానీ, తాను మంజూరు చేయించిన ఏక్‌సాల్‌కా పట్టాలకు ప్రభుత్వ ప్రయోజనాలు వర్తించకపోవడంతో.. సాగుదారులు ప్రకృతి విపత్తులకు నష్టపోయిన సందర్భాల్లో ఆవేదనకు గురవుతున్నారన్నారు. వీటికి సంబంధించిన రెండు దస్త్రాలు సీసీఎల్‌ఏ కార్యాలయంలో ఉన్నాయని, వాటిని పరిష్కరించి ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన రెవెన్యూ మంత్రి, సీసీఎల్‌ఎ ముఖ్య కార్యదర్శి, కలెక్టర్ 15 రోజుల్లో జేసీ పరిశీలన అనంతరం.. నిర్ణయం తీసుకుని న్యాయం చేస్తామని అవసరమైతే రీసర్వే జరిపి శాశ్వత భూ పట్టాలు అందించే విధంగా కూడా అవకాశాలు పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

ఆధునిక జీవన గమనానికి దిక్సూచి అనగనగా ఓ నేను

● పుస్తకావిష్కరణలో కేంద్ర మంత్రి పెమ్మసాని ప్రశంస



పుస్తకావిష్కరణలో కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు, జీడీసీసీ చైర్మన్ మక్కెన, రచయిత రామకృష్ణ

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవన గమనానికి దిక్సూచి.. "అనగనగా ఓ నేను" పుస్తకం అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన పుస్తకావిష్కరణలో రచయిత నర్రా రామకృష్ణను అభినందించారు. నేటి యాంత్రిక జీవనంలో అస్తిత్వాన్ని కోల్పోతున్న మనిషికి మేలుకొలుపుగా రచయిత నర్రా రామకృష్ణ కలం నుంచి జాలువారిన తాత్విక గ్రంథం అనగనగా ఓ నేను అనే పుస్తకం అని పెమ్మసాని కొనియాడారు. ప్రతి మనిషి తన అంతరంగాన్ని దర్శించుకునేలా చేసే విధంగా ఈ రచన ఉందన్నారు. ఇది కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదని, అది ఒక సంపూర్ణ జీవిత ప్రయాణమని వారు అభివర్ణించారు. సమాజంలో మారుతున్న మానవ సంబంధాల వెనుక ఉన్న పరమార్థాన్ని తట్టిలేపుతూ, ఉన్నత స్థితి వైపు నడిపించే ఈ పుస్తకం ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండదగ్గ ఒక అపురూప నిధి అని పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ 38వ పుస్తక ఫెయిర్ లో ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సత్యవాణి రచయిత రామకృష్ణను ఆధునిక గీతాచార్యుడుగా కొనియాడారు. సంక్లిష్టమైన జీవిత సత్యాలను సామాన్యుడికి అర్థమయ్యే రీతిలో అనుభవం- అవగాహన - జ్ఞానం - జాగృతి అనే సూత్రం ద్వారా ఈ పుస్తకంలో అద్భుతంగా ఆవిష్కరించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జీడీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు సాయుధ దళం కీలకం

● గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్



ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖకు ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగం అత్యంత కీలకమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు పర్యవేక్షణలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పరేడ్ కమాండర్‌గా ఏఆర్ విభాగ పోలీసు సిబ్బంది పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్‌కు ఎస్పీ వకుల్ జిందాల్ హాజరై, పోలీస్ సిబ్బంది తరపున పరేడ్ కమాండర్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరేడ్‌కు హాజరైన పోలీస్ సిబ్బందికి భద్రతా తనిఖీలు, ఎస్కార్ట్ విధులు, కోర్టు డ్యూటీలపై ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ యూనిఫాం సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపును కలిగి ఉందని, యూనిఫాం సర్వీస్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, మర్యాదతో, బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం సమర్థంగా విధులు నిర్వహించడం వల్లే వీవీఐపీ, వీఐపీల భద్రతను, బందోబస్తును విజయవంతంగా నిర్వర్తించగలుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు సురేష్, శివరామకృష్ణ, శ్రీహరిరెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో గిరిజన గ్రామాలకు మంచి రోజులు

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరైన రోడ్లు, సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న మారుమూల గిరిజన ప్రాంతాలను.. రహదారులతో అనుసంధానించడానికి హై లెవెల్ బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మించి, మౌలిక వసతులను కూటమి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం గతేడాది రూ.154 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ఇందులో ఈ ఏడాది రూ.9 కోట్లను ఇటీవల రాష్ట్రానికి ఇచ్చిందన్నారు. వీటితో కూటమి ప్రభుత్వం పలు గిరిజన గ్రామాల్లో పనులు ప్రారంభించిందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	162, 171, 183
చికెన్ విత్ స్కిన్(కిలో)	314.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	324.00

మిర్చియార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	30,095
అమ్మకాలు	36,136
నిల్వ	5,235

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	12000	15800
273	---	----
341	11000	17600
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16500
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	11000	17800
ఆర్మూరు	10000	12800
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16800
నెంబరు. 5	11000	15300
273	----	----
341	11000	16500
4884	-----	-----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14800
బ్యాడిగి 355	10000	16700
దేవనూరు డీలక్స్	-----	-----
తాలుకాయలు	5000	7500

తెలుగు పండుగకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీలు

న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహం మహాసభలను ప్రారంభించను న్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, విశ్వయోగి విశ్వంజీమహరాజ్, ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తొలి రోజు కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనేక రాష్ట్రాల నుంచి తెలుగు సంఘాల ప్రతినిధులు హాజరు కానున్న దృష్ట్యా వారందరికీ ఆంధ్ర సారస్వత పరిషత్ వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తోన్నది. 60 విద్యా సంస్థల నుంచి 25 వేల మంది విద్యార్థులు ఈ తెలుగు మహాసభలను సందర్శించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. తెలుగు వెలుగుల పేరుతో తెలుగు భాష ఉన్నతి కోసం కృషి చేసిన 350 మంది ప్రముఖుల చిత్రపటాలను ప్రాంగణమంతటా ఏర్పాటు చేశారు. మారిషస్ దేశాధినేత గోకుల్‌కు భరతమిత్ర అనే బిరుదుని కూడా సభలో ప్రదానం చేయనున్నారు. 42 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఖడ్గ తిక్కన అనే చారిత్రక పౌరాణిక నాటకం ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. మూడో రోజు ముగింపు సభకు సీఎం చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు.

మారిషస్ అధ్యక్షుడి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

మారిషస్ దేశ అధ్యక్షుడి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. తెలుగు మహాసభలకు మారిషస్ దేశాధ్యక్షులు ధరమ్ బీర్ గోకుల్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, సీఎం నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ధరమ్ బీర్ గోకుల్ గుంటూరులోని ఐటీసీ వెల్కమ్ హోటల్ విడిది చేసి.. సభా ప్రాంగణానికి చేరుకుంటారు. మంగళగిరిలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకోనున్నారు. భద్రతా ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్, ఇంటిలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ శుక్రవారం పరిశీలించారు. తెలుగు సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్‌తో చర్చించారు.

కొసరు లేక.. అసలుకే ఎసరు!

(5వ పేజీ తరువాయి)

మారింది. కనీసం వచ్చే విద్యా సంవత్సరానికి కూడా వసతి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కానరావడం లేదు.

ఇంజనీరింగ్ కళాశాల భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు 2023లో రూ.31 కోట్లు నిధులను వర్సిటీ మంజూరు చేసింది. రెండేళ్లు గడుస్తున్నా టెండర్లు నిర్వహించడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తోంది. వసతి గృహాల నిర్మాణ పనులు కూడా అర్ధంతరంగా నిలిచిపోయాయి. వీటికి నిధుల కొరత వెంటాడుతోంది. ఇటీవల వర్సిటీ నుంచి ప్రత్యేక బృందం వసతి గృహాల భవనాలను పరిశీలించింది. ఇక్కడ చేపట్టాల్సిన పనులను గుర్తించింది. వర్సిటీ అధికారులకు అవసరమైన పనులకు సంబంధించిన నివేదికను టీం అందజేసింది. దీనిపై వర్సిటీ పెద్దలు స్పందిస్తున్న దాఖలాలు లేవంటే కళాశాల నిర్వహణపై వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. వసతి గృహాలు లేకపోవడంతో 10 కిలోమీటర్ల దూరంలోని నరసరావుపేటలో ప్రైవేట్ వసతి గృహాల్లో విద్యార్థులు ఉంటున్నారు. అక్కడి నుంచి రోజూ కళాశాలకు రావాటంటే ప్రయాణ కష్టాలను ఎదుర్కొంటున్నారు.

చాలీచాలని తరగతి గదులు

కళాశాలలో బీటెక్ ఐదు బ్రాంచ్‌లు, పీజీలో రెండు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. బీటెక్ తరగతుల నిర్వహణకు 20, పీజీకి ఎనిమిది తరగతి గదులు అవసరం ఉంది. ఇప్పటికీ 18 తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో తరగతుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ల్యాబ్‌ల విస్తరణకు గదులు అవసరం ఉంది. ఇప్పటికైనా టెండర్లు నిర్వహించి కళాశాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థులు వర్సిటీ పెద్దలను కోరుతున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధుల కొరత నెలకొంది. కళాశాల అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జల వివాదాలపై కమిటీ!

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న వివాదాలను అధ్యయనం చేయనుంది. గతేడాది జూలై 16న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్వర్యంలో జరిగిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఛైర్మన్‌ను ఈ కమిటీకి ఛైర్మన్‌గా, 12 మందిని సభ్యులుగా నియమించారు. సభ్యులుగా ఇరు రాష్ట్రాల నుంచి నలుగురు చొప్పున ఉన్నతాధికారులు, కృష్ణా, గోదావరి నదుల యజమాన్య బోర్డుల ఛైర్మన్లు, జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజనీర్‌ను కమిటీలో నియమించారు. కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీర్ మెంబర్-సెక్రటరీగా వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రతినిధులుగా జల వనరుల శాఖకు చెందిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సలహాదారు, ఇంజనీర్ ఇన్ చీఫ్(ఇరిగేషన్), చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉంటారు. తెలంగాణ నుంచి ప్రతినిధులుగా నీటి పారుదల, జల వనరుల శాఖ సలహాదారు, నీటి పారుదల, సీఏడీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్పెషల్ సెక్రటరీ, ఇంజనీర్ ఇన్ చీఫ్(జనరల్) సభ్యులుగా ఉంటారు.

మూడు నెలల్లో నివేదిక

ఏర్పాటైన నాటి నుంచి మూడు నెలల్లోగా కమిటీ తన నివేదికను కేంద్రానికి సమర్పించాలని జలశక్తి శాఖ స్పష్టం చేసింది. కమిటీ నీటి నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలను సమగ్రంగా, సాంకేతికంగా అధ్యయనం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిశీలించి, నీటిని న్యాయంగా, సమర్థంగా పంచుకునేందుకు అవసరమైన ఆచరణాత్మక పరిష్కారాలను సూచించాల్సి ఉంటుంది. అవసరమైతే ఇతర సంస్థల నిపుణులను కూడా చర్చలకు ఆహ్వానించే అధికారం కమిటీకి కల్పించారు. కమిటీ సమావేశాలు, క్షేత్ర స్థాయి పర్యటనలకు అయ్యే ఖర్చులను సంబంధిత శాఖలే భరించాల్సి ఉంటుంది.

నాటి నిర్ణయం మేరకు..

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న నీటి పంపిణీ సమస్యలపై చర్చించేందుకు గతేడాది జూలై 16న శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నీటి నిర్వహణలోని కీలకాంశాలు చర్చకు వచ్చాయి. కృష్ణా బేసిన్‌లో నీటి పారుదల తీరుతెన్నులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు టెలీమెట్రీ పరికరాల ఏర్పాటుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. శ్రీశైలం ఆనకట్టను పరిరక్షించేందుకు, అవసరమైన మరమ్మతులను తక్షణమే చేపట్టాలని నిర్ణయించారు. కేఆర్ఎంబీ కార్యాలయాన్ని విజయవాడ లేదా అమరావతికి మార్చేందుకు ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి. మిగిలిన అంశాలను సమగ్రంగా, సాంకేతిక కోణంలో పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన సీనియర్ అధికారులు, సాంకేతిక నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని అప్పట్లోనే నిర్ణయించారు. ఏపీ పోలవరం-బనకచర్ల/నల్లమల్లసాగర్ అనుసంధానం ప్రాజెక్టును ప్రతిపాదించడంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దీనితో పాటు ఏపీ, తెలంగాణ మధ్య 66:44 నిష్పత్తిలో కృష్ణా జలాలను తాత్కాలికంగా పంపిణీ చేస్తూ రాష్ట్ర విభజన తర్వాత తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసి, 50:50 నిష్పత్తిలో పంపకాలను జరపాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. శ్రీశైలం బ్యాక్‌వాటర్ ద్వారా ఏపీ కృష్ణా జలాలను ఇతర బేసిన్లకు తరలించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆయా అంశాలపై ఏపీ ఇప్పటికే తన వాదనలను గట్టిగా వినిపిస్తోంది. తాజాగా నియమించిన కమిటీ ఈ అంశాలపై కేంద్రానికి సూచనలు చేయనుంది.

వైసీపీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

- వారికి అంబేడ్కర్‌పై ఎలాంటి ప్రేమ లేదు
- ఈ-బుక్ పఠనంతో పుస్తకం చదివిన అనుభూతి రాదు: నారాయణ



పుస్తక మహోత్సవంలో మాట్లాడుతున్న సీపీఐ నేత నారాయణ

విజయవాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ స్వరాజ్య మైదానం(పీడబ్ల్యూడీ గ్రౌండ్)లో అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేసి ప్రతి ఏడాది నిర్వహించే పుస్తక మహోత్సవానికి అవకాశం లేకుండా చేశారని సీపీఐ జాతీయ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ అన్నారు. గత ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసి స్వరాజ్య మైదానం లేకుండా చేసిందని ధ్వజమెత్తారు. వాస్తవానికి ఆ ప్రభుత్వానికి అంబేడ్కర్‌పై ఎలాంటి ప్రేమ లేదని వ్యాఖ్యానించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 36వ పుస్తక మహోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'పుస్తక మహోత్సవం నిర్వహించడానికి అనుమతుల కోసం ప్రభుత్వాలు ఇబ్బందులు పెడుతున్నాయి. ప్రభుత్వ స్థలాల్లో ఈ మహోత్సవాలు నిర్వహించడానికి అనుమతుల కోసం వీబీఎఫ్ఎస్ ప్రతినిధులు అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. పుస్తక మహోత్సవం నిర్వహించడానికి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలి. పుస్తక మహోత్సవాలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలి. చాట్ జీపీటీ, ఏఐ ఎన్ని వచ్చినా పఠనం తగ్గలేదు. ఈ బుక్ పఠనంలో పుస్తకం చదివిన అనుభూతి రాదు.' అని నారాయణ అన్నారు.

ఆర్ఆర్ఆర్ నోరు కట్టేశారు

'నేను, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఒకేలా మాట్లాడతాం. ఆయన నోరు కట్టేశారు. నాకు ఆ పరిస్థితి లేదు. నేను ఏదైనా మాట్లాడగలను. ఆర్ఆర్ఆర్‌కు మాత్రం ఆ అవకాశం లేదు' అని నారాయణ అన్నారు. దీనిపై ఆర్ఆర్ఆర్ స్పందించారు. 'నిజమే. నా నోరు కట్టేశారు. ఇది వాస్తవం. నారాయణ మాట ఎంత కటువుగా ఉంటుందో మనస్సు అంత మంచిది' అని రఘురామరాజు వ్యాఖ్యానించారు.

నేడు కొండగట్టుకు డిప్యూటీ సీఎం పవన్

- టీటీడీ నిధులతో నిర్మించే భవనాలకు శంకుస్థాపన




అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టులోని ఆంజనేయ స్వామిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం దర్శించుకోనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన జారీచేసింది. టీటీడీ సమకూర్చిన నిధులతో నిర్మించనున్న భవనాలకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. కాగా, కొండగట్టు ఆంజనేయస్వామిని పవన్ కల్యాణ్ ఇలవేల్పుగా కొలుస్తారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కొండగట్టు స్వామిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆ సమయంలో ఆలయ అధికారులు, అర్చకులతో మాట్లాడిన సందర్భంగా.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం దీక్ష విరమణ మండపం, విశ్రాంతి గదులతో కూడిన సత్రం అవసరమని పవన్‌ను కోరారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. టీటీడీ సహకారంతో కొండగట్టు క్షేత్రంలో వీటి నిర్మాణానికి డిప్యూటీ సీఎం ప్రతిపాదించగానే, దానిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. టీటీడీ ఛైర్మన్‌తో చర్చించడంతో.. ఆయన వెంటనే రూ.35.19 కోట్లు మంజూరుకు అంగీకరించారు. ఈ పనులకు పవన్ శనివారం ఉదయం శంకుస్థాపన చేస్తారు. అనంతరం జనసేన తెలంగాణ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారు. ఇటీవల తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన పార్టీ మద్దతుతో గెలిచిన వారిని కలుస్తారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు.

ఘనంగా పుస్తక పండగ ఆరంభం

- స్టాళ్లలో పరుచుకున్న లక్షల అక్షర సుమాలు
- వినోదం,విజ్ఞానం అందించే పుస్తకాలతో బెజవాడ ఇందిరా స్టేడియానికి కొత్త కళ
- పది రోజులు సాగనున్న పుస్తక మహోత్సవం
- పుస్తకాలు ప్రాణం పోసుకున్న జీవులు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ
- పుస్తక మహోత్సవానికి సొంత ప్రాంగణం
- వచ్చే ఏడాది అమరావతిలోనే ప్రదర్శన
- డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు హామీ





1.జ్యోతి వెలిగించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, సీపీఐ నేత నారాయణ, పబ్లిషర్ ఎమెస్కో విజయకుమార్, బుక్‌ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహరనాయుడు, ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో ప్రతినిధి కృష్ణారావు తదితరులు. 2. పుస్తకాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న జస్టిస్ నరసింహ తదితరులు

విజయవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం 36వ పుస్తక మహోత్సవం ఘనంగా మొదలైంది. ఆంధ్రులకు ఉన్న ముఖ్యమైన పండగల్లో ఒకటిగా మారిన పుస్తకాల పండగ రానున్న పది రోజుల వరకు సాహిత్యకారులను, భాషాభిమానులను అలరించనుంది. తెలుగు నుడికారానికి వన్నెలు దిద్దే పుస్తకాల మొదలు వినోదం, విజ్ఞానం అందించే గ్రంథాల వరకు స్టాళ్లలో కొలువు తీరాయి. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి, సాహిత్య ప్రధాన వేదికకు డాక్టర్ బీవీ పట్టాభిరామ్, ప్రతిభా వేదికకు ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్ పేర్లను పెట్టారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "నా దృష్టిలో పుస్తకాలు ప్రాణం పోసుకున్న జీవులు. మనతోపాటు



బుక్ ఎగ్జిబిషన్‌లో పుస్తక ప్రియుల సందడి

అవీ ప్రయాణం చేస్తుంటాయి" అని ఆయన తెలిపారు. తెలుగు భాషతో మనకు బాంధవ్యం ఉన్నదని తెలిపారు. "భాషను పరిరక్షించుకోవడానికి మనకు రెండు తరాలు మాత్రమే ఉన్నాయి. ఆ తర్వాత తెలుగు లాటిన్ జాబితాలో చేరిపోయే ప్రమాదం ఉంది." అని తెలిపారు. భాషను సజీవంగా ఉంచడానికి పిల్లలకు పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. "చాలామంది పిల్లల్లా నేను కూడా కాన్వెంట్‌లో చదివాను. ఉత్తరాలు తెలుగులో రాస్తే టీచర్లు కొట్టేవారు. నేను ఇంగ్లీష్‌లో రాసిన లేఖలకు మా నాన్న తెలుగులోనే ప్రత్యుత్తరం ఇచ్చేవారు. ఆ తర్వాత తెలుగు భాష నేర్చుకుని రామాయణం, భాగవతం చదివాను. తీర్పులు ఇచ్చేటప్పుడు రాజ్యాంగం తిరగేస్తే, అందులోని అక్షరాలు పులకింపజేస్తాయి." అని జస్టిస్ నరసింహ తెలిపారు.

ఏఐ యుగంలోనూ తగ్గని పుస్తక అభిరుచి : రఘురామ

విజయవాడ పుస్తక మహోత్సవానికి వచ్చే ఏడాది ఒక ప్రాంగణాన్ని కేటాయించేందుకు కృషి చేస్తానని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. తెలుగు భాష పరిరక్షణపై సీఎంకు, పుస్తక పఠనంపై డిప్యూటీ సీఎంకు ఎంతో ఆసక్తి ఉందని చెప్పారు. వారితో సంప్రదించి అమరావతిలో సొంత ప్రాంగణం కేటాయించడానికి ప్రయత్నం చేస్తానన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన 36వ పుస్తక మహోత్సవంలో రఘువీరా ప్రసంగించారు. పది ఎకరాలు కాకపోయినా ఐదు ఎకరాల స్థలం కేటాయించినా అద్భుతమైన పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయవచ్చని అభిప్రాయపడ్డారు. "డిజిటల్ యుగంలో పుస్తక పఠనం తగ్గిపోతుందని అందరితోపాటు నేనూ భావించాను. అయితే, సామాజిక మాధ్యమాలు ఎంతలా అభివృద్ధి చెందినా పుస్తకపఠనం ఏమాత్రం తగ్గలేదు" అని తెలిపారు. రాష్ట్రంలో ఒకప్పుడు గ్రంథాలయాలకు ఎంతో వైభవం ఉండేదని, ఇప్పుడు పుస్తకాలు లేని అచేతన స్థితిలో అవి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలే తెలుగును మరచిపోయే పరిస్థితి ప్రస్తుతం ఉందని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు సహకరించినా, సహకరించకపోయినా భాషాభిమానులంతా ఏకతాటి పైకి వచ్చి మాతృభాషను, పుస్తకాలను సంరక్షించుకోవాలని ఆయన సూచించారు. పుస్తక పఠనంపై రోజురోజుకు అభిమానం పెరుగుతోందన్నారు. విజయవాడలోనే కాకుండా రాష్ట్రంలోని ముఖ్య నగరాలు, పట్టణాల్లో పుస్తక మహోత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఢిల్లీ ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఎ.కృష్ణారావు మాట్లాడుతూ... మార్క్స్ కాపిటల్, పోతన భాగవతం వంటి వంద పుస్తకాలు ప్రపంచాన్ని ప్రభావితం చేశాయన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం పుస్తకం కాదని, అదొక వ్యవస్థ అని వ్యాఖ్యానించారు.

పెట్టుబడుల్లో ఏపీ టాప్!

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడుల వాటా 9.5 శాతంగా నమోదైంది. దేశంలో ఈ 9 నెలల కాలంలో రూ.26.60 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని.. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో వచ్చిన పెట్టుబడుల కంటే ఇది 11.5శాతం ఎక్కువని నివేదిక తెలిపింది. ఈ 26.60 లక్షల కోట్లలో అత్యధికంగా ఇంధన రంగంలో 22 శాతం పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని.. రసాయన పరిశ్రమల రంగంలో 21 శాతం, మెటల్ ఉత్పత్తులు 17 శాతం, ఐటీ ఆధారిత రంగాల్లో పది శాతం పెట్టుబడులు ఉన్నట్లు వెల్లడించింది. కాగా.. దేశంలో పెట్టుబడులు, పారిశ్రామిక పవనాలు దక్షిణ, తూర్పు కారిడార్‌ల వైపు వీస్తున్నాయనడానికి ఇదే నిదర్శనమని రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల పాలన ఉందని, అనుమతులు శరవేగంగా ఇస్తున్నామని.. రంగాల వారీగా విధానాలు తీసుకొచ్చామని.. పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఇంధన, డిజిటల్ రంగాల్లో మౌలిక వసతులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని.. దీనివల్లే పెట్టుబడుల్లో అగ్రస్థానంలో నిలిచామని పేర్కొంది. అంతర్జాతీయ, దేశీయ ఇన్వెస్టర్లతో నిరంతరం క్రియాశీలంగా సంప్రదింపులు జరుపుతున్నామని.. సుస్థిర పాలసీలు, అమలు చేసే కార్యశీల యంత్రాంగం తోడ్పాటుతో మాన్యుఫాక్చరింగ్, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, మొబిలిటీ తదితర రంగాల్లో అధిక పెట్టుబడులకు అవగాహన కుదుర్చుకుంటున్నట్లు తెలిపింది.

పెట్టుబడుల్లో ఏపీ దూసుకుపోతోంది

- 'ఎక్స్'లో లోకేశ్.. ఫోర్బ్స్ కథనాన్ని ట్యాగ్ చేసిన మంత్రి

'ఏపీ పెట్టుబడి లక్ష్యాలను అందుకోవడం కాదు.. పెట్టుబడుల సాధనలో దూసుకుపోతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఇదే..!' అని మంత్రి లోకేశ్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. పెట్టుబడులను రాబట్టడంలో దేశంలోనే ఏపీ టాప్‌లో నిలిచిందంటూ ఫోర్బ్స్ ఇండియా ప్రచురించిన కథనాన్ని ట్యాగ్ చేశారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

విజయనగరం క్రైం/రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం జేఎన్‌టీయూలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఈఈ రెండో సంవత్సరం చదువుతున్న వి. వెంకట ఉదయ తేజ(19) శుక్రవారం ఉదయం తోటి విద్యార్థులతో గడిపాడు. వారితో పాటు అల్పాహారం చేయకపోగా, కళాశాలకు వెళ్లకుండా హాస్టల్ గదిలో ఒక్కడే ఉన్నాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తోటి విద్యార్థులు వచ్చి తలుపులు కొట్టినా, ఫోన్ చేసినా స్పందించలేదు. అనుమానం వచ్చిన వసతి గృహం నిర్వాహకులు తలుపులు విరగ్గొట్టి చూడగా తేజ ఫ్యాన్‌కి ఉరి వేసుకుని కన్పించాడు. కళాశాల అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విశాఖలో ఉంటున్న విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియలేదని విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నిఘా వేశాం.. పట్టుకుంటాం!

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి అదుపులోకి రాలేదని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించామని తెలిపారు. "అవినీతిపరులకు శిక్షలు పడితేనే భయం ఉంటుంది. ఆ దిశగా పనిచేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సీఎం సూచించారు. సీఎం సూచనతో టోల్ ఫ్రీ నంబర్ 1064తో పాటు ఫిర్యాదుల నంబర్ 9440440057ను విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం" అని అతుల్ సింగ్ తెలిపారు. గత ఏడాది 1064కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 16 కేసులు నమోదు చేసి అవినీతిపరుల్ని జైలుకు పంపామని తెలిపారు. ఏసీబీకి మానవ వనరుల అవసరమూ ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వాట్సప్ గవర్నెన్స్‌లోకి ఏసీబీని కూడా తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఏఐ టెక్నాలజీ అందిపుచ్చుకుని ఈ ఏడాది అవినీతి వేటలో వేగంతో పాటు నాణ్యత పెంచుతామని స్పష్టం చేశారు.

శిక్షలు పెరగాలి...

శిక్షల శాతం సంతృప్తికరంగా లేదని, గత ఏడాది కోర్టు తీర్పుల్లో 46 శాతమే శిక్షలు పడ్డాయని అతుల్ సింగ్ తెలిపారు. ప్రధానంగా 161 స్టేట్‌మెంట్ ఇచ్చిన సాక్షులు ఆ తర్వాత కోర్టుల్లో మాట మార్చారని... ఇకపై 164 స్టేట్‌మెంట్ (కోర్టులో జడ్జి ముందు) రికార్డు చేసి, మాట మారిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా జాగ్రత్త పడతామని వివరించారు. ఈ ఏడాది కనీసం 75 శాతం కేసుల్లో శిక్షలు పడేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని తమ లీగల్ టీమ్‌ను, దర్యాప్తు అధికారులను ఏఐ టెక్నాలజీ వైపు నడిపిస్తున్నట్లు వివరించారు. అవినీతికి పాల్పడినవారికి శిక్షలు వేయించేందుకు పది, పన్నెండేళ్లు పడుతోందన్నారు. కొత్త ఏడాదిలో పాత కేసులన్నింటిలో శిక్షలు పడేలా చూడటంతో పాటు చార్జిషీట్ దాఖలు చేసిన మూడేళ్లలో శిక్షలు వేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అవినీతికి సంబంధించిన కేసుల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించేలా స్థానిక ఏసీబీ కోర్టులతో సమన్వయం చేసుకుని, అవినీతికి పాల్పడిన ప్రతి ఒక్కరూ జైలు పాలయ్యేలా కసరత్తు చేస్తున్నామని చెప్పారు.

అవినీతి వేటలో వేగం

2025లో పాతిక వేల నుంచి పాతిక లక్షల వరకూ లంచం తీసుకున్న వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో సంఖ్య పెంచాల్సి ఉందని ఏసీబీ డీజీ అన్నారు. ఈ సమావేశంలో ఏసీబీ జేడీలు సుప్రజ, అశోక్ కుమార్, సురేశ్ కుమార్, రాజశేఖర్, రజనితో పాటు లీగల్ అడ్వైజర్ రాంబాబు పాల్గొన్నారు.

సంచలన కేసులు

- గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ సబ్బవరపు శ్రీనివాసరావు విజయవాడలో రూ.25 లక్షలు లంచం తీసుకొంటూ పట్టుబడ్డారు.
- అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి రూ.5 లక్షలు లంచం తీసుకొంటూ ఏసీబీకి చిక్కారు.
- లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రూ.1.78 లక్షల అవినీతి సొమ్ము తీసుకుని రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు.
- బాపట్ల జిల్లా రేపల్లె ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి.వి.రమణ రావు రూ.1.25 లక్షలు లంచం సొమ్ముతో ఏసీబీకి బుక్కయ్యారు.
- కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ మరో ఇద్దరితో కలిసి లక్ష రూపాయలు లంచం తీసుకొంటూ ఏసీబీకి అడ్డంగా చిక్కారు.

ఫొటోలతో మోసం చేయకండి

- 'స్వచ్ఛాంధ్ర ఏజెన్సీ'లపై పట్టాభి అసంతృప్తి


విజయవాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర విజన్-2047లో భాగంగా రాష్ట్రంలో పారిశుధ్యంపై అన్నివర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించే ఏజెన్సీల పనితీరుపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని తన కార్యాలయంలోని శుక్రవారం ఏఐఐఎల్ఎస్‌జీ(ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్), వాష్ ఇన్‌స్టిట్యూట్ ఏజెన్సీలతో వేరువేరుగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించారు. నాలుగు నెలల శిక్షణా కార్యక్రమాలపై కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కేవలం ఫొటో కార్యక్రమాల ద్వారా ఎవరిని వారు మోసం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమం కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని, తగిన ఫలితాలు కనిపించాలని సూచించారు. సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఓఓ దశరథరామిరెడ్డి, ఏఐఐఎల్ఎస్‌జీ ఏజన్సీ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేష్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎల్.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ శివన్నారాయణ, వాష్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల్లో ఆత్మహత్యల నివారణకు శిక్షణ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడేలా మెడికల్ కాలేజీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ సమక్షంలో క్వశ్చన్ పర్స్యూడ్ రిఫర్ (క్యూపీఆర్) ఇన్‌స్టిట్యూట్ ఇండియా సంస్థతో శుక్రవారం ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. దేశంలోనే తొలిసారిగా వైద్య విద్యార్థుల కోసం నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాలకు మంత్రి సత్యకుమార్ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా గౌర్ మాట్లాడుతూ అమెరికాకు చెందిన డాక్టర్ అపర్ణ మూడేళ్ల నుంచి తన సేవలను రాష్ట్రంలో కొనసాగిస్తున్నారని చెప్పారు. విద్యార్థులతో నేరుగా మానసిక వైద్య నిపుణులు సమావేశమై వారి సందేహాల్ని నివృత్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

హారర్ కామెడీ




నిరంజన్, గ్రీష్మ నేత్రిక, ప్రియాంక, దీప్తి శ్రీరంగం ప్రధాన పాత్రల్లో సింహాచలం గుడుపూరి తెరకెక్కిస్తున్న హారర్ కామెడీ 'రుక్మిణి'. నేలబల్లి సుబ్రమణ్యం రెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమాలు విజయం సాధించాలని కోరుకునే వ్యక్తిని నేను. వాటికి ఆదరణ దక్కినప్పుడే ఇండస్ట్రీ పచ్చగా ఉంటుంది' అని అన్నారు. నిరంజన్ మాట్లాడుతూ 'కుటుంబమంతా కలిసి చూడదగ్గ హారర్ కామెడీ ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకృష్ణ అట్లలూరి, డీఓపీ: తరుణ్ రావుల, సంగీతం: సుభాష్ ఆనంద్.

ఇల్లు పాయె.. ఒళ్లు పాయే




రవితేజ హీరోగా, కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతీ కథానాయికలు. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదలవుతోంది. శుక్రవారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'ఇల్లు పాయె... ఒళ్లు పాయే... వామ్మో వాయ్యో' అనే మాస్ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. ఫుల్ జోష్‌తో వినగానే హుషారు పుట్టించేలా ఉన్న ఈ గీతానికి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, స్వాతిరెడ్డి ఆలపించారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ల, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్.

గోదారి నేపథ్యంలో గ్రామీణ ప్రేమకథ



"మా 'గోదారి గట్టుపైన' సినిమా టికెట్ కొని, థియేటర్లలో కూర్చుంటే, గోదావరిలో పడవ ప్రయాణం చేసినంత ఆహ్లాదంగా ఉంటుంది" అని సుమంత్ ప్రభాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'గోదారి గట్టుపైన'. సుభాష్ చంద్ర దర్శకత్వంలో అభినవ్‌రావు నిర్మిస్తున్నారు. నిధి ప్రదీప్ కథానాయిక. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌ను చిత్రబృందం శుక్రవారం నిర్వహించింది. గోదావరి గ్రామీణ జీవితాన్ని, అక్కడి ఓ యువజంట ప్రేమకథను పరిచయం చేస్తూ సాగిన టీజర్ ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ కథను మొదట నమ్మింది మా నిర్మాత అభినవ్. ఇది ప్రతి ఒక్కరికీ రిలేట్ అయ్యే కథ. ఇందులో మిత్రబృందం ప్రేక్షకులను అలరిస్తారు' అని చెప్పారు. ఇందులో నా పాత్ర పేరు మాయ, నటిగా సవాల్ విసిరే పాత్రను పోషించాను అని నిధి ప్రదీప్ తెలిపారు.



డిటెక్టివ్ పాత్రలో తనికెళ్ల భరణి


తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'అసుర సంహారం'. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో, శ్రీ సాయి తేజో సెల్యూలాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీశ్ బోయళ్ల నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన క్రైమ్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ని తనికెళ్ల భరణి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అసుర సంహారం అంటే చెడుపై మంచి సాధించిన విజయం. ఈ సినిమాలో ఒక విలేజ్ డిటెక్టివ్ పాత్రలో నటించాను' అని చెప్పారు. దర్శకుడు కిశోర్ శ్రీకృష్ణ మాట్లాడుతూ 'ఈ సినిమా చరిత్రలో నిలిచిపోయే చిత్రంగా మారుతుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం నిర్మాణాంతర పనులు కొనసాగుతున్నాయి. మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు.

బ్లడ్ రోజెస్ వేట



యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన చిత్రం 'బ్లడ్ రోజెస్'. ధర్మ కీర్తి రాజు, అప్సర రాణి జంటగా ఎం.జి.ఆర్ దర్శకత్వం వహించారు. హరీశ్ కమర్తి నిర్మాత. ఫిబ్రవరి 6న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. త్వరలో 'బ్లడ్ రోజెస్' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు నిర్మాత తెలిపారు. గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు చెప్పారు. సంగీతం: పెద్దపల్లి రోహిత్.

విడుదలకు సిద్ధమైన వశం



చేతన్, రాజీవ్, కావ్య ప్రధాన పాత్రధారులుగా కోన రమేశ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'వశం'. యెన్నంశెట్టి ఆంజనేయులు మరో నిర్మాతగా వ్యవహరించారు. ఇప్పటికే చిత్రీకరణను పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా కోన రమేశ్ మాట్లాడుతూ 'ఓ సిటీ అబ్బాయికీ, గిరిజన అమ్మాయి మధ్య జరిగే ఆసక్తికరమైన ప్రేమకథ ఇది. ప్రతీ సన్నివేశం ఉత్కంఠభరితంగా ఉంటుంది. తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని చెప్పారు. ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: శంకర, సంగీతం: కిరణ్ తోటంబ్లే.

విద్యుత్తు రంగాన్ని కూటమి ప్రక్షాళన చేస్తోంది: నూకసాని బాలాజీ



అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు చార్జీలను పెంచకూడదన్న సీఎం చంద్రబాబు హామీ మేరకు రూ.4,498 కోట్ల ట్రూ అప్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించేందుకు సిద్ధమైందని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్తు రంగాన్ని కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలపై విద్యుత్తు భారం పడకుండా చూస్తుందని అన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో 9 సార్లు విద్యుత్తు చార్జీలను పెంచి సుమారు రూ.32 వేల కోట్లను ప్రజలపై భారం వేశాడని అన్నారు. జగన్ పాలనలో ఆక్వా రైతులకు యూనిట్ రూ.3.50 వసూలు చేస్తే, కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత యూనిట్‌కు రూ.1.50కు తగ్గిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. జగన్ హయాంలో యూనిట్ విద్యుత్తు రూ.5.19కు కొనుగోలు చేస్తే, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4.70కు కొనుగోలు చేస్తోందని నూకసాని అన్నారు.

ఉపాధి హామీపై కేంద్రం కుట్రలు

- సీఎం చంద్రబాబు కిమ్మనకపోవడం దారుణం: వైఎస్ షర్మిల



అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'జాతీయ ఉపాధి హామీ పథకంపై కేంద్రం కుట్రలు చేస్తుంటే సీఎం చంద్రబాబు కిమ్మనకుండా ఉండడం దారుణం. బీజేపీ చేస్తున్న నల్ల చట్టాలకు చప్పట్లు కొట్టడం అత్యంత సిగ్గుచేటు' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులు మంజూరు చేయకపోతే కూలీలకు పనులు ఇవ్వడం కష్టమని తెలిసినా చంద్రబాబు మాట్లాకడపోవడం ఏమిటని శుక్రవారం ఒక ప్రకటనలో నిలదీశారు. ఉపాధి హామీపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని చంద్రబాబు ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే అప్పులు చేసే రాష్ట్ర ప్రభుత్వం జీ రామ్‌జీ పథకానికి 40% నిధులు ఎలా తెస్తుందని ప్రశ్నించారు. గోరుచుట్టుపై రోకలిపోటులా కొత్త చట్టం మారిందని తెలిసి కూడా సీఎం ఏమీ మాట్లాడకపోవడాన్ని ఆమె తప్పుపట్టారు. నిరుద్యోగంలో నంబర వన్‌గా ఉన్న రాష్ట్రంలో ఉపాధికి ఉరి పెడుతుంటే ప్రజలకు ఏం సమాధానం చెపుతారు? అని షర్మిల నిలదీశారు.

'సర్'పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి: సీపీఐ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను త్వరగా మొదలు పెట్టాలని జనసేన కోరటం బీజేపీకి వంతపాడటమేనని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'ఎస్ఐఆర్ పేరుతో ఇప్పటికే కేరళ, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తమిళనాడుల్లో లక్షలాది ఓట్లను తొలగించారు. గతంలో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ అధికారాన్ని చేపట్టాక అమలుకు సన్నద్ధమవడం సరికాదు' అని ఈశ్వరయ్య పేర్కొన్నారు.

సీడీఐ సాంకేతికతతో ఆర్వో ప్లాంట్‌లు

- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటుకు సవరణ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో కొత్తగా మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే రూ.29.99 కోట్లతో వీటిని నిర్మించేందుకు గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అయితే కన్వెన్షనల్ ప్లాంట్ల స్థానంలో పర్యావరణ అనుకూల నీటి శుద్ధీకరణ సాంకేతికత అయిన కెపాసిటివ్ డి అయొనైజేషన్ (సీడీఐ) ద్వారా ఆర్వో ప్లాంట్లు నిర్మించాలని నిర్ణయించి.. గతంలో ఇచ్చిన ఉత్తర్వులకు సవరణ చేస్తూ ఆదేశాలిచ్చింది. రక్షిత తాగునీటిని విద్యార్థులకు అందించేందుకు ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీ.. ప్రత్యామ్నాయ టెక్నాలజీని వినియోగించే అంశంపై ప్రతిపాదనలు సమర్పించింది. ఐఐటీ తిరుపతి విద్యార్థులతో చర్చించిన తర్వాత కెపాసిటివ్ డి అయొనైజేషన్ ఉత్తమమైన విధానంగా సిఫారసు చేసింది. దీంతో ఈ కొత్త టెక్నాలజీతో ఒక్కో ఆర్వో ప్లాంట్ రూ.3.85 లక్షలతో నిర్మించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

యూటీఎస్ యాప్ నిలిపివేత!

- మార్చి నుంచి 'రైల్‌వన్'లోనే అన్ని సేవలు

హైదరాబాద్ సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అన్ రిజర్వ్డ్, ఫ్లాట్‌ఫారం టికెట్ల బుకింగ్ కోసం ప్రస్తుతం ప్రయాణికులు వాడుతున్న 'యూటీఎస్' యాప్‌ను ఫిబ్రవరి 28 నుంచి నిలిపివేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. దీని స్థానంలో మార్చి 1 నుంచి 'రైల్‌వన్' అనే కొత్త అప్లికేషన్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా ప్రవేశపెట్టిన ఈ యాప్ ద్వారా ఇకపై రిజర్వ్డ్, అన్‌రిజర్వ్డ్ టికెట్లతో పాటు సీజన్ టికెట్ల బుకింగ్, రెన్యూవల్, రిఫండ్ వంటి అన్ని రకాల సేవలను ఒకే చోట పొందవచ్చు. వినియోగదారులకు మరింత వేగవంతమైన, స్నేహపూర్వక అనుభవాన్ని అందించేలా రైల్‌వన్ యాప్ రూపుదిద్దుకుందని అధికారులు చెబుతున్నారు. ఇందులో సురక్షితమైన లాగిన్ విధానం, మెరుగైన ఆన్‌లైన్ చెల్లింపులు, పలు భాషల మద్దతు వంటి అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. వేర్వేరు టికెట్ల కోసం వేర్వేరు యాప్‌లను వాడాల్సిన అవసరం లేకుండా, అన్ని సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంపై ప్రయాణికుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రయాణికులు వెంటనే ప్లేస్టోర్/యాపిల్ స్టోర్ నుంచి రైల్‌వన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, కొత్త విధానానికి మారాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త జిల్లాలకు ఇన్‌చార్జి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటైన పోలవరం, మార్కాపురం జిల్లాలకు ఇన్‌చార్జి ఎక్సైజ్ సూపరింటెండెంట్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రాజమండ్రి ఈఎస్ సీహెచ్ లావణ్యను పోలవరం జిల్లాకు, ఒంగోలు ఈఎస్ షేక్ ఆయేషా బేగంను మార్కాపురం జిల్లాకు ఇన్‌చార్జ్ ఈఎస్‌లుగా నియమించింది.

ఏపీ ఎర్రచందనం రైతులకు 45 లక్షలు



న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం రూ.45 లక్షలు విడుదల చేసింది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ(ఎన్‌బీఏ) 'యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ (ఏబీఎస్)' విధానం కింద రాష్ట్రానికి చెందిన ఎర్రచందనం రైతులకు ఈ మొత్తాన్ని విడుదల చేసింది. ఏపీ జీవ వైవిధ్య మండలి ద్వారా ఈ నిధులను పంపిణీ చేయనున్నారు. ఎన్‌బీఏ ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రూ.143 కోట్లను విడుదల చేయగా.. ఇందులో రూ.104 కోట్లు ఏపీకే కేటాయించడం గమనార్హం.

మోడల్ స్కూళ్లలో 74 మంది గెస్ట్ ఫ్యాకల్టీ

- తాత్కాలిక ప్రాతిపదికన పోస్టుల భర్తీకి అనుమతి

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో 74 మంది గెస్ట్ ఫ్యాకల్టీ (పీజీటీ)ని తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ అనుమతించింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ వి.విజయ రామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి నుంచి ఏప్రిల్ వరకు వారి సేవలు కొనసాగించాలని పేర్కొన్నారు. వారికి గంటకు రూ.250 పారితోషికం చొప్పున నెలకు గరిష్ఠంగా 48 గంటలు బోధించే అవకాశం ఇస్తారు. దీంతో గెస్ట్ ఫ్యాకల్టీకి రూ.12 వేల వరకు పారితోషికం అందుతుంది. మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు వీరు బోధన చేస్తారు.

ఫిబ్రవరిలో మరో డీఎస్సీ



(మొదటి పేజీ తరువాయి)

నియమించారు. దీనికి అనుగుణంగా బదిలీలు చేపట్టారు. ఈ మొత్తం ప్రక్రియ అనంతరం విద్యాశాఖ అంచనా ప్రకారం 1,146 మంది టీచర్ల అవసరమని గుర్తించారు. ఆయా స్థానాల్లో తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. ఆ పోస్టులు సహా మరికొన్ని ఖాళీలతో కలిపి కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం.. సుమారు 2 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తుది అంచనాల ప్రకారం ఆ సంఖ్య 2,500కు చేరవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మొత్తంగా 2,500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చే దిశగా కసరత్తు చేస్తున్నారు.

ఆంగ్లం + కంప్యూటర్

ఈసారి డీఎస్సీలో కొత్తగా ఆంగ్ల భాషా ప్రావీణ్యం, కంప్యూటర్ అవగాహనపై ఒక పేపర్ తీసుకురావాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇప్పటివరకు డీఎస్సీ అంటే కేవలం సంబంధిత సబ్జెక్టు పేపర్‌తోనే పరీక్ష జరుగుతోంది. ఏపీపీఎస్సీ కొన్ని ఉద్యోగ పరీక్షల్లో ఆంగ్ల ప్రావీణ్యంపై పరీక్ష నిర్వహిస్తోంది. అలాగే టీచర్లకు కూడా ఆంగ్ల ప్రావీణ్యంపై ప్రాథమిక స్థాయి పరీక్ష ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. అదేవిధంగా కంప్యూటర్‌పై కూడా ఉపాధ్యాయులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ఈ రెండింటినీ కలిపి ఒక పేపర్‌గా పరీక్ష నిర్వహించాలని విద్యాశాఖ ప్రతిపాదించింది. డీఎస్సీతో పాటే కొత్త పేపర్ పరీక్ష జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

షెడ్యూల్ కంటే ముందే!

ఇటీవల ముగిసిన టెట్ పరీక్షల ఫలితాలను ఈ నెల 9లోగా విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19న ఫలితాలు విడుదల చేయాలి. కానీ, షెడ్యూల్ కంటే ముందే పరీక్షలు ముగిశాయి. దీంతో ఇప్పటికే ప్రాథమిక 'కీ' విడుదల చేశారు. త్వరలో తుది 'కీ' విడుదల చేసి, అనంతరం టెట్ ఫలితాలు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు.

అంతా రూల్స్ ప్రకారమే అంటూ..

'ఆంధ్రజ్యోతి' కథనంపై హెల్త్ వర్సిటీ వివరణ

- అయితే తన ప్రకటనలోనే దొరికేసిన వైనం
- 'సీవోఈ'గా మెడికల్ ఫ్యాకల్టీ ఉంటే పాలన బాగుంటుందట!
- విచిత్ర వాదన..'అనుబంధ' నిబంధన పక్కకు..
- డెంటల్, ఆయుష్‌కు అర్హత ఉన్నా మొండిచెయ్యి
- 'కోరిన' వ్యక్తితో భర్తీ



అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీవోఈ) నియామక ప్రక్రియను నిబంధనల ప్రకారమే చేపట్టామని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తెలిపింది. అనుబంధ కాలేజీల ప్రొఫెసర్లను ఈ పోస్టులో నియమించాలన్న నిబంధనను పక్కనబెట్టి, తిరుపతి స్విమ్స్‌కు చెందిన డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్‌ను నియమించడంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' "ఏంటీ నియామకం?" పేరుతో కథనం ప్రచురించింది. దీనిపై వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. "గత ఏడాది అక్టోబర్ 10వ తేదీన సీవోఈ పోస్టుకు నోటిఫికేషన్ జారీ చేశాం. వర్సిటీ అనుబంధ కాలేజీల నుంచి ఎనిమిది మంది వైద్యులు ఈ పోస్టు కోసం దరఖాస్తు చేశారు. అందులో నలుగురు మాత్రమే వర్సిటీ కోరిన పత్రాలను సమర్పించారు. దీంతో ఆ నలుగురి పేర్లనే వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో పరిగణనలోకి తీసుకున్నాం. వారిలో ఒక్కరు మాత్రమే మెడికల్ ఫ్యాకల్టీకి చెందిన వ్యక్తి. మిగిలిన ముగ్గురూ డెంటల్ కాలేజీ ప్రొఫెసర్లు. ఈ అంశంపై ఈసీ భేటీలో సుదీర్ఘంగా చర్చించాం. కమిటీ సభ్యులంతా మెడికల్ ఫ్యాకల్టీ వైపే మొగ్గు చూశారు. వర్సిటీ అకడమిక్ వ్యవహారాలపై మెడికల్ ఫ్యాకల్టీకే పూర్తి అవగాహన ఉంటుందని, పరిపాలన వ్యవహారాల్లో అనుభవం ఉంటుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. అందువల్ల వర్సిటీ అనుబంధ కాలేజీలకు చెందిన వైద్యులను సీవోఈగా నియమించాలన్న నిబంధనను ఈసీ మీటింగ్‌లో సవరించాం. అందుకు సభ్యులంతా అంగీకరించారు. వర్సిటీ అనుబంధ కాలేజీలతోపాటు రాష్ట్రంలోని ఏదైనా మెడికల్ కాలేజీలో విధులు నిర్వహించే ప్రొఫెసర్లు (మెడికల్ ఫ్యాకల్టీ) సైతం సీవోఈ పోస్టు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఆ సవరణ కల్పించింది. ఇదంతా సక్రమంగానే జరిగింది. ఈసీ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారమే వ్యవహరించాం" అని అధికారులు తమ వివరణలో తెలిపారు.

దొరికిపోయారు ఇలా...

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ సర్వీస్ రూల్స్ -2015 నిబంధనల ప్రకారం సీవోఈ పోస్టుకు మెడికల్, డెంటల్, ఆయుష్ విభాగాల ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. నాలుగు దరఖాస్తుల్లో ఒకరు మెడికల్, ముగ్గురు డెంటల్ విభాగాలకు చెందిన వైద్యులున్నట్టు తన ప్రకటనలో వర్సిటీయే అంగీకరించింది. ఆ ముగ్గురు కూడా హెల్త్ వర్సిటీ అనుబంధ కాలేజీల్లో విధులు నిర్వహిస్తున్నవారే. అలాంటప్పుడు ఆ ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేసే అవకాశం ఉంది. కానీ వర్సిటీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే 'మెడికల్ ఫ్యాకల్టీ' అనే వాదనను తెరపైకి తెచ్చారు. మెడికల్ ఫ్యాకల్టీ అయితే వర్సిటీ పాలన బాగుంటుందన్న విచిత్రమైన వాదనను ముందుకు తెచ్చారు. వర్సిటీ అధికారులు సీవోఈగా ఎవరిని ఎంపిక చేయాలన్న విషయంలో ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చి.. ఆ తర్వాతే ఈసీ భేటీ నిర్వహించారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం వద్ద గోప్యంగా ఉంచి, డా.శ్రీకాంత్‌ను కమిటీనే ఎంపిక చేసిందనే అభిప్రాయం కల్గించారు. ప్రభుత్వం దీనిపై ఎటువంటి విచారణ చేయకుండానే జీవో జారీ చేసింది.


వారంలోనే ముగించేశారు..

ఈసీ మీటింగ్‌లో తెచ్చిన సవరణ ప్రకారం రాష్ట్రంలో ఏ మెడికల్ కాలేజీలో విధులు నిర్వహించే వైద్యులైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. నిబంధనల ప్రకారం, డెంటల్, ఆయుష్ విభాగాల వైద్యులకు కూడా వెసులుబాటు ఇవ్వాలి. కానీ వర్సిటీ అధికారులు అలా చేయలేదు. కేవలం మెడికల్ ఫ్యాకల్టీకి మాత్రమే వెసులుబాటు కల్పించారు. ఈ మేరకు గత ఏడాది డిసెంబరు 17వ తేదీన సీవోఈ పోస్టుకు రెండోసారి నోటిఫికేషన్ జారీ చేసింది. రెండో నోటిఫికేషన్‌లో కేవలం వారం రోజులు గడువు మాత్రమే ఇచ్చారు. ముగ్గురు వైద్యులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. తిరుపతి స్విమ్స్‌కు చెందిన డా.శ్రీకాంత్‌తో పాటు ప్రభుత్వ ఆయుర్వేద కాలేజీకి చెందిన ప్రొఫెసర్ డా.కె.విజయకుమారి, డా.అపర్ణలు దరఖాస్తు చేశారు. ఈ ముగ్గురిలోనూ విజయకుమారి వర్సిటీ అనుబంధ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలే. కానీ, ఆమె దరఖాస్తును కూడా పక్కన పెట్టడం గమనార్హం. 'కోరుకున్నట్టే' శ్రీకాంత్‌ను ఆ పోస్టులో వర్సిటీ అధికారులు కూర్చోబెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

తిరుమల లడ్డూ వివాదంలో..

వైవీ సుబ్బారెడ్డికి చుక్కెదురు

- వ్యతిరేక కథనాలు, పోస్టులపై స్టే ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరణ
- ప్రతివాదుల వాదనలు వినకుండా ఏకపక్ష ఉత్తర్వులివ్వలేమని స్పష్టీకరణ
- తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా



న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వ్యవహారంలో వైసీపీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి తనపై మీడియాలో వస్తున్న కథనాలపై మధ్యంతర స్టే ఇవ్వాలన్న ఆయన విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. ప్రతివాదుల వాదనలు వినకుండా ఏకపక్ష ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. అత్యంత అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే అలా ఉత్తర్వులిస్తామని స్పష్టం చేసింది. 2019 జూన్ నుంచి 2023 ఆగస్టు వరకు తాను టీటీడీ చైర్మన్‌గా పనిచేశానని.. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నెయ్యి సేకరణలో అవకతవకలు జరిగాయంటూ పలు సంస్థలు, ప్రచురణకర్తలు తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కథనాలు రాస్తున్నారని.. వాటిని అడ్డుకోవాలని సుబ్బారెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ అమిత్ బన్సాల్ గత నెల 23న విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. అత్యంత అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే అవతలి పక్షం వాదనలు వినకుండా ఉత్తర్వులిస్తామని.. ప్రస్తుత వ్యాజ్యంలో అలా ఉత్తర్వులివ్వడానికి కోర్టు సుముఖంగా లేదని స్పష్టంచేశారు. తమ ప్రచురణలు, పోస్టులు, కథనాలకు సంబంధించి ప్రతివాదులకు తమ వాదనలు వినిపించే అవకాశమివ్వాలని భావిస్తున్నానని తెలిపారు. వారి వాదన వినకుండా పిటిషనర్‌కు మధ్యంతర ఉపశమనం కల్పించలేమన్నారు. తదుపరి విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేశారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. ఈలోపు ప్రచురించే కథనాలు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని తేల్చిచెప్పారు.

లిక్కర్ గ్యాంగ్‌కు 16 వరకు రిమాండ్

- ఆ రోజు సెలవైతే 19న కోర్టుకు

విజయవాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో వివిధ జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, బూనేటి చాణక్య, అనిల్ చోక్రా, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న నవీన్ కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్, రోణిక్ కుమార్‌ను పోలీసులు ఏసీబీ కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. వారికి 16వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. సంక్రాంతి నేపథ్యంలో రిమాండ్ పొడిగింపుపై కొద్దిసేపు చర్చ జరిగింది. తొలుత 12వ తేదీ వరకు రిమాండ్ విధించాలని భావించారు. ఆ తేదీకి పది రోజుల మాత్రమే వస్తున్నాయని ప్రాసిక్యూషన్ అభ్యంతరం తెలిపింది. దర్యాప్తు అధికారి శ్రీహరిబాబు మాత్రం 14వ తేదీకి వాయిదా వేయాలని కోరారు. ఆ రోజు సెలవు వచ్చే అవకాశం ఉందని డిఫెన్స్ న్యాయవాదులు తెలిపారు. సంక్రాంతి సెలవులు విషయంలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పులు లేనందున 16 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు. ఒకవేళ 16వ తేదీన సెలవు అయితే 19న నిందితులను కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. నిందితుడు బూనేటి చాణక్య తరపున న్యాయవాది సుందర్ వాదనలు వినిపించారు. రిమాండ్ పొడిగింపు రిపోర్టులో నిందితులందరికి కలిపి ఒకే విషయాన్ని రాస్తున్నారని తెలిపారు. చాణక్య రిపోర్టులో సిట్ రాసిన ఏదో పేరాతో అతనికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ రిపోర్టు చాణక్యకు వర్తించదని పేర్కొన్నారు. దీనికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి నిందితుల రిపోర్టు అంతా ఒకేలా ఉంటుందన్నారు. దీన్ని రికార్డు చేయాలని సుందర్ విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో బెయిల్ పొందిన కృష్ణ మోహన్‌రెడ్డి, ధనంజయ్‌రెడ్డి, పైలా దిలీప్ కోర్టుకు హాజరయ్యారు. ఎంపీ మిథున్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప వాయిదాకు హాజరుకాలేమని ఆబ్‌సెంట్ పిటిషన్ వేశారు.

న్యాయాధికారికి విజ్ఞాపనలు

రిమాండ్ పొడిగింపు పూర్తయిన తర్వాత బూనేటి చాణక్య భోజనం గురించి న్యాయాధికారితో మాట్లాడారు. జైల్లో పెడుతున్న భోజనం బాగోవడం లేదని, ఇంటి నుంచి తెప్పించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి సంబంధించిన పిటిషన్ కోర్టులో పెండింగ్‌లో ఉందని తెలిపారు. అనిల్ చోక్రా ఆస్తమాతో బాధపడుతున్నాడని, తాగడానికి వేడినీళ్లు ఇచ్చేలా జైలు అధికారులను ఆదేశించాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. దీనిపై మోమో దాఖలు చేయాలని న్యాయాధికారి ఆదేశించారు.

'సిట్' కస్టడీకి జోగి బ్రదర్స్

నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రామును ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. వారం రోజులపాటు వారిని కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు విజయవాడలోని ఆరో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జోగి బ్రదర్స్‌ను శుక్రవారం నుంచి ఆదివారం వరకు కస్టడీకి ఇస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ములకలచెరువు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి విజయవాడ జైలు నుంచి రమేశ్, రామును కస్టడీలోకి తీసుకున్నారు. వారికి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన తర్వాత గురునానక్ కాలనీలో ఎక్సైజ్ తూర్పు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ వారిని వేర్వేరుగా విచారించారు.

తదుపరి విచారణ వరకు వంశీని అరెస్ట్ చేయవద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీనేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని తదుపరి విచారణ వరకు అరెస్ట్ చేయవద్దని మాచవరం పోలీసులను హైకోర్టు ఆదేశించింది. నూతక్కి సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హత్యాయత్నం, తదితర సెక్షన్ల కింద విజయవాడ పరిధిలోని మాచవరం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వంశీ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సత్యశ్రీ స్పందిస్తూ.. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు. ఈ మేరకు అనుబంధ పిటిషన్ వేశామన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై మొత్తం 19 కేసులు ఉన్నాయని, నేరచరిత్రను పిటిషనర్ వ్యాజ్యంలో పేర్కొనలేదని చెప్పారు. ఈ వివరాలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఘటన జరిగిన 16 నెలల తరువాత పోలీసులు కేసు పెట్టారని గుర్తుచేసింది. ముందస్తు బెయిల్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు తగిన సమయం లేనందున తదుపరి విచారణ వరకు పిటిషనర్‌ను అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. విచారణను సంక్రాంతి సెలవులు తరువాతకి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

నువ్వేమీ టీచర్‌వి కాదు.. మాకు పాఠాలు చెప్పొద్దు

- కాగితంపై రాసుకొచ్చింది చూసి సాక్ష్యం చెప్పడం కుదరదు
- సాక్షిపై విజయవాడ రెండో ఏడీజే కోర్టు న్యాయాధికారి ఆగ్రహం

విజయవాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): "కోర్టులో సాక్ష్యం చెప్పడమంటే రాసుకొచ్చి చదవడం కాదు. ఏం చెప్పదలచుకున్నారో అదే చెప్పాలి" అంటూ ఓ సాక్షికి విజయవాడ రెండో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎ.సత్యానంద్ స్పష్టం చేశారు. విజయవాడలో అభయగోల్డ్ సంస్థ మోసంపై సీఐడీ నమోదు చేసిన కేసు ట్రయల్ శుక్రవారం ప్రారంభమైంది. మల్టీ మార్కెటింగ్ స్కీముల్లో భాగంగా ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తానికి వస్తువులు గానీ, ప్లాట్ గానీ ఇస్తామని ప్రకటించిన ఈ సంస్థ తర్వాత బోర్డు తిప్పేసింది. దీనిపై సీఐడీ 2013లో కేసు నమోదు చేసింది. మొత్తం 23 మందిని నిందితులుగా చేర్చి చార్జిషీటు దాఖలు చేసింది. దీనిపై ట్రయల్ ప్రారంభం కావడంతో మొదటి సాక్షి మత్తయ్యను కోర్టుకు పిలిపించారు. అభయగోల్డ్ సంస్థకు ఎంత డబ్బు చెల్లించావని న్యాయాధికారి ప్రశ్నించడంతో.. తనకు సరిగ్గా గుర్తు లేదని, కాగితం చూసి చెప్తానని ఆయన తెలిపారు. దీనిపై న్యాయాధికారి అభ్యంతరం వ్యక్తం చేశారు. రాసుకొచ్చిన కాగితాలు చూసి సాక్ష్యం చెప్పడం కుదరదని స్పష్టం చేశారు. ఎంతో దూరం ప్రయాణం చేసి అలసిపోయి ఉన్నానని, మర్చిపోయిన విషయాలను చూసి చెబుతున్నానని మత్తయ్య వాదించారు. దీనిపై న్యాయాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. "నువ్వేమీ టీచర్‌వి కాదు. మాకు పాఠాలు చెప్పొద్దు" అంటూ చురకలు వేశారు. అభయ గోల్డ్‌కు ఎంత మొత్తంలో చెల్లింపులు చేశావో చెప్పాలని సూచించారు. కట్టిన మొత్తం సరిగ్గా చెప్పకపోయినా వచ్చిన నష్టమేమీ లేదన్నారు. అనంతరం కాగితం చదువుకుని వచ్చి సాక్ష్యం చెప్పడానికి మత్తయ్యకు కొంత సమయం ఇచ్చారు.

దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్

- మారిటైమ్ బోర్డుకు సమ్మతి తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం
- దగదర్తి ఎయిర్‌పోర్టుకు 418.14 ఎకరాల భూసేకరణ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ స్థాపించేందుకు, గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మించేందుకు ఏపీ మారిటైమ్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. షిప్ బిల్డింగ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఎస్‌బీడీఎస్) కింద విశాఖ పోర్టు ట్రస్టు సహకారంతో 2 వేల ఎకరాల్లో వీటిని ఏర్పాటు చేయడానికి సమ్మతించింది. ఈ మేరకు శుక్రవారం మౌలిక సదుపాయల కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మొవ్వ తిరుమల కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుతో పాటు.. షిప్ బిల్డింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని మారిటైమ్ బోర్డు సీఈవోను కృష్ణబాబు ఆదేశించారు. కేంద్ర నౌకాశ్రయ, నీటి రవాణా మంత్రిత్వశాఖ దేశంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, షిప్‌బిల్డింగ్ క్లస్టర్లను నిర్మించేందుకు ప్రతిపాదనలను కోరింది. 2047 మారిటైమ్ అమృత్‌కాల్ విజన్ కింద రాష్ట్రాలకు భారీ లక్ష్యాలను నిర్దేశించింది. ప్రపంచశ్రేణిలో ఐదు షిప్‌బిల్డింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏటా 4.5 మిలియన్ గ్రాస్ టన్నేజ్ మెగా షిప్పింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ క్లస్టర్‌కు కేంద్ర ప్రభుత్వ నౌకాయాన అభివృద్ధి మంత్రిత్వశాఖ సంపూర్ణ సహకారం అందిస్తుంది. మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌కు విశాఖపట్నం పోర్టు ట్రస్టు సాంకేతిక, నిర్మాణ సహకారాన్ని అందిస్తుంది. కేంద్ర నౌకాయాన అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు, రాష్ట్రానికి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సమ్మతించాలంటూ ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో ప్రభుత్వాన్ని అభ్యర్థించిన నేపథ్యంలో దుగరాజపట్నంలో మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ఆమోదం తెలిపింది. దీంతో.. ఏపీ మారిటైమ్ బోర్డు టెక్నో ఎకనామిక్ ఫీజుబిలిటీ రిపోర్టు (టీఈఎఫ్ఆర్)ను మెస్సర్స్ రైట్స్ ద్వారా చేయించేందుకు సిద్ధమైంది. అలాగే దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం దామవరం వద్ద 418.14 ఎకరాల భూమిని ఎకరా రూ. 13 లక్షల చొప్పున సేకరించేందుకు ఏపీ ఎయిర్‌పోర్టు అథారిటీకి రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ఆమోదం తెలిపింది.

గ్రూప్-1 తర్వాతే గ్రూప్-2 ఫలితాలు

- సంక్రాంతిలోగా గ్రూప్-1 రిజల్ట్స్
- త్వరగా ఇవ్వాలని ఏపీపీఎస్సీ చైర్మన్‌కు గ్రూప్-2 అభ్యర్థుల విజ్ఞప్తి

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల తర్వాతే గ్రూప్-2 ఫలితాలు విడుదల చేయాలని ఏపీపీఎస్సీ నిర్ణయించింది. గ్రూప్-2కు సంబంధించిన కేసులపై పరిష్కారం లభించినా.. గ్రూప్-1 తర్వాతే వాటి ఫలితాలు ఇవ్వనుంది. గ్రూప్-2 ఫలితాలను త్వరగా విడుదల చేయాలని సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులు శుక్రవారం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నోటిఫికేషన్ జారీచేసి రెండేళ్లు అవుతోందని, ఇప్పటికీ ఫలితాలు రాకపోవడం వల్ల తమ విలువైన సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడుతున్నామని, ప్రస్తుతం కేసులన్నీ తొలగిపోయినందున వెంటనే తుది ఫలితాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సంక్రాంతిలోగా గూప్-1 ఫలితాలు విడుదల చేస్తామని, గ్రూప్-2 ఫలితాల ప్రక్రియ ప్రారంభమైందని ఏపీపీఎస్సీ చైర్మన్ వారితో అన్నారు. ఇదిలా ఉండగా.. గ్రూప్-2 అభ్యర్థులకు కొత్తగా అన్‌విల్లింగ్ ఆప్షన్ ఇచ్చారు. దీంతో ఈ నెలాఖరునాటికి గ్రూప్-2 ఫలితాలు విడుదల కావొచ్చని తెలుస్తోంది. గ్రూప్-2లో సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన వారిలో చాలా మంది గ్రూప్-1లోనూ ఉండే అవకాశం ఉన్నందున.. ఏపీపీఎస్సీ తొలుత గ్రూప్-1 ఫలితాలివ్వాలని భావిస్తోంది. మరోవైపు హారిజంటల్ రిజర్వేషన్‌పై పిటిషన్లను హైకోర్టు తిరస్కరించడంతో గ్రూప్-1 క్రీడా కోటాలో నలుగురు అభ్యర్థులను ఏపీపీఎస్సీ ఇంటర్వ్యూలకు పిలిచింది. ఈనెల 7న వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయి. అనంతరం గ్రూప్-1 ఫలితాలు విడుదల చేస్తారు.

ఏఐతో న్యాయ వ్యవస్థలో భారీ మార్పులు!

- ఏఐ మన ఆలోచనాశక్తిని ప్రభావితం చేసే స్థాయికి చేరుతుంది
- స్వీయ విశ్లేషణ, సృజనాత్మకత కోల్పోకుండా జాగ్రత్త వహించాలి
- న్యాయవాదులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ
- ఏపీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జస్టిస్ నరసింహకు సన్మానం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున మార్పులు రాబోతున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ అన్నారు. ఏఐ మన ఆలోచనా శక్తిని ప్రభావితం చేసేస్థాయికి చేరుకుంటుందని చెప్పారు. ఈ క్రమంలో స్వీయవిశ్లేషణ శక్తిని కోల్పోకుండా జాగ్రత్త వహించాలని న్యాయవాదులకు సూచించారు. విజయవాడకు వచ్చిన జస్టిస్ పీఎస్ నరసింహ శుక్రవారం ఏపీ హైకోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి శ్రీవారి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ పీఎస్ నరసింహ మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా న్యాయవాదులు కూడా తమ నైపుణ్యాలను మెరుగు పరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ వినియోగంపై న్యాయవాదులు, న్యాయమూర్తులకు శిక్షణ అవసరమని సూచించారు. న్యాయమూర్తుల కోసం జ్యుడీషియల్ అకాడమీ ఉన్నట్లే.. న్యాయవాదులకు కూడా శాశ్వత లీగల్ అకాడమీ ఏర్పాటుచేసే విషయంపై దృష్టి సారించాలని ఏపీ బార్ కౌన్సిల్, హైకోర్టు న్యాయవాదుల సంఘం, అడ్వొకేట్ జనరల్, అడిషనల్ సొలిసిటర్ జనరల్‌కు సూచించారు. ఏపీ లీగల్ అకాడమీ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో మౌలికవసతులు మెరుగుపడుతున్నాయని, రెండు మూడేళ్లలో హైకోర్టు భవన నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తర్వాత ఏపీ హైకోర్టుకు ఆలస్యంగా వచ్చినప్పటికీ... తన మనసంతా ఇక్కడే ఉందని అన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ... జస్టిస్ నరసింహ భవిష్యత్తులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టబోతున్నారని, ఇది ఈ ప్రాంతవాసులకు గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, సీనియర్ న్యాయవాదులు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సి.సుబోధ్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అంతకుముందు జస్టిస్ నరసింహ హైకోర్టు సీనియర్ న్యాయవాదుల లాంజ్‌కు వెళ్లి వారితో కొద్దిసేపు ముచ్చటించారు. హైకోర్టు గ్రంథాలయాన్ని, హైకోర్టు నూతన భవన నిర్మాణ స్థలాన్ని కూడా పరిశీలించారు. శుక్రవారం రాత్రి జస్టిస్ నరసింహ గౌరవార్థం హైకోర్టు న్యాయమూర్తులందరూ విందు ఏర్పాటు చేశారు.


జస్టిస్ నరసింహను సత్కరించి, శ్రీవారి ప్రతిమను అందజేస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, కార్యవర్గ సభ్యులు


జస్టిస్ పీఎస్ నరసింహకు ఆయన తండ్రి జస్టిస్ కోదండరామయ్య చిత్రపటాన్ని అందిస్తున్న ఏఎస్‌జీ ధనంజయ, న్యాయవాది బాచిన హనుమంతురావు, మేదేపల్లి గ్రామస్థులు

జస్టిస్ నరసింహను కలిసిన మేదేపల్లి గ్రామస్తులు..

ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, మేదేపల్లి గ్రామస్తులు హైకోర్టుకు వచ్చి జస్టిస్ నరసింహను మర్యాదపూర్వకంగా కలిశారు. జస్టిస్ నరసింహకు ఆయన తండ్రి దివంగత జస్టిస్ కోదండరామయ్య చిత్రపటాన్ని అందజేశారు. వారిని ఆప్యాయంగా పలకరించిన న్యాయమూర్తి... గ్రామపరిస్థితి గురించి తెలుసుకున్నారు. త్వరలో మేదేపల్లికి వస్తానని చెప్పారు. జస్టిస్ నరసింహం పూర్వీకులు మేదేపల్లి గ్రామానికి చెందినవారు కావడం గమనార్హం.


హైకోర్టు భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

శాశ్వత హైకోర్టు భవన నిర్మాణాన్ని పరిశీలించిన సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల బృందం


పిచ్చుకలపాలెంలో నిర్మించబోయే ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డిజైన్‌ను పరిశీలిస్తున్న న్యాయమూర్తుల బృందం

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో నిర్మాణం జరుగుతున్న శాశ్వత హైకోర్టు భవనం, న్యాయమూర్తుల నివాస కట్టడాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిగంటం శ్రీ నరసింహ పరిశీలించారు. శుక్రవారం అమరావతి రాజధాని సందర్శనకు వచ్చిన ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రఘునందన రావుతో కలసి భవనాలను చూశారు. ఈ సందర్భంగా ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు హైకోర్టు నిర్మాణ పురోగతి, న్యాయమూర్తుల క్వార్టర్స్ నిర్మాణాల గురించి వివరించారు. పిచ్చుకలపాలెంలో 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డిజైన్‌లను కూడా చూపించారు. నిర్మాణ పనులపై జడ్జీలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు సీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి.

రైతులకు కొత్త సంవత్సర కానుక

- రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- మంత్రులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్
- ఈ కార్యక్రమంలో ఒక రోజు పాల్గొననున్న సీఎం
- కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం ఈ కార్యక్రమంపై టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రులతో సమీక్ష నిర్వహించారు. పాస్‌పుస్తకాల పంపిణీ గురించి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నాటి సీఎం ఫొటోలతో భూమి హక్కు పత్రాల పంపిణీ చేశారన్నారు. నాటి ప్రభుత్వ చర్యలపై ప్రజల అసంతృప్తి నేపథ్యంలో రీ సర్వే తప్పులను సరిదిద్ది కొత్త పాస్‌పుస్తకాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేరుస్తున్నామన్నారు. భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే మన లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలను అభద్రతకు దూరం చేశామని అన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల పరిధిలో 22 లక్షల కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ ప్రారంభమైందన్నారు. శుక్రవారం నుంచి 9 వరకు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. పాస్‌పుస్తకాలపై నాటి పాలకులు తమ బొమ్మలకు రూ.22 కోట్లు తగలేశారని, ఇప్పుడు జగన్ బొమ్మతో ఉన్న పాస్‌పుస్తకాల స్థానంలో రాజముద్ర ఉన్న పుస్తకాల పంపిణీపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. ప్రజలకు భూవివాదాలు లేకుండా చేయడం మన ప్రథమ కర్తవ్యం కావాలని, నిర్దిష్ట సమయాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో ఎక్కువ చొరవ తీసుకోవాలని సూచించారు. తాను కూడా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీలో ఒకరోజు పాల్గొంటానని సీఎం పేర్కొన్నారు.


జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, అధికారులు

ప్రతి నెలా పంపిణీ: సీఎస్

రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను వీలైనంత వరకూ తగ్గించే లక్ష్యంతో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో 9వ తేదీ వరకు కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడాది పాటు ప్రతినెలా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి భూమి ఉన్న ప్రతి రైతుకూ కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందిస్తామన్నారు. వివిధ రైల్వే ప్రాజెక్టులు, రైల్వే లెవల్ క్రాసింగ్‌ల స్థానంలో నిర్మించే ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలకు భూసేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్చువల్‌గా పాల్గొన్న రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ.. రైతుల వద్ద ఉన్న పాత పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకుని కొత్తవి పంపిణీ చేయాలని, పాత పుస్తకాలను ఏవిధంగా మనుగడలో లేకుండా చేయాలో ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. నీటి పన్నును రైతుల నుంచి బలవంతంగా వసూలు చేయకుండా వారిని ఒప్పించి సక్రమంగా వసూలు జరిగేలా చూడాలన్నారు.

రీ సర్వేలో ఏపీ నంబర్ వన్: పెమ్మసాని

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 'రీ సర్వే ప్రక్రియ నా శాఖలో ఉంది. ఈ ప్రక్రియను సమర్థంగా నిర్వహిస్తాను. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు చైన్ ద్వారా భూమిని కొలిచేవారని, ప్రస్తుతం సాంకేతికతను వినియోగించుకుంటున్నట్టు చెప్పారు. డాక్యుమెంట్‌తో అవసరం లేదని, అయినా రైతులకు వారి భూమికి సంబంధించిన వివరాలు తెలిసేలా పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే ఈ పథకం అమలులో ఏపీ ముందుండటంతో కేంద్రం రూ.400 కోట్లు ప్రోత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. ఒక వ్యక్తి తానే శాశ్వతం అనుకుని పట్టాదారు పాస్‌పుస్తకాలపై బొమ్మలకు రూ.20 కోట్లు, భూమి సరిహద్దు రాళ్ల కోసం రూ.750 కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచించి శాశ్వత పరిష్కారం చూపారని అన్నారు. సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ మాట్లాడుతూ.. రీ సర్వేలోని తప్పిదాలను సరిచేస్తూ నిజమైన హక్కుదారుకు వారి పేరుతో రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలను ఇస్తున్నామని చెప్పారు.

ఇక భూ సమస్యలు ఉండవు

- రీ సర్వే గ్రామాల్లో రాజముద్రతో పాస్ పుస్తకాలు
- బాపట్ల జిల్లాలో మంత్రి సత్యప్రసాద్ పంపిణీ

కొల్లూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): భూమికి సంబంధించిన సేవలను సరళీకృతం చేసి భావితరాలు భూసమస్యలతో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం బాపట్ల జిల్లా కొల్లూరు మండలం దోనేపూడి గ్రామంలో రీ సర్వే చేసిన భూములకు రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజముద్రతో ముద్రించిన పాస్ పుస్తకాలను రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, సీసీఎల్‌ఏ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, కలెక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌కాని పుస్తకాలు!

పట్టాదారులో మళ్లీ అవే తప్పులు.. మారిందల్లా జగన్ ఫొటో మాత్రమే

- గత ప్రభుత్వం చేసిన రీ సర్వే తప్పులు సరిదిద్దకుండా ఆ డేటాతోనే ముద్రణ
- 6,700 గ్రామాల్లో 21.80 లక్షల పుస్తకాలు
- సమస్యలు పరిష్కరించాలని కూటమి సర్కారుకు 8.75 లక్షల మంది రైతుల పిటిషన్లు
- ఒక్కటీ పరిష్కరించని వైనం
- 35 కోట్లకు పైగా ఖర్చు పెట్టి సాధించిందేమిటో?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో జగన్ ఫొటోలతో ముద్రించిన పట్టాదారు పాస్‌పుస్తకాల స్థానంలో జగన్ బొమ్మ స్థానంలో రాజముద్ర ఉన్న పాస్‌పుస్తకాల పంపిణీకి ఇప్పుడు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇది మంచి పరిణామమే. అయితే నాడు జగన్ జమానాలో రీ సర్వే చేసిన గ్రామాల్లో సృష్టించిన కొత్త సమస్యలు, వివాదాలు, తప్పుగా నమోదు చేసిన రికార్డులను పరిష్కరించకుండానే.. అవే తప్పులతో రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. నాడు రీ సర్వే చేసిన 6,700 గ్రామాల్లో పాస్‌పుస్తకాల్లో తప్పులు సవరించాలని 8.75 లక్షలమంది రైతులు కూటమి ప్రభుత్వానికి వినతులు ఇచ్చారు. వీటిలో ఒక్కటీ పరిష్కారం కాలేదు. కానీ ఏకంగా 21.80 లక్షల పాస్ పుస్తకాలు ముద్రించారు. సమస్యలు పరిష్కరించిన తర్వాత పాస్‌పుస్తకం ఇస్తే రైతుకు ఉపయోగం. కానీ జగన్ సృష్టించిన తప్పులను యథాతథంగా నమోదు చేసి కొత్తగా పాస్‌పుస్తకాలు ఇవ్వడం వల్ల రైతులకు ఉపయోగం ఏమిటి? కొత్త పాస్‌పుస్తకాల్లో జగన్ ఫొటో తీసేసినా, తప్పులు మాత్రం కొనసాగుతున్నాయి. నాడు రీ సర్వే చేసిన గ్రామాల్లో ఇప్పుడు కొత్త పాస్‌పుస్తకాలు తీసుకుంటున్న రైతులు వాటిలో మళ్లీ పాత తప్పులు చూసి గగ్గోలు పెడుతున్నారు. కొన్ని పుస్తకాల్లో రైతుల ఫొటోలు మారిపోయాయి. మరికొన్నింటిలో అసలు ఫొటోలే లేవు. సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, ఖాతా నంబర్లు.. ఇలా అన్నీ తప్పు వచ్చాయి. వీటిపై అధికారులను ప్రశ్నిస్తే, సరిచేసి మళ్లీ ఇస్తామని వెనక్కి తీసుకుంటున్నారు. ఈ మాత్రం దానికి 35 కోట్లపైనే ఖర్చు పెట్టి పాస్‌పుస్తకాలు ముద్రించి ఇవ్వాలా? ఇంతకీ ప్రభుత్వం సాధించింది ఏమిటి? అన్న ప్రశ్నలు వస్తున్నాయి. 'నాటి సమస్యలను కొన్ని పరిష్కరించాలని నిర్ణయించాం. మరి కొన్ని త్వరలోనే పరిష్కరిస్తాం' అని రెవెన్యూ శాఖ మంత్రి గురువారం ప్రకటించారు. ఆ పరిష్కార ప్రక్రియ మొదలుకాక ముందే పాస్‌పుస్తకాలు పంపిణీ మొదలుపెట్టారు.

నాడు ఏం జరిగిందంటే...

గత జగన్ ప్రభుత్వం 2020 నుంచి 2024 వరకు భూముల సర్వే చేసింది. రైతులకు వివాదాలు లేని భూముల రికార్డులు అందిస్తామని, రికార్డు ప్రక్షాళన చేస్తామని చెప్పింది. జగన్ సర్కారు దిగిపోయేనాటికి 6,700 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసినట్లుగా ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చారు. రైతులకు జగన్ బొమ్మలతో కూడిన పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఆ పుస్తకాల్లో రైతుల పేర్లు, భూమి సర్వే నంబర్, విస్తీర్ణం, సరిహద్దుల్లో భారీగా తప్పులు వచ్చాయి. రైతుల ప్రమేయం లేకుండా రెవెన్యూ, సర్వే సిబ్బంది సొంతంగా సర్వే రికార్డులు తయారు చేసుకొని ఆ డేటానే ఫైనల్ చేశారన్న విమర్శలొచ్చాయి. ఆ డేటాను నాటి ప్రభుత్వం పునఃపరిశీలన చేయలేదు. నాటి జగన్ సలహాదారుకు సమీప బంధువు, గుంటూరులోని ఓ ప్రైవేటు ప్రింటర్‌కు పాస్‌పుస్తకాల పంపిణీ బాధ్యత ఇచ్చారు. తప్పులతడక పాస్‌పుస్తకాలను లక్షల మంది రైతులు తీసుకోలేదు. కొందరు తీసుకున్నా దానితో ఉపయోగం లేదని చించివేశారు.

రీ సర్వే గ్రామాల్లో 8.75 లక్షల సమస్యలు

కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే గత ప్రభుత్వం రీ సర్వే నిర్వహించిన 6,700 గ్రామాల పరిధిలో సభలు నిర్వహించింది. తమ సమస్యలు పరిష్కరించాలని 8,75,900 మంది రైతులు ప్రభుత్వానికి వినతులు ఇచ్చారు. తక్కువగా భూమి విస్తీర్ణం చూపించడం, తప్పుగా సర్వే నంబర్ నమోదు చేయడం, సరిహద్దులను తారుమారు చేయడం, వారసత్వపు భూములను సబ్ డివిజన్ చేయకపోవడం, నోషనల్ ఖాతాలను సరిచేయకపోవడం.. ఇలాంటి అనేక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇవిగాక ఫ్రీ హోల్డ్ అయిన అసైన్డ్, చుక్కల, షరతుగల పట్టా, సర్వీస్ ఇనాం భూములు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులు, మాజీ సైనికులు, సర్వీసులో ఉన్న సైనికుల భూముల సమస్యలు కూడా ఉన్నాయి. కానీ ఈ సమస్యలను పరిష్కరించలేదు. గత ప్రభుత్వంలో తప్పులతడకగా పాస్‌పుస్తకాలు ముద్రించారని తెలిసినా ప్రభుత్వం ఆ డేటానే పరిగణనలోకి తీసుకుంది. రీ సర్వే తప్పులను సరిదిద్దకుండానే గుంటూరులోని ప్రైవేటు ప్రెస్‌కు పంపించింది. జగన్ ఫొటో మాత్రమే తీసేసి, మిగతా డేటాతో కొత్త పాస్‌పుస్తకాలను ముద్రించింది. ఈ ప్రైవేటు ప్రెస్ కూడా గత జగన్ సర్కారులో కీలక సలహాదారుకు సన్నిహితుడిది. ఇప్పుడూ ఆయనకే టెండర్ కట్టబెట్టారు. వాస్తవం ఇది కాగా రైతులకు నేరుగా మద్రాస్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నుంచి స్పీడ్ పోస్టులో పాస్‌పుస్తకాలు అందిస్తామని ముఖ్యమంత్రితో రెవెన్యూశాఖ ప్రకటన చేయించింది.

75 శాతం తప్పులే

- సీఎం సొంత జిల్లా ఉమ్మడి చిత్తూరులో పుంగనూరు మండలం మంగళం గ్రామంలో నాడు జగన్ సర్కారు రీ సర్వే అనంతరం 1500 మందికి పాస్‌పుస్తకాలు ఇచ్చింది. వీటిలో 1132 పుస్తకాల్లో తప్పులు వచ్చాయి. కూటమి సర్కారు తాజాగా ఇదే గ్రామంలో రైతులకు అందించేందుకు 1052 పాస్‌పుస్తకాలు పంపించింది. అందులో 245 మాత్రమే ఏ తప్పులూ లేకుండా ఉన్నాయి. 807 పాస్‌పుస్తకాల్లో మళ్లీ తప్పులు వచ్చాయి. రైతుల ఫొటోలు మారిపోయాయి. సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, ఖాతా నంబర్లు.. ఇలా అన్నీ తప్పే వచ్చాయి. దీంతో వాటిని రైతులకు పంపిణీ చేయకుండా రెవెన్యూ అధికారులు వెనక్కి తీసుకెళ్లారు.
- ఉమ్మడి చిత్తూరు జిల్లా నింద్ర మండలంలో రైతుల కోసం 3,834 పాస్‌పుస్తకాలు పంపించారు. అందులో 1337 పుస్తకాల్లో తప్పులు వచ్చాయని గుర్తించారు. 413 పుస్తకాల్లో రైతుల ఫొటోలు మార్చేశారు. 27 పుస్తకాల్లో రైతుల ఫొటోలే లేవు. మరో 897 పుస్తకాల్లో భారీగా తప్పులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో తప్పులున్న వాటిని పంపిణీ చేయకుండా వెనక్కి తీసుకెళ్లారు.
- పాస్‌పుస్తకాల్లో భారీగా తప్పులున్నాయని రెవెన్యూ యంత్రాంగం గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించింది. కొందరు జాయింట్ కలెక్టర్లు, కలెక్టర్లు ఇదే విషయాన్ని రెవెన్యూ శాఖ పెద్దల దృష్టికి తీసుకొచ్చారు. తప్పులున్న పుస్తకాలను రైతులకు పంపిణీ చేయవద్దని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది.



అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్

- కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి 'రద్దు' అధికారాలు
- సభ్యులుగా జేసీ, జిల్లా రిజిస్ట్రార్, ఆర్డీవో
- ప్రభుత్వ, దేవదాయ, అసైన్డ్, నకిలీ, డబుల్ రిజిస్ట్రేషన్లన్నీ కమిటీ పరిధిలోకే
- తప్పు చేసే సబ్ రిజిస్ట్రార్లకు మూడేళ్లదాకా జైలు
- విధి విధానాలతో ఉత్తర్వులు జారీ
- గతంలో సివిల్ కోర్టులకే 'రద్దు' అధికారం
- ఫోర్జరీ తేల్చాల్సింది మాత్రం కోర్టులే

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, దేవదాయ, అసైన్డ్ భూములు, నకిలీ రిజిస్ట్రేషన్లు, ఫోర్జరీ సంతకాలతో జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేసే బాధ్యతను కలెక్టర్ కమిటీకి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2025 జూలైలోనే ఈ నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ... కమిటీకి విధి విధానాలు నిర్ణయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేసే అధికారం సివిల్ కోర్టులకు మాత్రమే ఉంది. దీనివల్ల ఫోర్జరీ డాక్యుమెంట్లు, ఇతర అక్రమ పద్ధతుల్లో ఆస్తుల విక్రయాల రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి. దీంతో అక్రమ ఆస్తుల రిజిస్ట్రేషన్ల నిరోధానికి జాతీయ రిజిస్ట్రేషన్ చట్టం - 1908 (సవరించిన/ఏపీ యాక్ట్ అమెండ్‌మెంట్ - 2023) బిల్లుకు 2023 మార్చి 20న శాసనసభ ఆమోదం తెలిపింది. రిజిస్ట్రేషన్లు అక్రమ పద్ధతుల్లో జరిగినట్టు ఫిర్యాదులు అందగానే జిల్లా రిజిస్ట్రార్ వాటిని పరిశీలిస్తారు. ఆధారాల ప్రాతిపదికన కలెక్టర్ నేతృత్వంలో ఏర్పడే కమిటీకి తగిన సిఫారసు చేస్తారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఆర్డీవో ఉంటారు. ఆధారాలు సమంజసంగా ఉంటే ఆ కమిటీ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్లు రద్దవుతాయి. 22ఏలో ఉన్న ప్రభుత్వ, దేవదాయ, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు... ఒక ఆస్తిని ఒకరి కంటే ఎక్కువ మందికి విక్రయించిన కేసులుండే 22బి జాబితా... కోర్టు, ఐటీ, జీఎస్టీ ఎటాచ్‌మెంట్ ఉన్న భూములుండే 22సి జాబితాల్లోని భూముల రిజిస్ట్రేషన్లను కోర్టుకు వెళ్లే అవసరం లేకుండా, ఆధారాల మేరకు ఈ కమిటీయే రద్దు చేయొచ్చు. ఫోర్జరీ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లు కూడా 22సి జాబితాలోకి వస్తాయి. కానీ, ఫోర్జరీ జరిగిందా లేదా అనేది కోర్టు నిర్ణయించాల్సి ఉంటుంది. కోర్టు ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ సవరణ ప్రకారం, నిషేధిత జాబితాలో ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లు చేసినా, ఒకే ఆస్తికి రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేసినా, కోర్టు ఎటాచ్‌మెంట్‌లో ఉన్న వాటికి రిజిస్ట్రేషన్లు చేసినా అలాంటి సబ్ రిజిస్ట్రార్లకు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు.

ఫ్రీ హోల్డ్ అక్రమాల మాటేమిటి?

జగన్ హయాంలో ఫ్రీహోల్డ్ ముసుగులో రాష్ట్రవ్యాప్తంగా వేల ఎకరాల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది. కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ వాటిని రద్దు చేయడం సులభమని భావించి ఆగమేఘాల మీద 2025 జూలైలోనే నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై విధించిన నిషేధాన్ని మాత్రం ఎత్తేయలేదు. దీంతో ఆ అక్రమాలపై ఎవరైనా ఫిర్యాదు చేసినా ఈ కమిటీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాడు నిషేధిత జాబితా నుంచి విడిపించిన 13 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల్లో 25 వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులో అక్రమాలు జరిగినవి 7వేల ఎకరాల వరకు ఉన్నాయి. ఈ ఉత్తర్వులతో, కలెక్టర్ కమిటీ ద్వారా ఇలాంటి రిజిస్ట్రేషన్లు రద్దు చేయడం సులభమే కానీ, ప్రస్తుతం ఆ అక్రమాలేవీ ఈ కమిటీ పరిధిలోకి రావు. ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌పై నిషేధం ఎత్తేస్తేనే అది సాధ్యమవుతుంది.

ఎట్టకేలకు కదలిక!

(మొదటి పేజీ తరువాయి)

బదలాయించారు. దీంతో... మండల స్థాయిలోనే అత్యధిక సమస్యలు పరిష్కారమవుతాయి. మరికొన్ని ఆర్డీవో స్థాయిలో... అతి స్వల్ప సంఖ్యలో మాత్రమే జేసీ స్థాయి పరిశీలనకు వెళతాయి.

తహసీల్దార్ అధికారాలివే...

సివిల్, రెవెన్యూ కోర్టులు ఇచ్చిన ఆదేశాల మేరకు రికార్డుల్లో సవరణలు చేసే అధికారాన్ని తహశీల్దార్‌కు బదలీ చేశారు. ఇంకా భూమి కేటాయింపు, భూ సేకరణ, ల్యాండ్ అసైన్‌మెంట్, భూమి మార్పిడి, ఒక భూమి ఖాతా నుంచి అవసరం లేని ఆధార్‌ను తొలగించడం, పట్టాదారుకు ఒకటికి మించిన ఖాతాలు ఉన్నట్లయితే అవసరం లేని వాటిని తొలగించడం, ప్రైవేటు నోషనల్ ఖాతాలను రెగ్యులర్‌గా మార్చడం, జీరో ఖాతాలను రెగ్యులర్‌గా మార్చడం... ఈ అధికారాలన్నీ ఇకపై తహశీల్దారుకే ఉంటాయి. అంటే... రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో సింహభాగానికి మండల స్థాయిలోనే పరిష్కారం లభిస్తుంది.

ఆర్డీవో పరిధిలో...: రీ సర్వే గ్రామాల్లో మ్యుటేషన్‌లో సవరణలు అంటే... సర్వే నంబర్, భూమి స్వభావం, పట్టాదారు పేరు, భూమి ఎలా వచ్చింది, సాగుదారు పేరు వంటి వాటిని ఇక ఆర్డీవోనే రికార్డుల్లో నమోదు చేస్తారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్)లో భూమి విస్తీర్ణంలో సవరణ, ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎమ్)లో తప్పుగా మ్యాప్ చేసిన ఖాతాను సరిదిద్దే అధికారం కూడా జేసీ నుంచి ఆర్డీవోకు బదిలీ చేశారు. ఇంకా, ఎల్‌పీఎమ్‌లో పట్టాదారును చేర్చడం, రికార్డుల్లో మిస్ అయిన సర్వే నంబర్‌ను జతచేయడం, భూమి స్వభావంలో అవసరమున్న సవరణలు వివాద రిజిస్టర్‌లో పేర్లు నమోదు - తొలగింపు అధికారాన్ని కూడా ఆర్డీవోకు అప్పగించారు.

జేసీ వద్ద ఉండే అధికారాలు

ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చే ప్రక్రియనే జేసీ నేతృత్వంలోనే జరగాలని ప్రభుత్వం నిర్దేశించింది. స్వాతంత్ర్య సమరయోధులు, సర్వీసులో ఉన్న సైనికులు, మాజీ సైనికులకు భూములు అసైన్‌మెంట్ చేసే అధికారం జేసీ వద్దే ఉంటుంది.

కీలక మార్గదర్శకాలు..

- పోరంబోకు భూములను శిస్తుకట్టే భూములుగా, శిస్తు పరిధిలో లేని (అన్ అసెస్డ్ వేస్ట్) భూములుగా మార్చే అధికారం సబ్‌కలెక్టర్, ఆర్‌డీఓలకు ఇచ్చారు. అయితే, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు చెందిన భూములపై ఈ అధికారం వీరికి ఉండదు. నీటి వనరులున్న భూములు పదేళ్ల క్రితమే ఎవరికైనా అసైన్‌మెంట్ చేసి ఉంటే తప్ప వీటి జోలికి వెళ్లవద్దని ఆదేశించారు.
- మాజీ సైనికుల భూములను నిబంధనల మేరకు పదేళ్ల కాలపరిమితి దాటాక నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించాలి. అసైన్‌మెంట్ చేసినట్లుగా నిర్ధారించే మాస్టర్ రిజిస్టర్, జిల్లా సైనిక అధికారి సిఫారసు చేసే రిజిస్టర్, రెవెన్యూ వద్ద ఉండే 10(1) రికార్డు, అడంగల్, దరఖాస్తు ఫైల్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు, సర్వేశాఖ వద్ద ఉండే 8ఏ రిజిస్టర్, ఇంకా డీకేటీ పట్టా, ఇతర డాక్యుమెంట్లలో ఏది చూపించినా పరిగణలోకి తీసుకోవాలి. ఇతర డాక్యుమెంట్లు కావాలని ఒత్తిడి చేయవద్దు.
- మాజీ సైనికులు, సర్వీసులోఉన్న సైనికులు, రాజకీయ బాధితులు, 1954 జూలై 18కి ముందు అసైన్‌మెంట్ చేసిన భూములు, ప్రైవేటు పట్టా భూములను సత్వరం నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. అలాగే... ఒక నిర్దిష్ట భూమికి బదులు, మొత్తం సర్వే నంబరును నిషేధ జాబితాలో కలిపిన వాటిని సబ్ డివిజన్ చేసి, అవసరం ఉన్న వాటిని 22(ఏ)లో కొనసాగిస్తూ, మిగిలిన భూములను నిషేధ జాబితాలోనుంచి తొలగించాలి. దీనికి మూడు నెలలే గడువు.
- గ్రామ, వార్డు సచివాలయాలు, మీ-సేవల్లో కొత్తగా ఐదు రకాల మ్యుటేషన్ సేవలకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అవి... 1) కోర్టు ఆదేశాలతో మ్యుటేషన్ చేసేవి, 2) 2000 సంవత్సరానికి ముందు లావాదేవీలు, రిజిస్ట్రేషన్‌లు జరిగిన భూముల మ్యుటేషన్, 3) వారసత్వ మ్యుటేషన్‌లు, 4) సర్వే నంబర్ చేర్చడం, అవసరం లేనివి తొలగించడం, నకిలీ సర్వేనెంబరులు తొలగించడం, 5) ఒక రైతుకు ఒక గ్రామంలో ఒకటి కంటే ఎక్కువ భూముల ఖాతాలు ఉంటే, అవసరం లేని వాటిని రద్దు కోరడం.
- ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇచ్చే దరఖాస్తులపై వీఆర్‌ఓ, సర్వేయర్ సంతకాలు తప్పనిసరి అనే నిబంధన లేదు. వాటికోసం డిజిటల్ అసిస్టెంట్లు ఒత్తిడి చేయరాదు.

బళ్లారి ఘటనలో.. గాలి, శ్రీరాములుపై కేసు

మరో 9 మంది బీజేపీ నేతలు, నలుగురు భరత్‌రెడ్డి వర్గీయులపై కూడా

బళ్లారి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బళ్లారిలో గురువారం రాత్రి మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డిపై కాల్పులు, ఘర్షణకు సంబంధించి రెండు వర్గాలపైనా కేసులు నమోదయ్యాయి. హవ్వంబావిలోని జనార్దన్‌రెడ్డి ఇంటి వద్ద జరిగిన దాడులు, కాల్పుల ఘటనలో కాంగ్రెస్, బీజేపీకి చెందినవారిపై కేసు నమోదు చేశామని కర్ణాటక ఏడీజీపీ హితేంద్ర శుక్రవారం తెలిపారు. గాలి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి బి.శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాస్ మోత్కర్, ప్రకాశ్‌రెడ్డి, పాలన్న, దివాకర్, మారుతీ ప్రసాద్, దమ్మూరు శేఖర్, అలీఖాన్ సహా 11 మందిని నిందితులుగా చేర్చామన్నారు. అలాగే బళ్లారి కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి అనుచరులు హనుమంత, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్, చానల్ శేఖర్‌పైనా కేసు నమోదు చేశామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, మహర్షి వాల్మీకిని అవమానించడంపైనా కేసు పెట్టామన్నారు. ప్రైవేటు గన్‌మెన్ నుంచి ఐదు తుపాకులను స్వాధీనం చేసుకున్నామని, కాల్పుల్లో మరణించిన రాజశేఖర్ మృతదేహంలో దొరికిన బుల్లెట్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. బళ్లారిలో బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు.

మధ్యాహ్నం ఎస్పీ బాధ్యతలు.. తెల్లారే సస్పెన్షన్

బళ్లారి ఘర్షణ, కాల్పులకు సంబంధించి జిల్లా ఎస్పీ పవన్ నిజ్జూర్‌ను సస్పెండ్ చేస్తూ డీజీపీ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులిచ్చారు. వాస్తవానికి పవన్ గురువారం మధ్యాహ్నమే బాధ్యతలు తీసుకున్నారు. కొన్ని గంటలకే సస్పెండవడం గమనార్హం.

ప్రైవేటు గన్‌మెన్ కాల్చారు..: గాలి

రాజశేఖర్ మరణానికి పోలీసు తుపాకీ కారణం కాదని, ప్రైవేటు గన్‌మెన్ తుపాకీ నుంచి వచ్చిన తూటాలే కారణమని గాలి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. అది ఎవరి తుపాకీనో పోలీసులు నిర్ధారిస్తారని మీడియాతో అన్నారు.

'శ్రేయ ఇన్‌ఫ్రా' 51 ఎకరాల భూములు జప్తు!

కర్నూలు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశ చూపి, ప్రజలను మోసగించిన కర్నూలుకు చెందిన శ్రేయ ఇన్‌ఫ్రా అండ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆ సంస్థకు చెందిన 51.55 ఎకరాలు భూమిని జప్తు చేసేందుకు సీఐడీకి అనుమతించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు వివిధ రాష్ట్రాల్లో ప్రజలను మోసం చేసి, దాదాపు రూ.206 కోట్లతో ఆ సంస్థ బోర్డు తిప్పేసిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన కర్నూలు పోలీసులు.. ఆ కేసును సీఐడీకి అప్పగించారు. శ్రేయ సంస్థ నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో 51.55 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. దాన్ని జప్తు చేయడానికి, దానిపై నియంత్రణకు అనుమతి ఇవ్వాలని సీఐడీ ప్రభుత్వానికి నివేదించింది. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం శ్రేయ ఇన్‌ఫ్రా సంస్థ భూమిని జప్తు చేసి, తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ తాజాగా జీవో జారీ చేశారు. ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు జరగకుండా చూడాలని ఏపీ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను ఆదేశించారు.

ఇంకొల్లులో చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

ఇంకొల్లు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీకి వెళ్లే ఐదేళ్ల చిన్నారి స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన చూసిన కన్నతల్లి కుప్పకూలింది. బాపట్ల జిల్లా ఇంకొల్లు ఎన్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్స్‌లో శుక్రవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రైవేటు స్కూల్ బస్సు వేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన పాంగి రమేశ్, పుణ్యవతి కొన్నేళ్లుగా ఇంకొల్లు ఎన్‌ఎస్‌ఎల్ నూలు మిల్లులో పనిచేస్తున్నారు. కంపెనీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు... మణికంఠ, ఓంకార్. ఐదేళ్ల ఓంకార్ టిఫిన్ కోసం ఉదయం నూలు మిల్లు ఆవరణలోని క్యాంటిన్ వద్దకు వెళ్లాడు. టిఫిన్ తీసుకొని ఇంటికి వస్తున్న సమయంలో పిల్లలను ఎక్కించుకునేందుకు లోపలికి వచ్చిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు కిందపడి మృతి చెందాడు. సీఐ వైవీ.రమణయ్య, ఎస్సై సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు.

కోనసీమ కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం

- **ఆత్రేయపురంలో డ్రాగన్ పడవ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు**
- **కయాకింగ్ బోటుపై ట్రయల్ రన్ చేస్తుండగా తిరగబడిన బోటు**
- **నీటిలోకి జారిపోయిన కలెక్టర్... లైఫ్ జాకెట్ ఉండడంతో తప్పిన ప్రమాదం**


బోటు తిరగబడడంతో నీటిలో పడిపోయిన కలెక్టర్

ఆత్రేయపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కలెక్టర్‌కు ప్రమాదం తప్పింది. సంక్రాంతికి ముందే మూడు రోజులపాటు జాతీయ స్థాయి డ్రాగన్ పడవ పోటీలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రధాన కాలువలో నిర్వహిస్తున్నారు. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరిట టూరిజం శాఖ, స్థానిక కమిటీ సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి జల క్రీడాకారులు ఈ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం డ్రాగన్ పడవ పోటీల ట్రయల్ రన్‌ను ఆత్రేయపురం మండలం పులిదిండి-తాడిపూడి వరకూ ప్రధాన కాలువలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పడవలపై ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్‌కు తనకు ఎంతో ఇష్టమైన కయాకింగ్ బోటింగ్ చేశారు. ఆ సమయంలో బోటు తిరగబడింది. ఆయన నీటిలోకి జారిపోయారు. లైఫ్ జాకెట్ ఉండడంతో ఆయనకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. కలెక్టర్ బోటును అనుసరిస్తున్న గజ ఈతగాళ్లు ఆయనకు సహకరించి మరో బోటులోకి ఎక్కించారు. కాసేపు ఉపశమనం పొందిన కలెక్టర్ యథావిధిగా డ్రాగన్ పడవపై ట్రయల్ రన్ నిర్వహించారు. కాగా, ఆత్రేయపురంలో జాతీయ స్థాయి డ్రాగన్ పడవ పోటీలు మాత్రమే నిర్వహిస్తున్నారు. కయాకింగ్ బోటింగ్ అదనపు ఆకర్షణ మాత్రమే. గతేడాది కూడా కలెక్టర్ ప్రత్యేక ఆసక్తితో ఈ కయాకింగ్ బోటింగ్‌ను డ్రాగన్ పడవ పోటీల సమయంలో నిర్వహించారు. ఈ బోటింగ్ చేసేవాళ్లు ఇలా నీటిలో పడడం సర్వసాధారణమేనని, కలెక్టర్ స్విమ్మింగ్ క్రీడాకారుడు కావడంతో వెంటనే తేరుకుని మళ్లీ డ్రాగన్ పడవపై ట్రయల్ రన్‌లో పాల్గొన్నారని అధికార వర్గాలు తెలిపాయి.

సామాన్య భక్తులకు అభిషేక దర్శనం

- **15 ఏళ్ల తర్వాత తొలిసారి అమలు**
- **సర్వదర్శన భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం**
- **కిటకిటలాడుతున్న తిరుమల..**

తిరుమల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రద్దీ భారీగా పెరిగిన నేపథ్యంలో సామాన్య భక్తులకు ఊహించని విధంగా అభిషేక దర్శనం దొరికింది. కేవలం అడ్వాన్స్, సిఫారసుపై టికెట్లు పొందిన భక్తులను మాత్రమే ఈసేవకు అనుమతిస్తారు. అయితే శుక్రవారం అభిషేక సేవ జరుగుతున్న సమయంలోనూ సామాన్య భక్తులను దర్శనానికి అనుమతించారు. దీంతో సేవ జరిగిన 4.30 నుంచి 6 గంటల మధ్య దాదాపు 3వేల మందికి పైగా సర్వదర్శన భక్తులకు అభిషేక సేవలో స్వామిని దర్శించుకునే అదృష్టం లభించింది. దాదాపు పదిహేనేళ్ల క్రితం ఆగిపోయిన ఈ విధానాన్ని తిరిగి శుక్రవారం అమలుచేశారు. కాగా.. తిరుమలలో ఎలాంటి టోకెన్లు లేకుండా తిరుమలకు వచ్చిన వారికి శుక్రవారం తెల్లవారుజాము నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు మొదలయ్యాయి. గురువారం సాయంత్రం నుంచే తిరుమల కిటకిటలాడింది. రద్దీ అధికమవుతున్న క్రమంలో గురువారం రాత్రి 11.30 నుంచే దర్శనాలకు భక్తులను అనుమతించారు. ఏకాంతసేవ ప్రారంభమయ్యే వరకు దాదాపు 4వేల మందికి సర్వదర్శనాలు చేయించారు. తిరిగి శుక్రవారం వేకువజామున తిరుప్పావై, కైంకర్యాలు పూర్తయిన తర్వాత 2గంటల నుంచి సర్వదర్శనాలు కొనసాగాయి. ప్రస్తుతం బాటగంగమ్మ ఆలయం సర్కిల్ వద్ద నుంచి సర్వదర్శన భక్తులను అనుమతిస్తున్నారు. వీరు రింగురోడ్డులో దాదాపు రెండున్నర కిలోమీటర్లు దూరం ఉండే క్యూలైన్‌లో వెళ్లి నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 కంపార్టుమెంట్ల ద్వారా శ్రీవారిని దర్శించుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయానికి 45,900 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనం క్యూలైన్ ద్వారా వెళ్లినవారికి దాదాపు 16 గంటల దర్శన సమయం పడుతోంది. డిసెంబరు 30, 31, జనవరి 1 తేదీల్లో 2.02 లక్షల మందికి వైకుంఠద్వార దర్శనం లభించింది. గత వైకుంఠద్వార దర్శనాల్లో తొలి మూడురోజులతో పోలిస్తే 18,461 మంది భక్తులు అదనంగా ఉత్తర ద్వార ప్రవేశం చేశారు.

ఆర్జిత, బ్రేక్ దర్శనాలు రద్దు: టీటీడీ

సామాన్య భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు సజావుగా సాగేందుకు వీలుగా శ్రీవారి ఆలయంలో అన్ని ఆర్జితసేవలు, బ్రేక్ దర్శనాలు, ప్రత్యేక దర్శనాలను రద్దుచేసినట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జనవరి 8 వరకు పూర్తిస్థాయిలో సర్వదర్శనాలు ఉన్నందున భక్తులు సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలని కోరారు. క్యూలైన్‌లో వేచి ఉండే భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు శ్రీవారిసేవకుల ద్వారా నిరంతరాయంగా అందిస్తున్నట్టు తెలిపారు.


తిరుమల క్యూకాంప్లెక్స్‌లో బారులు తీరిన భక్తులు

సమర్థంగా క్యూలైన్ల నిర్వహణ

గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి వైకుంఠద్వార దర్శనాల్లో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా టీటీడీ పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టి సక్సెస్ అయింది. ఎంతమంది భక్తులు వచ్చినా చిన్నపాటి సమస్య లేకుండా పటిష్ఠ క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులు ముందుకు కదిలే క్రమంలో తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా ప్రతి వంద మీటర్లకు అడ్డుగా ఓ బారికేడ్ ఏర్పాటు చేశారు. విడతల వారీగా యాభై నుంచి వందమంది చొప్పున భక్తులను అనుమతించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో ఉన్న ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా క్యూలైన్లను నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నారు. రద్దీ ఎక్కడ అధికంగా ఉంది, ఎక్కడ ఖాళీలు ఉన్నాయో పరిశీలిస్తూ ఆయా ప్రాంతాల్లోని అధికారులను అప్రమత్తం చేయడంతో క్యూలైన్లన్నీ ఏకకాలంలో సాఫీగా సాగాయి. దాదాపు 3,500 మంది పోలీసు, విజిలెన్స్ సిబ్బందితో క్యూలైన్లను నిర్వహిస్తున్న క్రమంలో నాలుగో రోజు సర్వదర్శన భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు ప్రశాంతంగా ముగిశాయి.

టీటీడీ ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం

టీటీడీ ట్రస్టులకు శుక్రవారం రూ.20 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన రైడాన్ టెక్నాలజీస్ ప్రవేట్ లిమిడెట్ సంస్థ సీఈవో వంగల హర్షవర్ధన్ రూ.10లక్షలు ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు, గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జాయింట్ డైరెక్టర్ నేలబొట్ల శుభ సౌజన్య రూ.10 లక్షలు బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు అందజేశారు.

వెనుక కూర్చున్న వారూ హెల్మెట్ పెట్టాల్సిందే

ఒకటో తేదీ నుంచి విశాఖ పోలీసుల నిబంధన

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించే విషయంలో నిబంధనలను విశాఖ ట్రాఫిక్ పోలీసులు కచ్చితంగా అమలు చేస్తున్నారు. వాహనం నడిపేవారే కాదు, వెనుక కూర్చున్న వారు (పిలియన్ రైడర్) హెల్మెట్ పెట్టుకోకపోయినా రూ.1,035 జరిమానా విధిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నెల 1నుంచి విశాఖ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోతే సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి ఈ-చలాన్ జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు మోటార్ సైకిల్ నడిపే వ్యక్తికి హెల్మెట్ లేకపోతే జరిమానా విధిస్తున్నారు. ఇప్పుడు వెనుక వ్యక్తికి హెల్మెట్ లేకపోయినా చలానా వస్తుండటంతో వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. గత రెండు రోజుల్లో పిలియన్ రైడర్‌కు హెల్మెట్ కారణంతో వేలాది ఈ-చలాన్‌లు జారీఅయినట్టు పోలీసులు చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు 31వరకు దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించామని, జనవరి 1 నుంచి ఈ-చలాన్‌లు జారీ ప్రక్రియ ప్రారంభించామని ఉన్నతాధికారులు వివరించారు.

12న నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ62

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాహుబలి రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహం బ్లూబర్డ్ ప్రయోగంతో గతేడాదిని ఘనంగా ముగించిన ఇస్రో.. కొత్త ఏడాది ఆరంభంలోనే మరో ప్రయోగానికి సిద్ధమవుతోంది..! తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి ఈ నెల 12న పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా భూపరిశీలన ఉపగ్రహం ఈవోఎస్-ఎన్1ను కక్ష్యలోకి పంపనున్నారు. ఇప్పటికే షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక వద్దనున్న పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ భవనం (పిఫ్) వద్ద రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తిచేసి లాంచ్‌ప్యాడ్ దగ్గరున్న ఎంఎస్‌టీ టవర్ వద్దకు చేర్చారు. ఈ నెల 12న ఉదయం 10.17 గంటలకు దీన్ని ప్రయోగించే అవకాశం ఉంది. మొదట 10న ప్రయోగించాలని భావించినా, సాంకేతిక కారణాలతో 12కు వాయిదా పడింది. ఈ రాకెట్ నాలుగో దశలో స్పెయిన్ చెందిన స్పానిష్ స్టార్టప్ ఆర్బిటల్ పారాడైమ్ భాగస్వామ్యంతో నిర్మించిన 25కిలోల కెస్ట్రెల్ ఇనిషియల్ డెమాన్‌స్ట్రేటర్ (కేఐడీ) క్యాప్సూల్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించనున్నారు. దీంతోపాటు మరో 18 రకాల పేలోడ్స్‌ను కూడా ఈ రాకెట్ ద్వారా కక్ష్యలోకి పంపనున్నట్లు ఇస్రో వర్గాల సమాచారం.

ఉత్తరాంధ్రకు రైల్వేశాఖ శుభవార్త

మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్

న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు కేంద్ర రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. ప్రయాణికుల సౌకర్యార్థం మూడు ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మూడు రైల్వేస్టేషన్లలో హాల్టింగ్(ఆగడం) కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రయోగాత్మక ప్రాతిపదికన బ్రహ్మపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు తిలారు వద్ద, పూరి-అహ్మదాబాద్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్ఛాపురం వద్ద, భువనేశ్వర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు బారువా వద్ద ఆపనున్నారు. వీలైనంత త్వరలో ఈ స్టేషన్లలో ఆయా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తామని రైల్వే శాఖ తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.